అపరాధ పరిశోధన

రు. 5.50 | అక్టోబర్ '82

Blank Page

సంపుటి: 43
సంచిక: 4

R S [illegible]
5/9/87

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 84 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

నవంబరు, 1986

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-218

[ఫలితాలు]

సెప్టెంబరు '86 నెల "అపరాధ పరిశోధన పోటీ_218"కి సరియైన సమాధానాలు:

1. మత్స్యకారులు.
2. కామన్వెల్తు.
3. జనాభా.
4. మాంత్రికుడు.
5. కులానికి.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి డిసెంబరు '86 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ వి. వినోద్‌రావ్, C/o కె. లక్ష్మణరావ్, ఇంటి నెం: 7-1-2, బస్‌స్టాండ్ రోడ్, సిరిసిల్లా-505 301.
(కరీంనగర్ జిల్లా.)

(2) శ్రీ బి. రాజశేఖర్, S/o వి. పరమేశ్వర్, ఇండియన్ ఆయిల్ డీలర్, నాగర్‌కర్నూలు-509 209.
(మహబూబ్‌నగర్ జిల్లా.)

(3) శ్రీ ఈజర్ల సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రభ ఏజెంట్, పామిడి—515 775. (అనంతపురం జిల్లా.)

ఈ నెల్లో...

కథలు (మాస పత్రిక)

4. స్వేచ్ఛకోసం జైలు—జొన్నలగడ్డ రామలక్ష్మి
24. ఉప్పొంగిన గోదావరి—సుంకరి రాంప్రసాద్
47. నీలిరంగు పట్టుచీర—వి. పద్మప్రియ
64. భయం—వసుంధర
82. ప్రతీకారజ్వాల—బొమ్మిడి అచ్చారావు
98. మూగజీవాల బలి—కె. బి. యస్. కుమార్
110. కఠిన శిల—హుస్సేన్ బాషా
154. నిధి నీ కోసం—ఎమ్. రాధిక
175. మరణయాత్ర—(సీరియల్) ప్రతాప రవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. ముగ్గురు సాధువులు—సుంకరి రాంప్రసాద్
43. మహా పతివ్రత—వసుంధర
84. దెయ్యాల బండి—అపర్ణా నైటింగేల్
114. బ్లూ ప్రింట్స్—దీపిక
157. అన్వేషణ—(సీరియల్) వి. యస్. రావ్

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

స్వేచ్ఛకోసం జైలు

జొన్నలగడ్డ రామలక్ష్మి

బ్యాంకులో రష్‌గా ఉంది.

సమయం పన్నెండు గంటలు.

సుమారు పాతికేళ్ళ యువకుడు బ్యాంకులో ప్రవేశించాడు. తిన్నగా క్యాషియర్ వద్దకు వెళ్ళాడు.

క్యాషియర్ అతడి వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"నన్ను గోపీనాధ్ పంపాడు" అన్నాడు అతడు.

"గోపీనాధ్ ఎవరు?" అన్నాడు క్యాషియర్.

"గోపీనాధ్ ఎవరో తెలియదా?" అన్నాడు అతడు.

"తెలియదు...."

"అయితే మీ ఏజంటుగారి నడుగు...."

"నువ్వెవరు?"

"ఏజంటుగారి నడుగు. ఆయనే చెబుతారు...."

"ఇప్పుడు బిజీగా ఉన్నాను" అన్నాడు క్యాషియర్.

"ఆలస్యం చేస్తే చాలా ప్రమాదం."

"ఏమవుతుంది?"

"బ్యాంకు పేలిపోతుంది...."

క్యాషియర్ ఉలిక్కిపడి అతడివంక చూశాడు.

యువకుడు చాలా మామూలుగా అమాయకంగా చూస్తున్నాడు.

"ఎందుకు పేలిపోతుంది?"

"బ్యాంకులో బాంబుంది? సరిగ్గా ఇంకో పావు గంటలో పేలుతూం దది...." అన్నాడా యువకుడు తాపీగా.

క్యాషియర్ అతడివంక ఆశ్చర్యంగా చూసి — "నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?" అన్నాడు.

"తెలియవలసింది నాక్కాదు. నీకు. అర్జంటుగా ఏజంటును కలుసుకో. ఎంతో టైము లేదు. ఇంక పద్నాలుగు నిముషాలే టైముంది...." అన్నాడా యువకుడు.

అతడు గట్టిగానే మాట్లాడుతున్నాడు. అందువల్ల కొన్ని మాటలు కస్టమర్సు చెవుల కూడా పడ్డాయి.

బ్యాంకులో కలకలం రేగింది.

6

బాంబు.... బాంబు....

అందరినోటా ఇదే మాట....

ఈలోగా ఏజంట్‌గారి బల్లమీద ఫోన్ మ్రోగింది.

"హలో!" అన్నాడాయన.

"నేను—గోపీనాథ్‌ని...." అవతలి గొంతు.

"గోపీనాథ్ అంటే?"

"నీ బ్యాంకిలో బాంబు పెట్టినవాడు...."

"బాంబేమిటి?"

"సరిగ్గా పదమూడు నిమిషాల్లో అది పేల్తుంది. పోలీసుల్ని పిలిచే టైము లేదు. అంతా త్వరగా బయటకు పొండి...."

"పోకపోతే?"

"బ్యాంకి భవనపు శిథిలాల్లో మీ శరీరాలూ శిథిలమై పోతాయి...."

"హలో—ఎవర్నువ్వు?"

అవతల క్లిక్‌మంది.

సరిగ్గా అప్పుడే క్యాషియర్ అక్కడకు వచ్చి—"సార్ గోపీనాథ్ ఎవరో మీకు తెలుసా?" అన్నాడు.

"గోపీనాథ్ అంటే బ్యాంకిలో బాంబుపెట్టిన వాడేనా?"

"అంటే మీకు తెలుసన్న మాట!"

"అవును. నీకెలా తెలుసు?"

"ఇంక పన్నెండు నిముషాలే టయిముంది" - క్యాషియర్ కంగారుగా అన్నాడు.

"బ్యాంకిలో నిజంగా బాంబుందంటావా?" ఏజంట్ అనుమానంగా అడిగాడు.

"అది నిజంగా వుంటే—ఆలోచిస్తూ ఇక్కడే కూర్చుంటే—ఆ తర్వాత మనం మిగలం" అన్నాడు

క్యాషియర్.

"ఏం చేద్దాం?"

"పోలీసులకు ఫోన్ చేసి అందర్నీ హెచ్చరించడం మంచిది."

అప్పటికే బ్యాంకిలో పెద్ద హడావుడి. రష్‌లో తొడ తొక్కిడి. బ్యాంకుద్యోగులు కూడా కంగారుగా బయటకు వస్తున్నారు.

ఏజంటు సద్దిచెప్పడానికి ప్రయత్నిస్తూ తనూ హడావుడి పడుతున్నాడు.

పావుగంటలో గానే జనం బ్యాంకులోంచి బయటకు వచ్చారు.

బాంబు పేలితే రాతిముక్కలు వచ్చి తమకు తగుల్తా యన్న భయంతో చాలామంది బిల్డింగుకు దూరంగాకూడా వెళ్ళారు.

కొందరు ధైర్యవంతులు దగ్గర్లోనే వున్నారు.

గార్డు మరీ దగ్గర్లో వున్నాడు.

బ్యాంకు ఖాళీగా ఉన్న సమయంలో లోపలకెవ్వరూ వెళ్ళకూడదని అతడి తాపత్రయం.

పావుగంట గడిచింది.

ఏమీ జరుగలేదు.

మరో పావుగంట....

అయినా ఏమీ జరుగలేదు.

ఈలోగా పోలీసులు వచ్చారు. వారుకూడా లోపలకు వెళ్ళేముందు మరో పావుగంట ఎదురుచూశారు.

బాంబులను డిటెక్టు చేయడానికి ప్రత్యేక శిక్షణ పొందిన కుక్కలు కూడా వచ్చాయి.

సుమారు గంటసేపు బ్యాంకు బిల్డింగును క్షుణ్ణంగా

శోధించటం జరిగింది.

"ఎవరో మిమ్మలి ఫూల్ చేశారు" అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

"దేశం నిండా టెర్రరిస్టులెన్నో ఘోరాలు చేస్తున్నారు. నిన్ననేకదా జనరల్ వైద్యా హత్యచేయబడ్డారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌ని లైటుగా తీసుకుందుకు లేదు" అన్నాడేజంటు గారు.

"మంచిపనే చేశారు. కానీ అసలు జరిగిందేమిటో వివరంగా చెప్పండి."

అంతా లోపలకు వెళ్ళారు.

కష్టమర్స్‌ని క్లియర్ చేయడానికారోజు ఎక్స్‌ట్రాగా పనిచేయడానికి స్టాఫ్ నిర్ణయించుకుంది.

ఇన్‌స్పెక్టర్ ఏజంటు చెప్పింది విని "ఆ గోపీనాథ్ ఎవరో?" అన్నాడాశ్చర్యంగా.

"నాకు తెలియదు. కానీ...." అంటూ క్యాషియర్ని పిలిచాడు.

కానీ ఆయన పిలిచేలోగానే క్యాషియర్ వచ్చి "సార్ లక్షరూపాయలు క్యాష్ మిస్సయింది" అన్నాడు కంగారుగా.

"జాగ్రత్తగా చూశావా?" అన్నాడు ఏజంటుగా రులిక్కిపడి.

"చూశాను సార్....అవన్నీ వందరూపాయల నోట్లు.. కొత్తకట్టలు....అవి తప్ప మిగతా పాత వందరూపాయల నోట్ల కట్టలన్నీ ఉన్నాయి."

ఇన్‌స్పెక్టర్ కళ్ళు పెద్దవయ్యాయి.

"బ్యాంకు తలుపులు మూయించండి. అందర్నీ శోధించాలి!" అన్నాడు అతడు.

"అంటే దొంగ ఇంకా ఇక్కడే ఉంటాడనా?" అన్నాడు ఏజంటుగారు.

"అవకాశముంది!" అన్నా డినస్పెక్టరు.

బ్యాంకు గేటు మూసేశారు. పోలీసులక్కడున్న ప్రతి ఒక్కరినీ శోధించడం జరిగింది. బ్యాంకు స్టాఫ్‌ని కూడా వదిలిపెట్టలేదు.

"మా స్టాఫ్ అంతా నిజాయితీపరులు...." అన్నాడు ఏజంటుగారు.

"ఇలాంటి పరిస్థితుల్లో దొంగతనం చేసే అవకాశం కస్టమర్సుకంటె స్టాఫ్‌కే ఎక్కువగా ఉంటుంది—" అన్నా డినస్పెక్టర్.

బ్యాంకు స్టాఫ్‌లో ముగ్గురూ, కస్టమర్సులో అయిదు మొత్తం ఎనమండుగు రాడవారున్నారు. ఇనస్పెక్టర్ వాళ్ళను చెక్ చేయించడాని కిద్దరాడపోలీసులను రప్పించాడు.

ఎవరిదగ్గరా ఏమీ ఆధారం దొరకలేదు—ఆ దొంగతనానికి సంబంధించి.

పోలీసులు వెళ్ళిపోయారు. ఇనస్పెక్టరుండిపోయాడు.

కస్టమర్సందరూ క్లియరయ్యాక అతడు— "దొంగ చాలా తేలికగా తాననుకున్నది సాధించాడు. మీలో ఒకరి సహకారముండి ఉంటే తప్ప—ఇది సాధ్యపడదు. మిమ్మల్నింకా కొన్ని ప్రశ్నలడగాలి—" అన్నాడు.

"మమ్మల్నా?" అన్నాడు ఏజంటుగా రాశ్చర్యంగా.

"అవును. అసలేం జరిగిందో మరోసారి వివరంగా చెప్పండి—" అన్నాడినస్పెక్టర్.

చెప్పడానికిద్దరిదగ్గరే ఉంది ప్రత్యేక విశేషం. బ్యాంక్

ఏజంట్‌గారు, క్యాషియర్. వాళ్ళు మరోసారి తమ అనుభవాలు చెప్పారు.

మిగతా స్టాఫంతా ఒక్కరు కూడా దొంగతనం చూడ లేదు.

"ఈ వ్యవహారంలో కనీసం ఇద్దరున్నారు. ఒకడు గోపీనాధ్. రెండవవాడు బ్యాంకుకు వచ్చిన యువకుడు. వాళ్ళిద్దరూ కలిసి చాలా తెలివిగా పథకం వేశారు. ఒకడు మీకు ఫోన్ చేశాడు. రెండోవాడు బ్యాంకుకువచ్చి మీ క్యాషియర్ని కలుసుకున్నాడు. బెదరగొట్టి కలకలం సృష్టించాడు. లక్షరూపాయలు తేలికగా కాజేశారంటే—మీ బ్యాంకుద్యోగస్థులలో ఒకరి సహకారముండి ఉండాలని నా అనుమానం. ఈ రోజునుంచీ మీరు మీ ఉద్యోగులందర్నీ శ్రద్ధగా గమనించండి. వారిలో అనుమానించదగ్గ మార్పేది ఉన్నా నాకు తెలియజేయండి—" అన్నాడు ఇనస్పెక్టరు.

"బ్యాంకుద్యోగమంటే పది లక్షలపెట్టు ఈ రోజుల్లో, లక్ష రూపాయల చోరీ కోసం ఇంత రిస్కు ఎవరూ తీసుకోరు. అందులోనూ ఆ డబ్బును కనీసం మరో ఇద్దరితో పంచుకోవాలి...." అన్నాడు బ్యాంకు ఏజంటుగారు.

"నా ఉద్దేశ్యం వేరు. కేవలం డబ్బుకి ఆశపడే ఈ పని చేసి ఉండకపోవచ్చు. మీ ఉద్యోగులకు పాతిక ముప్పై వేల కోసం దొంగతనం చేయాల్సిన అవసరం ఉండక పోవచ్చు....కానీ పదివేలకోసం ప్రాణాలు తీసేవాళ్ళెందరో ఉన్న ఈ రోజుల్లో లక్షరూపాయల కోసం ఏమైనా చేయగలవారెందరో ఉంటారు. అలాంటి వారు పథకంవేసి మీ ఉద్యోగుల్లో ఎవరి పిల్లల్నో, తలిదండ్రుల్నో, భార్యల్నో

కిడ్నాప్‌చేసి బెదిరించి ఉండవచ్చుగా—" అన్నాడు ఇనస్పెక్టరు.

"అవును. నా కిది స్ఫురించనేలేదు—" అన్నాడు ఏజంట్‌గారు.

"ఇటీవల బ్యాంకు చోరీలు బాగా ఎక్కువై పోయాయి. నేనిది సవాలుగా తీసుకుంటున్నాను. మీతో సహా మీ ఉద్యోగులందరిమీదా నిఘావేసి అసలు విషయం ఆరా తీస్తాను. కానీ...." అన్నా డినస్పెక్టర్.

"కానీ....?" అన్నాడు ఏజంటుగారు.

"నిజంగానే మీ బ్యాంకుద్యోగుల హస్తం ఈ చోరీలో లేకపోతే ఆ దొంగను పట్టుకోవడం చాలా కష్టం. వాడు చాలా తెలివైనవాడని లెక్క...." అంటూ నిట్టూర్చా డినస్పెక్టర్.

2

"వారం రోజుల్నించి చూస్తున్నాను. పోలీసులతో పెద్ద న్యూసెన్సుగా ఉంది—" అన్నాడు క్యాషియర్ ఏజంటుగారితో—

"అవును. అంతా ఇబ్బంది పడుతున్నారు—" అంటూ ఏజంటుగారు నిట్టూర్చాడు.

ఆయన్నందరూ ఏజంటుగారనే అంటారు. నిజాని కాయన బ్రాంచి మేనేజరు. తన ఉద్యోగులందర్నీ కన్న బిడ్డల్లా చూసుకుంటా డాయన. ఆయన వయసు నలభై అయిదుంటుంది.

దొంగతనం జరిగిన నాటినుండి ఆ బ్యాంకులో పనిచేసే ఉద్యోగులందరిమీదా పోలీసు నిఘా పెరిగింది. ఇంట్లోంచి ఎవరు బయటకు వెళ్ళినా, బయటినుంచి కొత్తవారెవరు

వచ్చినా వెంటనే పోలీసులు ప్రశ్నలు వేస్తున్నారు.

దురదృష్టమేమిటంటే క్యాష్ బాక్స్‌మీద వేలిముద్రలు పోలీసులు తీసుకున్నారు. క్యాషియర్‌వీ, ఏజంటుగారిదీ కాక మరో ఇద్దరి వేలిముద్రలు స్పష్టంగా ఉన్నాయి దాని పైన. అందులో ఒకటి బ్యాంకు ఉద్యోగివి. అతడప్పు డప్పుడు క్యాష్ బాక్సును ముట్టుకుంటూంటాడు.

ఆ రోజు డబ్బు లెక్కపెట్టే సమయంలో అతడు కాసేపు క్యాషియర్‌కు సాయంచేశాడు. గుర్తు తెలియని వేలిముద్రలు దొంగవై ఉండాలని పోలీసుల భావన. అందుకోసమని వారెందరివో వేలిముద్రలు సంపాదిస్తు న్నారు. ముఖ్యంగా బ్యాంకుద్యోగుల తాలూకు వారందరినీ వేలిముద్రలకోసం వేటాడుతున్నారు. ఇది అందరికీ చాలా అవమానంగా ఉంది.

కానీ ఎవరూ అభ్యంతర పెట్టడంలేదు.

అభ్యంతర పెడితే అనుమానం పెరుగుతుందని అందరి భయమూ!

అంతేకాకుండా బ్యాంకు దొంగతనాలు మరీ ఎక్కువై పోయాయి.

బ్యాంకు దొంగతనాలు, పోలీసుల బెడదగురించి ఏజంటుగారితో కాసేపు మాట్లాడేక క్యాషియర్ తిరిగి తన సీట్లోకి వచ్చాడు.

ఆ రోజు కస్టమర్స్ రష్ ఆట్టేలేదు.

క్యాషియర్ కాలక్షేపం కోసం పక్కతణ్ణి పేపరడిగాడు.

"తేలేదు గురూ" అన్నాడతడు.

క్యాషియర్ సీట్లోంచి లేచి వెళ్ళి ఎవరైనా పేపరు తెచ్చారేమోనని అడిగాడు.

ఎవ్వరూ తేలేదు.

ఒకతడిదగ్గర మూడు రోజుల క్రితం పేపరుంది. అది సొరుగులో పడేసి మర్చిపోయాడతడు.

"పోనీ అదే ఇయ్యి" అన్నాడు క్యాషియర్.

సాధారణంగా క్యాషియర్‌గానీ మరెవ్వరుగానీ పేపరు క్షుణ్ణంగా చదవరు. హెడ్‌లైన్సు చూస్తారు. హడావుడిగా తమకాసక్తి ఉన్నవార్తలు చూసి పేజీలు తిరగేసేస్తారు.

అందుకే క్యాషియర్ తీరుబడిగా పేపరు చూడవచ్చునను కున్నాడు.

ఇలా పేపరు చూసే సందర్భాలు చాలా అరుదతడి జీవితంలో.

కానీ అరుదైన సంఘటనల్లోంచి అద్భుత విశేషాలు బయటపడుతూంటాయి....

క్యాషియర్ పేపర్లో రెండో పేజీలో ఒక ఫొటో చూసి ఉలిక్కిపడ్డాడు. ఆ ఫోటో నిస్సందేహంగా బ్యాంకు దొంగది....

ఆ రోజు గోపీనాథ్ పేరు చెప్పి తన్ను బెదిరించిన బ్యాంకు దొంగ అతడే....అనుమానం రవంతకూడా లేదు.

ఆత్రుతగా వివరాలు చదివాడు క్యాషియర్.

ఆ యువకుడి పేరు కిషోర్. సంపన్నుడు. మతి స్థిరం లేదు. ఇంట్లోంచి పారిపోయాడు. వెతికిచ్చినవారికి వెయ్యి న్నూట పదహార్లు బహుమానం ప్రకటించాడు కిషోర్ మేనమామ.

అక్కడ మేనమామ ఇంటి అడ్రసు, ఫోన్ నంబరు ఉన్నాయి.

క్యాషియర్ పేపరు తీసుకుని ఏజంటుగారి దగ్గరకు

పరుగెత్తి హడావుడిగా విషయం చెప్పాడు.

"నువ్వు నిజమే చెబుతున్నావా?"

"ఊఁ"

ఏజంటుగారా యువకుణ్ణి చూడలేదు. క్యాషియర్ తన వద్దకు వచ్చి విషయం చెప్పేక ఆయన వచ్చి చూసేసరికా యువకుడు లేడు.

"మరోసారి ఆలోచించు—" అన్నాడేజంటుగారు.

"ఎందుకని?"

"ఈ కిషోర్ సంపన్నుల కుర్రాడు. మతి స్థిరంలేనివాడు. ఇలాంటి దొంగతనం చేయలేడు...."

"లేదుసార్.... పిచ్చివాళ్ళకొకోసారి అతి తెలివి వస్తుంది...."

"మరి గోపీనాథ్ ఎవరు?"

"అవన్నీ నాకెలా తెలుస్తాయి?"

"ఒకసారి మనం కిషోర్ మేనమామకు ఫోన్‌చేసి చూద్దాం—" అన్నాడేజంటుగారు.

ఫోన్ చేయగానే లైన్ దొరికింది.

"హలో—సోమేశ్వర్‌గారేనా:" అన్నాడేజంటుగారు.

"అవును—మీ రెవరు?"

"మీ మేనల్లుడు కిషోర్ గురించిన ఆచూకీ చెబుదామని!"

అవతలనుంచి సన్నగా నవ్వు వినబడింది— "ఆచూకీ ఏమిటి? వాడిప్పుడింట్లోనే ఉన్నాడు...."

"ఇంట్లోనే ఉన్నాడా?" ఆశ్చర్యంతో నోరు తెరిచాడు ఏజంటుగారు.

"అవును—దొరికి మూడ్రోజులయింది...."

"మీకు గోపీనాథ్ తెలుసా?" అన్నాడు ఏజంటుగారు.

"ఆశ్చర్యంగా ఉందే నా పేరు మీకెలా తెలుసు?" అన్న అవతలివైపు గొంతులోని ఆశ్చర్యం ఫోన్ తీగ ల్లోంచీ పయనించి ఏజంటుగారిని చేరుకుంది.

"మీ పేరు సోమేశ్వర్ గదా...." అన్నాడు ఏజంటు గారు.

"అవును పి.జి. సోమేశ్వర్ నాపేరు. అంటే పి. గోపీనాధ సోమేశ్వర్. బయటివాళ్ళ కందరికీ సోమేశ్వర్ని. ఇంట్లోవాళ్ళంతా నన్ను గోపీనాధ్ అనే అంటారు...."

"మీ మేనల్లుడు కూడా మిమ్మల్ని గోపీనాధ్ అనే అంటాడా?"

"ఏం—వాడు మా యింట్లోని వాడు కాడా—వాడు నా మేనల్లుడే" అవతలివైపు నుంచి నవ్వు వినిపించింది.

"థాంక్స్. సారీఫర్ డిస్టర్బెన్స్...."

"ఇట్సాలైరైట్....మీకు మావాడి ఆచూకీ ఎప్పుడు తెలిసింది? ఎక్కడ తెలిసింది."

"అవన్నీ ఇప్పుడెందుకులెండి....ఉంటాను" అంటూ ఫోన్ పెట్టేశా డేజంటుగారు.

క్యాషియర్‌కి కొంత అర్ధమయింది. ఏజంటుగారు చెప్పింది విని "ఫోన్ అప్పుడే పెట్టేశారేం?" అన్నాడు.

"వ్యవహారంలో ఏదో తిరకాసుందనిపిస్తూంది. అర్జం టుగా పోలీస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి ఇన్‌స్పెక్టర్‌గారికి విషయం చెప్పటం మంచిది" అన్నాడేజంటుగారు.

3

ఇన్‌స్పెక్టరు ఏజంటుగారి టెలిఫోన్ సందేశాన్ని సీరి యస్‌గా తీసుకోలేదు. అంతా అసందర్భంగా అనిపిం చింది.

కిషోర్ సంపన్నుడి కొడుకు. మతి స్థిరంలేదు.

అతడికి డబ్బవసరమూ లేదు. పథకంవేసే తెలివీ లేదు.

తన ఆలోచనలిలా ఉన్నప్పటికీ ఇన్‌స్పెక్టర్ డ్యూటీ మాత్రం చేశాడు. విషయమిది అని చెప్పకుండా సోమేశ్వర్ ఇంటికి వెళ్ళి అతడు తప్పిపోయిన వివరాలన్నీ అడిగి తెలుసుకుని ఎలా దొరికాడో కూడా అడిగి తెలుసుకుని తెలివిగా వేలిముద్రలు సేకరించాడు.

సోమేశ్వర్ ఆస్తి వ్యవహారాలన్నీ చూసే మేనేజర్ ముకుందం కిషోర్ని తిరిగి పట్టుకోగలిగాడు.

అయితే బ్యాంకు దొంగతనం జరిగిన రోజున కిషోర్ ఎక్కడున్నాడో సోమేశ్వర్‌కి గానీ, ముకుందానికి గానీ తెలియదు.

కిషోర్ని ప్రశ్నలు వేస్తే అన్నింటికీ తనకేమి తెలియదనే అతడు బదులిచ్చాడు.

బ్యాంకు దొంగతనం గురించి ఇన్‌స్పెక్టరక్కడేమీ మాట్లాడలేదు.

తర్వాత అద్భుతమైన విశేషం జరిగిపోయింది.

కిషోర్ వేలిముద్రలు బ్యాంకు క్యాషిబాక్సుమీది వాటితో సరిపోయాయి.

ఇన్‌స్పెక్టరిక జాప్యం చేయలేదు. అతడు మరోసారి బ్యాంకు క్యాషియర్ని కలుసుకుని కిషోర్ గురించి వివరాలడిగాడు. తర్వాత నలుగురు కానిస్టేబుల్సుతో సోమేశ్వర్ ఇంటికి వెళ్ళాడు.

సోమేశ్వర్ అతడి రాకకు ఆశ్చర్యపడ్డాడు.

“నేను కిషోర్‌ని అరెస్టు చేయడానికి వచ్చాను”

అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కిషోరేం చేశాడు?"

"బ్యాంకు దొంగతనం" అంటూ వివరాలు చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"వాడా—ఆ వెర్రివాడా?" అన్నాడు సోమేశ్వర్.

"అతడు వెర్రివాడని నేననుకోను. ఇందులో మీ చేయి కూడా ఉందని నా అనుమానం. అతడు బ్యాంకులో మీ పేరు చెప్పాడు. ఆ వెనువెంటనే ఫోన్ వచ్చింది...."

సోమేశ్వర్ తెల్లబోయి "అంటే నేను, కిషోర్ కలిసి ఈ దొంగతనం చేశామంటారా?" అన్నాడు.

"అవును. మీ పథకం కూడా నేను వివరించి చెప్ప గలను."

"చెప్పండి...." అన్నాడు సోమేశ్వర్ అసహనంగా.

"కిషోర్‌కు మీరు పిచ్చి అని ప్రచారం చేశారు. ఆ పిచ్చితో ఇంట్లోంచి పారిపోయినట్లు ఒక ప్రకటన కూడా యిచ్చారు. వెతికి పట్టుకున్నవారికి వెయ్యిన్నూటపదహార్లు బహుమతి కూడా ప్రకటించారు. అయితే మీ ప్రకటన కిషోర్ ఇంట్లోంచి పారిపోయిన వెంటనే పేపర్లో రాలేదు. బ్యాంకు దొంగతనం జరిగిన కొద్దిరోజులకు వచ్చింది. అంటే బ్యాంకు దొంగతనానికి ముందే అతడి ఫోటో పేపర్లో పడడం మీ కిష్టంలేదు."

సోమేశ్వర్ కలగజేసుకుని "కిషోర్‌కు తలిదండ్రులు యాక్సిడెంట్‌లో మరణించినప్పట్నించీ మతిభ్రమణ ప్రారంభమైంది. పేరుపొందిన మన స్తత్వ శాస్త్రనిపుణుల ద్వారా వైద్యం చేయిస్తున్నాను. అయితే కిషోర్‌కు మతి భ్రమించిన విషయం ప్రచారం కావడం నా కిష్టంలేదు.

అందుకే వాణ్ణి వెతికి పట్టుకోడానికి రహస్యంగా నా ప్రయత్నాలు నేను చేసి అవి ఫలించకపోగా పేపర్లో ప్రకటన ఇచ్చాను" అన్నాడు.

"అయినా ఆ తర్వాత కూడా కిషోర్ని మీ మేనేజరే వెతికి పట్టుకున్నాడు."

"అది కాకతాళీయం."

"ఇన్ని విషయాలు కాకతాళీయంగా జరుగవు. ఇదంతా మీ మాస్టర్ ప్లాన్. కిషోర్ మీరు కావాలనుకున్నప్పుడు తప్పించుకున్నాడు. కావాలనుకోగానే దొరికాడు."

"కానీ లక్షరూపాయలకోసం బ్యాంకు దొంగతనాలు చేయాల్సిన అవసరం నాకు లేదు. నాకే బోలెడు లక్షలున్నాయి."

"ఏమో ఆ లక్షలన్నీ ఇలాగే వస్తున్నాయేమో - ఎవరు చెప్పగలరు?"

"ఇన్స్పెక్టర్ మీరు మీ హద్దులు మీరుతున్నారు."

"హద్దులు మీరిన వారిని హద్దుల్లో ఉంచడానికి నేను హద్దులు మీరవచ్చు. నా డ్యూటీ నా ప్రాణం...."

"మీ ఆరోపణలకు ఆధారముందా?"

"జరిగిందాన్నిబట్టి ఒక తెలివైన బుర్ర ఏమూహిస్తుందో మీకు చెప్పాను. నా ఆరోపణలకు మీనుంచి సంతృప్తికరమైన సమాధానాలు రాకపోతే అవే నిజమై ఊరుకుంటాయి" అన్నాడినస్పెక్టర్ తాపీగా.

"నేను నేరంచేసి డబ్బు సంపాదించాలనుకుంటే అందుకు నాకీ పిచ్చివాడి సాయమే కావాలా?" అన్నాడు సోమేశ్వర్ విసుగ్గా.

"అతడు పిచ్చివాడన్నది మీరుచేస్తున్న ప్రచారం

కావచ్చుగా."

"ఇన్‌స్పెక్టర్! కిషోర్‌కి నిండా పాతికేళ్ళు లేవు. మీరు చెప్పినట్లే నేను నాటకమాడాలనుకున్నా అందులో పిచ్చివాడి పాత్ర నేను తీసుకుంటాను తప్ప నా మేనల్లుడికెందుకిస్తాను?"

ఇన్‌స్పెక్టర్ చలించలేదు "డబ్బుతో ఎలాంటి పనైనా చేయొచ్చు. రేపు పిచ్చి నయమయిందంటే మీ మేనల్లుడి కందరూ బ్రహ్మరథం పడతారు. డబ్బుకనక ఉంటే! మీది చాలా తెలివైన పథకం. పిచ్చివాడన్న ముద్రతో కిషోర్ బ్యాంకు దొంగతనం చేయాలనుకుంటాడు. దొరికాడూ— అతడెలాగూ పిచ్చివాడు కనుక....కోర్టు వదిలిపెడుతుంది. లేమా లక్షరూపాయలు మీ వశమవుతాయి."

సోమేశ్వర్ కాసేపేం మాట్లాడకుండా గంభీరంగా ఉండిపోయాడు.

"నా ఆరోపణలకు మీ రొప్పుకుంటారా?"

సోమేశ్వర్ నెమ్మదిగా "అసలు నిజం మీకు చెప్పేస్తాను" అన్నాడు. ఆయన తర్వాత గొంతు సవరించుకొని "కిషోర్ దుబారా మనిషి. హద్దూ, అదుపూ లేకుండా డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేసేస్తూంటే భయపడి తలి దండ్రులతడికి కొన్ని అబద్ధాలు చెప్పారు. వారు చెప్పిన ప్రకారం వారి ఆస్తి కరిగిపోతోంది. వ్యాపారంలో నష్టం వస్తోంది. ఏదో ఒకరోజున తమ జీవితం వీధిన పడుతూం దని వారు భయపడుతున్నారు. ఇది విన్న కిషోర్ నిజమే ననుకున్నాడు. అతడి స్నేహితులు మంచివారు కాదు. అతణ్ణి నేరాలకు ప్రోత్సహించారు.

కిషోర్ మరింతగా పతనమవుతూంటే భరించలేక ఒక

రోజున తలిదండ్రులిద్దరూ "నీ పద్ధతి మాకు నచ్చలేదు. నువ్వు నేరాలుచేసి సంపాదించకు. ఆ నేరాలేవో మేమే చేస్తాం" అని ఒక కార్లో బయల్దేరారు.

కిషోర్ ఎంత వారించినా వినలేదు. ఆ కారుకు యాక్సిడెంటై ఇద్దరూ మరణించారు. ఆ షాక్ కిషోర్ మీద తీవ్ర ప్రభావం చూపించింది. అతడు బ్యాలన్సు తప్పి నేరాలు చేయడానికి పూనుకున్నాడు. డాక్టర్లకి చూపిస్తే మతి భ్రమించిందన్నారు. నా మేనల్లుడు నేరస్థుడనుకోవడం కంటె పిచ్చివాడనుకోవడం మెరుగనిపించింది. వైద్యం జరిపిస్తున్నాను. వాడిలో మంచి మార్పు వస్తున్నట్లే కనబడింది. కానీ తప్పించుకుని మళ్ళీ నేరం చేశాడు. ఈ ఒక్కసారికీ వాడిని మన్నించండి. మళ్ళీ ఇలాంటిది జరక్కుండా చూస్తాను" అన్నాడు.

"మీ మాటలు నమ్మవచ్చా?"

"అందుకు సాక్ష్యం - చాలా ఏళ్ళుగా తిరుగులేకుండా నడుస్తున్న మా వ్యాపారం - తలిదండ్రులు పోయినప్పటి నుంచీ కిషోర్‌కు వైద్యం చేస్తున్న డాక్టర్లు...."

"సరే-మీ మాటలు నమ్ముతాను. కానీ కిషోర్ని అరెస్టు చేయక తప్పదు" అన్నాడినస్పెక్టర్.

"చిన్నతనం నుంచీ సుకుమారంగా పెరిగాడు. వాడు జైల్లో ఉండలేడు. ఇన్‌స్పెక్టర్....వాడి ఈ ఒక్క తప్పునూ కాయండి...."

"మిస్టర్ సోమేశ్వర్....జరిగింది చాలా పెద్దనేరం.... బ్యాంకు దొంగతనం....నేరస్థుణ్ని తేలికగా వదిలిపెట్టలేము" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సోమేశ్వర్ దీనంగా, దిగులుగా "మీ యిష్టం"

అన్నాడు.

కిషోర్ అరెస్టయ్యాడు. అప్పుడతడేమీ మాట్లాడలేదు. పోలీసులు బేడీలు వేస్తూంటే—అతడు శాంతంగా చేతులు ముందుకు చాపాడు.

4

జైల్లో ఓ గదిలో ఇన్స్పెక్టర్, కిషోర్ ఉన్నారు.

ఇన్స్పెక్టర్ చేతిలో లాఠీ ఉంది.

కిషోర్ కళ్ళలో భయంలేదు.

"నువ్వు పిచ్చివాడివి కాదు. అలా నటిస్తున్నావు. నీ కంటే జమాజెట్టీలచేతనే నిజం చెప్పించాను. మర్యాదగా నిజం చెప్పు."

"వినండి ఇన్స్పెక్టర్ ...." అన్నాడు కిషోర్ నిర్భయంగా.

ఇన్స్పెక్టర్ వినసాగాడు.

"ఇక్కడ మీరు, నేను తప్ప ఇంకెవ్వరం లేముకదూ!" అడిగాడు కిషోర్.

"ఊఁ"

"ఇక్కడ మామయ్య నీడకూడా పడదుకదూ!"

ఇన్స్పెక్టర్ ఆశ్చర్యంగా "పడదు ...ఏం?" అన్నాడు.

"స్వంత అన్నగారైన్న జాలికొద్దీ ఏ దారీ లేకుండా ఉన్న మామయ్యను తెచ్చి ఇంట్లో పెట్టుకుంది మా అమ్మ. ఆయన ఆశపోతు. నమ్మకద్రోహం చేశాడు. ఆయన అసలురంగు నేనే కనిపెట్టాను. నా తలిదండ్రుల కాయన గురించిన నిజం చెప్పాను. వాళ్ళది రూఢీ చేసుకుని తీవ్రంగా హెచ్చరించారు మామయ్యని. ఆ వెనువెంటనే నా తలిదండ్రులు యాక్సిడెంట్లో మరణించారు. యాక్సిడెంటెలా జరిగిందని నే నారాతీయబోయాను. నిజం తెలి

సింది. అందులోకూడా మామయ్య హస్తముంది.

నేను మామయ్యను పోలీసులకు అప్పగిస్తానన్నాను. మామయ్య నాకు మతిభ్రమించిందని గదిలో బంధించాడు. హిప్నోటిస్టుల ద్వారా నా బుర్రలోని భావాలు చెరిపేయాలని చూశాడు. ఒకటి రెండు నెలలు ప్రతిఘటించి ఘోర శిక్షలకు గురయ్యాను. ఆ తర్వాతనుంచి నేను పద్ధతి మార్చి అన్నీ మరిచిపోయినట్లు నటించాను.

నా నటన బాగా పనిచేసింది. మామయ్యమీద ప్రేమ ఒలకబోస్తున్నాను. మామయ్య నన్ను నమ్మాడు. గత రెండు మాసాలుగా నా గదిలో నేను బంధనాలు లేకుండా తిరిగే అవకాశం వచ్చింది.

అయితే మామయ్య నన్ను వదిలిపెట్టే ఉద్దేశ్యంలో లేడు. నేను పిచ్చివాడినన్న ముద్రవేసి ఆస్తినంతా తానే అనుభవించాలని ఆయన పథకం. ఆయనుండగా నేను పిచ్చివాణ్ని కానని పించుకునే అవకాశం లేదు. ఆయన అంతటి మహానటుడు. నా బాధను అయినవాళ్ళు, స్నేహితులు కూడా అర్థం చేసుకోలేదు. ఒక్క పనివాడు తప్ప. వాడు చిన్నప్పట్నించీ నన్నెత్తుకు పెంచాడు. పేరు సీనయ్య. వాడి సాయంతో ఇంట్లోంచి తప్పించుకుని బ్యాంకు దొంగతనం చేశాను. సమయానికి ఫోన్ చేసి వాడు సహకరించాడు.

ఆ తర్వాత కావాలనే మళ్ళీ మామయ్యకు దొరికి పోయాను. అతడికి నా స్వేచ్ఛను తనకు వ్యతిరేకంగా ఉపయోగించుకుంటానన్న అనుమానం కలక్కూడదు."

అతణ్ని మధ్యలో ఆపి "బ్యాంకు దొంగతనమెందుకు చేశావు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను పిచ్చివాణ్ని కానని నిరూపించుకుందుకు. ఆ

డబ్బుకూడా భద్రంగా ఒకచోట దాచాను. దాంతో నాకు పనిలేదు. ఇన్స్పెక్టర్....నేను పిచ్చివాణ్ణి కాననీ - నాకు మామూలుగా అందరికిలా బ్రతికే హక్కుందనీ మీరు ప్రపంచానికి చాటిచెప్పండి. మామయ్య మిమ్మల్ని డబ్బుతో కొనే ప్రయత్నాలు చేస్తాడు. అవి సాగనివ్వకండి. నేను చేసిన నేరానికి నాకే శిక్ష విధించినా ఫరవాలేదు. నాకు స్వేచ్ఛకావాలి. అందుకోసం కొన్నాళ్ళు జైల్లో ఉండడానికి నేను సిద్ధమే! నన్ను నా మామయ్య బారినుంచి రక్షించండి...."

ఇన్స్పెక్టర్ ఆశ్చర్యంగా కిషోర్‌వంక చూశాడు.

తాననుకున్నదొకటి....జరిగినదొకటి....

ఇలా కూడా జరుగుతుందా?

ఇన్స్పెక్టర్ పరిశోధన ప్రారంభమయింది.

కొద్దిరోజుల తర్వాత కిషోర్ తనింట్లో ఉన్నాడు. సోమేశ్వర్ కటకటాల వెనక్కు వెళ్ళాడు. □

సెలవు!?



ఉప్పొంగిన గోదావరి

సుంకర రాంప్రసాద్



వరద లొచ్చాయి.

ఉప్పొంగిన వరద గోదావరి ఊరూ. వాడలను ముంచెత్తుతూంది. ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి తీరం అంతటా నున్న పల్లెలూ, పట్టణాలూ....పూర్తిగా జలమయమయిపోయాయి.

సుమారు 2,500 గ్రామాలు వరద నీటికి గురి యైనాయని అధికారుల అంచనా.

జల దిగ్బంధనంలో చిక్కుకుని, నిలువ నీడలేక అల్లాడుతున్న కొన్ని లక్షలమంది నిరాశ్రితులకు ప్రభుత్వం ఆశ్రయం కల్పించింది.

వరద బాధితులకు హెలీకాప్టర్ల ద్వారా ఆహార పొట్లాలు అందజేయబడుతున్నాయి.

వరదనీటిలో చిక్కుకున్న వారిని రక్షించడానికి సైనికులూ, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు చిన్న, చిన్న బోట్లలో బయలుదేరారు.

ధవళేశ్వరం—

పట్టణమంతా ఆరడుగుల లోతులో మునిగి ఉంది. రోడ్లూ, ఇండ్లూ, ప్రభుత్వ కార్యాలయాలూ ఒక్కటేమిటి అన్నీ జలమయ మైపోయాయి.

అయితే....సకాలంలో, ప్రభుత్వం చేసిన హెచ్చరిక వలన పట్టణంలోని ప్రజలంతా ఊరు మధ్యనున్న కొండ మీదకు చేరుకున్నారు. అందువలన ఎవరికీ ప్రాణ నష్టం మాత్రం కల్గలేదు.

ప్రాణభయంతో పరుగెడుతూ, కట్టుబట్టలతో కొండ మీదకు వచ్చేసారు వారు.

వారి ఆస్తీ, పాస్తీ....నగా....నట్రా అంతా ఇండ్ల లోనే ఉండిపోయాయి.

సర్వం పోగుట్టుకున్న బికారుల్లా, దీనుల్లా, అనాధల్లా ఉన్నారు వారంతా. కొందరు గోలగోలున ఏడుస్తు న్నారు. కొందరు శూన్య దృక్కులతో అపార జలరాశి మధ్యనున్న తమ నివాసాల వంక చూస్తున్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆహారాన్ని అంతా అన్య

మనస్ఫూర్తిగా సేవ భజించారు.

ప్రాణం దక్కింది.

త్రాణం చిక్కింది.

యిప్పుడు వారి చింత అంతా తమ ఆస్తుల గురించే!

2

నిండుగా ప్రవహిస్తున్న ధవళేశ్వరం వీధులలోనికి ప్రవేశించిందొక కొయ్యపడవ.

నిండువెత్తు నీటిలో బెండు ముక్కలా తేలి, ప్రవాహ వేగానికి కొట్టుకుపోతున్న ఆ పడవను బలంగా తెడ్లువేస్తూ ఎంతో చాకచక్యంతో నడుపుతున్నారు ముగ్గురు యువకులు.

ఖాకీ రంగు దుస్తులను ధరించారు వారు. తలపై అదే రంగువే క్యాప్స్ ఉన్నాయి. చూడటానికి ఎన్. ఎస్. ఎస్. వాలంటీర్లలా ఉన్నారు.

వారు....మోహన్, శామ్యూల్, త్రినాథ్.

వారు పడవను నేర్పుగా ఒక ఇంటివద్ద ఆపారు. కిటికీకున్న ఇనుప చువ్వలకు తాడుతో బలంగా పడవను కట్టారు. గోడ ప్రక్కనున్న నీటి పంపును పట్టుకుని మెల్లగా పైకి ఎగబ్రాకారు.

అది రెండతస్తుల మేడ.

వారు పై అంతస్తును చేరుకున్నారు. తలుపులను తెరచుకొని లోపలకు ప్రవేశించారు.

లోపల....గోడకు ఆన్చివున్న ఆరడుగుల గాడ్రెజ్ బీరువా మీద పడింది వారి దృష్టి.

వారి కళ్ళు ఆనందంతో మెరిసాయి.

మోహన్ జేబులోనుండి సన్నని ఇనుప చువ్వను పైకి తీసాడు. సన్నగా పొడవైన మేకులా ఉంది అది. చివర అరంగుళం మేర వంగివుంది.

ఆ చువ్వను కీ హోల్‌లో పెట్టాడతడు. సరిగ్గా రెండు నిముషాల తరువాత అతడి ప్రయత్నం ఫలించింది. ఆ బీరువా తలుపులు తెరుచుకున్నాయి.

పై అరలో నీట్‌గా పేర్చబడ్డ వెండి సామాగ్రిని చూస్తూ సన్నగా నవ్వుకున్నారు వారు.

ఇనుప చువ్వ సాయంతో లాకర్‌ను కూడా తెరిచాడు మోహన్.

లోపలున్న ఒకటి, రెండు బంగారు నగలను, కొత్త కరెన్సీనీ ఒక పోలిథిన్ కవర్‌లో పెట్టా డతడు. వెండి సామాగ్రిని పెద్ద కాన్వాస్ సంచిలో వేయసాగాడు త్రినాథ్.

యింకా ఎక్కడయినా విలువైన సామాగ్రి ఏమైనా మిగిలి ఉందేమోనని గది అంతా కలియజూస్తున్నాడు శామ్యూల్.

ఇరువయి నిముషాల తరువాత వారు ఆ ఇంటిలోనుండి బయట పడ్డారు. కాన్వాస్ సంచిని పడవలోవేసి, మరో ఇంటివైపు పడవను నడుపుకుంటూ పోయారు వారు.

కొండ మీదనున్న ప్రజలకు....ఆ పడవ అందులోని యువకులు చిన్న, చిన్న ఆటబొమ్మల్లా కన్పిస్తున్నారు.

పొంగి, పొర్లుతున్న ఆ వరద నీటిలో, ఆ చిన్న కొయ్యపడవలో....కొండంత ధైర్యంతో ప్రయాణిస్తున్న ఆ ముగ్గురు యువకులవంకా అబ్బురంగా చూడసాగారు వారు.

"అబ్బ! ఎంత తెగువ!"

"ఎంత సాహసం!"

"ధైర్యం అంటే ఆ వాలంటీర్లదే!"

"ఇండ్లలో ఎవరైనా చిక్కుకుపోయారేమోనని వెతుకు తున్నారు!"

ఆశ్చర్యంగా అనుకుంటున్నారు ఆ ప్రజలు.

అయితే ఆ ప్రజలు అనుకుంటున్నట్లుగా, ఆ యువకులు వాలంటీర్లు కారు.

ఓ ప్రక్క, దిక్కూ మొక్కూ లేక, వరద తాకిడికి బలియైన ప్రజలు అల్లాడుతూంటే, ఆ దౌర్భాగ్య క్షణాలనే అవకాశంగా తీసుకొని, ఊరను దోచుకోవడానికి బయలు దేరిన దోపిడీకాండ్రు వారు.

వారు చేస్తున్నది అమాయక ప్రజల ఆస్తుల రక్షణ కాదు. భక్షణ.

అడిగేవాడూ, అడ్డే నాథుడూ లేని ఆ ఇండ్లను ఒక్కొక్కటీ తీరిగ్గా దోచుకుంటూ పోతున్నారు వారు.

3

రైలు కట్ట అంచునే ఉన్న చిన్న దిబ్బమీద వుంది ఆ యిల్లు.

ఆ మట్టిదిబ్బ అంతా నీటిలో మునిగివుంది. ఆ యింటి గుమ్మపు అంచులను తాకుతూ ప్రవహిస్తూంది ఎర్రని వరదనీరు.

ఊరికి దూరంగా ఒంటరిగా విసిరేసినట్లున్న ఆ యింటిలో ఉన్నది ఇద్దరే ఇద్దరు.

ఒక స్త్రీ. ఒక పురుషుడు.

"ఏమిటండీ! ఊరు, ఊరంతా కలసికట్టుగా కొండ మీదకు చేరుకున్నారా! మనం మాత్రం 'నన్ను ముట్టుకోకు నా మాలకాకి' అన్నట్లు యిక్కడ ఒంటరిగా బిక్కు, బిక్కుమంటూ కూర్చున్నాం. ఏమిటో! అందరితో పాటు మనమూ ఆ కొండమీదకు పోదామండీ అంటే నా మాట కానిచ్చారా! మీకు పుట్టిన బుద్ధితప్ప, యింకొకరి మాట వినరు కదా!"

పట్టెమంచం మీద బొసింపట్టు వేసుకొని కూర్చుని భార్య మాటలను తీరిగ్గా వింటున్నాడు శ్రీకాంత్.

"ఏం కమలా! భయంగా ఉందా?" నవ్వుతూ అన్నాడతడు.

"మీకు నవ్వులాటగానే ఉంటుంది. అలా ఒక్కసారి గుమ్మం దాకా వెళ్ళి చూడండి. ఇప్పుడు నీరు గుమ్మాన్ని తాకుతుందా? యింకాస్తా వచ్చిందంటే....అమ్మో! యింకేమయినా ఉందా!"

స్త్రీ సహజమైన భయం ఆమె ముఖంలో కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది.

"ఓస్! అంతేనా! నేనింకా, రఘూ లేడని నీవు పాపం బెంగపడుతున్నావేమో ననుకున్నాను."

భర్తవంక కలవరంగా చూసింది కమల.

"పాపం కొండమీద నున్న రఘు నీ కోసం ఎంత కలవరిస్తున్నాడో." వ్యంగ్యంగా అన్నాడతడు.

"రఘు....రఘు నా కోసం కలవరించడ మేమిటండీ." తడబడుతున్న గొంతుతో అంది ఆమె.

"నాకు తెలుసు కమలా!"

"ఏ....ఏ....ఏమిటండీ?"

"నీవూ....ఆ రఘూ....ఛీ! నా నోటితో నేను చెప్పలేను."

"అది....కిట్టని వారెవరో చెప్పిన...."

"కట్టు కథంటావా?"

"నిజమండీ....మీ తోడు. నే నెలాంటిదాన్నో మీకు తెలియదా?"

"కమలా....!"

అతడు వేసిన గావుకేక ఆ నాలుగు గోడల మధ్య

ప్రతి ధ్వనించింది.

"నేను.... నేను నా కళ్ళతో స్వయంగా చూసాను."

ఛెర్నాకోలతో ఛెళ్ళున కొట్టినట్లు ఉలిక్కిపడింది ఆమె.

అతడి కళ్ళల్లో ఎర్రని జీరలు.

భయంతో....పాలిపోయిన ముఖంతో నిశ్చేష్టురాలై నిలుచున్న ఆమెవంక అసహ్యంగా చూసా డతడు.

ఆమెను చూస్తున్నకొద్దీ అతడికి శరీరమంతా కంపరం పుడుతూంది. చెప్పలేని జుగుప్స కల్గసాగింది. అసహ్యం వేయసాగింది.

ఒకప్పుడు అతడికి కూడా భార్యంటే ప్రాణం. ఆమే అతడి సర్వస్వం. ఆమె తోడిదే లోకం.

ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన అలాంటి భార్యమీద అంతటి జుగుప్స, అసహ్యం అతడిలో కల్గడానికి కారణ మైన ఒక సంఘటన సరిగ్గా మూడు రోజుల క్రితం జరిగింది.

ఆ రోజు ....

రాత్రి తొమ్మిది గంటలు దాటి ఉంటుంది.

హడావుడిగా స్టేషన్ లోనికి ప్రవేశించాడు శ్రీకాంత్. అతడి చేతిలో బరువైన సూట్ కేస్ ఉంది.

జాన్సన్ అండ్ జాన్సన్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నా డతడు. నెలలో పదిహేను రోజులు ఇలా ఊర్లు మీద తిరగడమే అతడి పని.

ప్లాట్‌ఫారం మీద నెమ్మదిగా నడుస్తున్నాడతడు. ఎదురుగా వస్తున్న టికెట్ కలెక్టర్‌ను చూసి పలకరింపుగా నవ్వాడు.

తరచుగా కాంప్‌లకు వెళ్లడంచేత దాదాపుగా ఆ రైల్వే

సిబ్బంది అంతా అతడికి పరిచయమే.

"హల్లో! మళ్ళీ కేంపా?" అన్నాడు టి. సి.

అవునన్నట్లు తలూపాడు శ్రీకాంత్.

"సారీ! రైళ్ళు తిరగటం లేదే!"

ఆశ్చర్యంగా టి.సి. వంక చూసాడు అతడు.

"అవునండీ తుమ్మలపాడు దగ్గర ఏక్సిడెంట్ అయింది. గూడ్సుబండి పట్టాలుతప్పి ఆరు బోగీలు తలక్రిందు లయ్యాయి. రైల్వే ఎమర్జన్సీ స్క్వాడ్ వెంటనే ప్రమాదం జరిగిన చోటికి వెళ్ళారనుకొండి. బహుశా ఈపాటికి రెస్క్యూ ఆపరేషన్స్ ప్రారంభమయ్యే ఉంటాయి.

కాని, పడిపోయిన ఆ బోగీలను సరిచేసి, చెదరిన రైల్ ట్రాక్‌ను బాగుచేసి మళ్ళీ రైళ్ళ రాకపోకలు ప్రారంభం కావడానికి ఎంత లేదన్నా మరో ఎనిమిది గంటల పైనే పడుతుంది. దానికి తోడు ఆ రూట్ సింగల్ ట్రాక్ కదా. పాడయిన ట్రాక్‌ను బాగు చేస్తే తప్ప రైళ్ళు తిరిగే అవకాశంలేదు."

టి సి. మాటలను వింటుంటే అతడికి ఎక్కడలేని నీరసమూ ముంచుకు వచ్చింది.

ఎనిమిదిగంటలు అంటే మళ్ళీ ఉదయం అయ్యేదింటి వరకూ ప్లాట్‌ఫాం మీద వెయిట్ చేయడమంటే ఎవరికైనా చిరాకుగానే ఉంటుంది.

అతడికి తన భార్య కమల గుర్తుకువచ్చింది.

అతడు ప్రయాణానికి సిద్ధమవుతున్న చివరి క్షణాలలో అతడి బ్రెనాట్‌ను సర్దుతూ....

"మీకేమండీ.... నెలకు పదిహేను రోజులు కాంప్‌లంటూ ఎంచక్కా ఊర మీద టూర్లు చేస్తారు. నేనిక్కడ బిక్కు బిక్కుమంటూ ఒక్కదాన్నే ఉండాలి. మీ కోసం

ఎదురుచూస్తూ క్షణాల్ని యుగాలుగా గడపాలి.'' అంది కమల అతడి గుండెలపై తల వాలుస్తూ.

కమల గుర్తుకు వచ్చాక అతడు మరి ఆలస్యం చేయ లేదు. వెంటనే ఇంటికి బయలుదేరాడు.

రిక్షాలో ప్రయాణిస్తున్నంతసేపూ అతడి మనసు నిండా ఒకటే ఆలోచనలు.

'తనను ఇలా అకస్మాత్తుగా చూసిన కమల ఏమను కుంటుందో!

పరుగున వచ్చి తనను కౌగిలించుకుంటుందా? తనను ముద్దులతో ముంచెత్తేస్తుందా?'

అతడు ఊహలలో తేలిపోతూనే ఇంటిని సమీపించాడు. కాలింగ్ బజర్ మీద చేయివేశాడు. చూపుడువ్రేలు బజర్‌ను ప్రెస్ చేయబోయేంతలో....

గదిలోపల నుండి కిలకిల నవ్వులు వినిపించాయి. మత్తుగా మూల్గిన ధ్వని.

అతడి చేయి కర్రలా బిగుసుకుపోయింది.

"అబ్బ! ఏమిటా మోటుతనం'' మత్తుగా పల్కుతున్న కమల స్వరం.

"ఆ తప్పు నాది కాదు డార్లింగ్. నన్ను రెచ్చగొట్టి, పిచ్చివాడ్ని చేస్తున్న నీ అందానిది.''

ఎవడిదో మగ గొంతు.

"ప్చ''....బలంగా ముద్దుపెట్టుకున్న శబ్దం!

అతడు నిశ్చేష్టుడై పోయాడు. ఇనుప సమ్మెటతో ఎవరో గుండెలమీద మోదుతున్నట్లుగా ఉంది అతడికి.

ఆ షాక్‌నుండి తేరుకొని, నిజాన్ని అర్థం చేసుకోవడా నికి సైతం అతడికి కొన్ని క్షణాలు పట్టింది.

నెమ్మదిగా గోడ ప్రక్కకు నడిచాడు. చుట్టూచూసాడు.

అంతా నిర్మానుష్యంగా ఉంది. నిజానికి ఆ యిల్లు ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉంటుంది.

"తన ఇంటిలోనికి తను ప్రవేశించడానికి దొంగలా చుట్టూ చూడాల్సిన దౌర్భాగ్యపుస్థితి!"

విరక్తిగా నవ్వుకున్నాడతడు.

నీటి పంపును పట్టుకొని మెల్లగా పైకి ఎగబ్రాకాడు. ఎనిమిది అడుగుల ఎత్తున నీటిపంపుకు అడుగు దూరంలో ఎడమ ప్రక్కనున్న వెంటిలేటర్ దగ్గర ఆగాడతడు.

మెల్లగా చేయిని సాచి, వెంటిలేటర్ ఊచలను అందు కొని లోపలకు తొంగి చూసాడు.

అది.... అతడి బెడ్‌రూమ్.

సన్నని నీలిరంగు కాంతి ఆ గది అంతా పరచుకొని ఉంది. డబుల్‌కాట్ బెడ్ మీద వెల్లకిలా పడుకొని ఉంది అతడి భార్య కమల. ఆమె బిగి కౌగిలిలో పరవశించిపోతు న్నాడు ఆమె ప్రియుడు. అతడు రఘు.

వారిద్దరినీ అక్కడికక్కడే నరికి పోగులు పెడదా మన్నంత ఆవేశం.... కసి.... క్రోధం ఒక్కసారిగా అతడిని ఆవేశించాయి.

'తను కమలకు చేసిన లోటేమిటి? ప్రాణంకన్నా మిన్నగా చూసుకున్నాడే! మరి .... ఎందుకు చేసిందీ ద్రోహం? ఇది పదిమందికీ తెలిస్తే.... తన పరువు ఏమవు తుంది?' గుండెలను చీల్చుకు వస్తున్న ఆవేదన, ఆక్రోషం.

ఆతడు ఆవేశాన్ని, ఆవేదననూ గుండెల్లోనే దాచు కున్నాడు. మెల్లగా చప్పుడు చేయకుండా క్రిందకు దిగాడు.

అంత బాధనూ గొంతులోనే దిగమ్రింగుకుని మౌనంగా స్టేషన్ వైపు నడిచాడు....

"కమలా! ఆ రోజునుండీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. ఆరోజే....ఆ క్షణమే మీ ఇద్దరినీ అక్కడే చంపేద్దామనుకున్నాను.

కాని వివేకం నా వెన్ను తట్టింది.

మిమ్మల్ని చంపాక?

పోలీసులు. కేసు. నాకు జైలుశిక్ష.

కాదు. ఇప్పటికే నీవలన నా జీవితం సగం నాశన మయ్యింది. యింకా ఎందుకు సర్వనాశనం చేసుకోవాలి? అదీ నీలాంటి బిచ్ కోసం!

అలాగని. నిన్ను క్షమించి వదిలేస్తానను కోకు. నిన్ను చంపాలి. చంపుతాను. తప్పదు. కాని, నా చేతులకు మట్టి అంటుకోకుండా.

అదే ఎలా అని ఇన్నాళ్ళూ ఆలోచిస్తున్నా.

ఇంతలో నా అదృష్టవశాత్తూ వరదలొచ్చాయి. వరద నీటిమట్టం పెరుగుతూ రోడ్లూ, ఇళ్లూ మునిగిపోతుంటే... నేను నిన్నే నా మనసునిండా ఊహించుకుంటున్నాను.

అది ఎంత అద్భుత దృశ్యమో నీకు తెలుసా కమలా! రక్తపుటేరులా, నరకంలోని వైతరణీ నదిలా పొంగి, పొర్లుతున్న ఎర్రని వరదనీరు.

అందులో కంఠంవరకూ మునిగివున్న నీవు. నీటిమట్టం మెల్లగా పెరుగుతుంటే ... భయంతో కంపించిపోతూ "రక్షించండీ" అని నీవు ఆర్తనాదాలు చేస్తున్నావట.

నేను ఇక్కడే, ఇలాగే చిద్విలాసంగా కూర్చుని.... శ్రవణానందకరంగా విన్పిస్తున్న నీ ఆర్తనాదాలు వింటూ నవ్వుతూ నిన్ను చూస్తున్నానట.

నిన్ను నిలువెల్లా జలగలు పట్టి, నీ రక్తం పీలుస్తున్నాయి. నీటిలో కొట్టుకువచ్చిన నీటిపాములు నిన్ను చుట్టుకొని నీ మెడచుట్టూ ఉరితాడుల్లా బిగుసుకుంటున్నాయి.

నీటిపాములకోసం ఆకాశంలో చక్కర్లు కొడుతున్న గ్రద్దలు....తమ వాడి గోళ్ళతో నీ శరీరాన్ని చీలుస్తున్నాయి. నీ తెల్లని దేహంపై చిమ్ముతున్న ఎర్రని రక్తం!

నీవు బాధగా అరుస్తున్నావు. కన్నీరు కారుస్తున్నావు. కాని, విన్నాదుకునే వాడెవడూ లేడు.

అలా .... అనుక్షణం చిత్రవధ అనుభవిస్తూ నీవు చస్తుంటే చూడాలని నాకు కొండంత ఆశగా ఉంది.

ఏం కమలా! నీకు తాళికట్టిన భర్తయొక్క ఈ చిన్న కోరికనూ తీర్చవూ!"

వికటంగా నవ్వుతూ కమలను సమీపించసాగాడు శ్రీకాంత్.

భయ విహ్వలయై అతడివంక చూస్తూంది కమల. భయంతో ఆమె శరీరం వణికిపోతూంది.

"అంటే....అందుకేనా! అందరూ .... కొండమీదకు వెళ్ళిపోయినా...."

"య్యస్. మైడియర్ వైఫ్. అందుకే మనం ఇక్కడే ఉండిపోయాం. కేవలం నీ చావుకోసం.

ప్రమాదవశాత్తూ వరదనీటిలో మునిగి చనిపోయిన నిన్ను....సారీ! నీ శవాన్ని చూడటానికి ఊరివారంతా వస్తారు. భార్యను కోల్పోయిన నన్ను పాపం పరామర్శిస్తారు. సో! వేగం చచ్చిపోమ్మా!"

క్రూరంగా నవ్వుతూ అన్నాడు శ్రీకాంత్.

అతడు రెండడుగులు ముందుకు వేసాడు. ఆమె అతడికి దొరకకుండా గదిలో పరుగులు తీయసాగింది. అతడు వికటంగా నవ్వుతూ ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంటిలో నుండి ఆమె బయటకు పోలేదు. బయట ముంచెత్తిన వరదనీటి ప్రవాహం.

ఆ చిన్నగదిలో ఎంతసేపని ఆమె తప్పించుకోగలదు?

అతడు బలంగా ఆమె నడుంమీద తన్నాడు. ఆమె కెవ్వున అరుస్తూ నేలమీద పడింది. ఆమె జుత్తు పట్టుకుని ఇంటిబయటకు ఈడ్చుకుంటూ వచ్చాడు అతడు.

ఆమె శోకంతో కేకలు పెడుతూంది. క్షమించమని అతడిని ప్రతిమాలసాగింది.

కాని, ఇప్పు డతడిది రాతిగుండె.

ఆమెవంక ఒక్కసారి అసహ్యంగా చూశాడు. కాండ్రించి, తుపుక్కున ఆమె ముఖంపై ఉమిశాడు.

"చావు రాక్షసీ" అంటూ బలంగా ఆమెను నీటిలోనికి నెట్టాడు.

నీటిలో వెల్లకిలా పడిందామె. భయంతోకూడిన ఆర్తనాదం ఆమె గొంతు వీడకుండానే ఆమె బుడుంగున నీటిలో మునిగిపోయింది.

అదే సమయంలో ఆ యింటిని సమీపించిందొక కొయ్యపడవ.

అందులోని యువకుల వంక ఆశ్చర్యంగా చూశాడు శ్రీకాంత్.

వారు మోహన్, శామ్యూల్, త్రినాధ్.

4

ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వారి గోదాముల ముందు ఆగిందొక జీపు. దాని వెనుకే మూడు ఖాళీ లారీలు కూడా మెల్లగా వచ్చి ఆగాయి.

జీపులో నుండి లారీలో నుండి దిగుతున్న ఆగంతకుల వంక ఆశ్చర్యంగా చూశాడు గేటుదగ్గరున్న గూర్ఖా.

వారు తలలకు నల్లని ముసుగులను ధరించారు. చేతులలో దృఢమైన బాణాకర్రలున్నాయి.

వారివంక కలవరంగా చూస్తూ....''చోర్ — చోర్'' అంటూ అరిచాడు ఆ గూర్ఖా.

కాని, అతడి గొంతులో నుండి ఆ కేక రాకముందే అతడి తలపై బలంగా పడిందొక బాణాకర్ర దెబ్బ.

''అరె....మా! మై మర్ గయా!'' అంటూ తలను పట్టుకొని నేలకు కూలిపోయాడతడు.

తల చిట్లి, రక్తం ధారలుగా కారుతూంది. నిస్సహాయంగా మూల్గుతున్నాడు అతడు.

గోదాముల లోపల మండల రెవిన్యూ ఆఫీసరు ఆధ్వర్యంలో బియ్యం లోడింగ్ జరుగుతూంది. పదిమంది కూలీలు బియ్యం బస్తాలను లారీలకు ఎత్తుతున్నారు.

వరద బాధితుల కోసం ప్రభుత్వం ఆ బియ్యాన్ని పంపుతుంది. వరద ముంపుకు గురియైన ప్రాంతాలలోని నిరాశ్రితులకు ఒక్కొక్క కుటుంబానికి రెండు కేజీల చొప్పున బియ్యాన్ని ప్రతిరోజూ పంచాలని ప్రభుత్వ ఉత్తరువు.

అందుకే ఎమ్. ఆర్. వో. స్వయంగా బియ్యాన్ని లోడింగ్ చేయిస్తున్నాడు.

ఇంతలో పిశాచాల్లా తమను చుట్టుముట్టిన ఆగంతకుల వంక ఆశ్చర్యంగా చూశారు వారు.

వచ్చింది గూండాలు. దొమ్మీ పోరాటాల్లో ఆరితేరిన వారు. అలాంటి కిరాతకులను ఎదిరించటం....పొట్టకూటి కోసం కాయకష్టం చేసుకొనే కూలీలవల్ల ఏమవుతూంది?

పదిహేను నిముషాలలో ఆ కూలీలు, ఎం.ఆర్.వో.తో సహా బంధింపబడ్డారు.

ఆ తరువాత, తీరిగ్గా లారీలను బస్తాలతో లోడ్ చేయ సాగారు ఆ దుండగులు.

తన కళ్ళముందే ప్రభుత్వ ఆస్తులను వారంత నిర్భ యంగా దోచుకుంటున్నా, ఏమీ చేయలేక, నిస్సహాయంగా చూస్తున్నాడు ఆ ప్రభుత్వాధికారి.

ఓ వంక....పట్టెడన్నం లేక దీనుల్లా, అనాథల్లా తన తోటి మనుషులు ఆకలితో అలమటిస్తుంటే....

జలప్రళయంలో సర్వం కోల్పోయిన ఆ నిర్భాగ్యుల నోటి ముందు కూడును నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేయిస్తున్న ఆ గూండాల నాయకుడు జీపులో కూర్చుని చిద్విలాసంగా నవ్వుకుంటున్నాడు.

అతడు....రఘు.

పైకి పిల్లజమీందార్‌లా, పెద్దమనిషిలా తిరిగే అతడి అసలు స్వరూపం ఇదని ఎవరూ ఊహించలేరు.

'సరకును జాగ్రత్తగా తన గొడౌన్స్‌కు చేర్చమని' మరోసారి అనుచరులను హెచ్చరించి అతడు జీపును డ్రయివ్ చేసుకుంటూ అక్కడినుండి వెళ్లిపోయాడు.

5

మోహన్ బోటులో నుండి ఛటాలున నీటిలోనికి దుమి కాడు. నీటిలో మునిగిన కమలను ఎత్తి భుజాన వేసు కున్నాడు.

శామ్యూల్, త్రినాథ్‌ల సాయంతో ఆమెను బోటు

లోనికి చేర్చాడు.

నీళ్ళు త్రాగడం వలన కొద్దిగా ఉబ్బిన ఆమె పొట్టపై చేయివేసి మెల్లగా నొక్కసాగాడు శామ్యూల్. ఆమె నోటిలోనుండి నీరు గుక్కలు, గుక్కలుగా పైకివస్తోంది.

తెలివిలోనికి వచ్చిన ఆమె సన్నగా మూల్గుతూ మెల్లగా కదిలింది.

తడిసిన బట్టల చాటునుండీ నిండుగా కన్పిస్తున్న ఆమె అందాల వంకా ఆబగా చూస్తున్నాడు శామ్యూల్. పట్టులా మెత్తగా తగులుతున్న ఆమె శరీరం అతడిలో వేడిని రగిలించసాగింది.

కోరికతో ఎర్రబడుతున్న శామ్యూల్ కళ్ళ వంక చూసి సన్నగా నవ్వాడు త్రినాధ్.

"నీవు పిట్టను కనిపెట్టి ఉండు బ్రదర్! మేం పని చూసుకు వస్తాం."

అంతవరకూ జరుగుతున్నదంతా బొమ్మలా చూస్తున్న శ్రీకాంత్....దౌర్జన్యంగా తన ఇంటిలో ప్రవేశిస్తున్న త్రినాధ్, మోహన్‌ల వంక కలవరంగా చూశాడు.

"ఎవరు? ఎవరు మీరు!"

వారికి అడ్డుపడుతూ కోపంగా అన్నాడతడు.

వారు సమాధానం చెప్పలేదు. అతడివంక చూస్తూ హేళనగా నవ్వారు. అతడు యింకేదో అనబోయాడు.

అంతలో....త్రినాధ్ పిడికిలి బలంగా అతడి పొట్టను తాకింది.

"అమ్మా! అంటూ బాధగా అరిచాడతడు.

మోహన్ అరచేతితో బలంగా అతడి ముఖంపై చరిచాడు. కళ్ళు పచ్చబడినట్లు అనిపించింది అతడికి.

వారిని ఎదుర్కొనే అవకాశమే లభించలేదు అతడికి.

వారు కొట్టిన దెబ్బలకు స్పృహతప్పి నీళ్ళలో పడిపోయా డతడు.

పది నిముషాలలో ఆ యింటినికూడా దోచుకోవడం పూర్తిచేసి. వారు బోటులో ఒడ్డుకు చేరుకున్నారు.

అది చిన్న గుట్టమీదనున్న మామిడితోట. ఆ తోటకు ఒక ప్రక్క మట్టి రోడ్డు, మరోప్రక్క రైలు ట్రాక్ వున్నాయి.

గుట్టప్రక్కనుంచి నది ఉధృతంగా ప్రవహిస్తూంది. నదిపైన ఎప్పటిదో బ్రిటిష్ కాలంనాటి పాత రైల్వే బ్రిడ్జి.

తోట మధ్య ఎండు చితుకులను ప్రోగుచేసి చలిమంట వేశారు వారు. మంటచుట్టూ కూర్చున్నారు వారు.

కమలకు వారిమధ్య అలా తడిబట్టలతో కూర్చోవడం ఇబ్బందిగా ఉంది. చెప్పలేని బిడియంగా ఉంది.

నీటిలో పడ్డ షాక్ నుండి ఆమె ఇప్పుడిప్పుడే తేరు కుంటుంది.

ఆ అపరిచితులవంక సిగ్గుగా చూసింది ఆమె. వారంతా ఆమె వంక ఆకలిగా చూస్తున్నారు.

"ఏం పిల్లా చలేస్తుందా?"

బాటిల్‌లోని బ్రాందీని గొంతులోనికి పంపుకొని అన్నాడు శామ్యూల్.

చేతిలోని విస్కీబాటిల్‌ను ప్రక్కకు పెట్టి బద్ధకంగా వళ్లు విరుచుకున్నాడు మోహన్.

"బేబీ ....ఆ తడిబట్టలు విప్పేయకూడదూ!" అంటూ ఛటాలున ఆమె పైట పట్టుకుని లాగాడు.

ఆమె ముందుకు తూలింది.

క్రింద పడకుండా ఆమెను పొదివి పట్టుకున్నాడు త్రినాధ్. అతడి కుడిచేతిలో రమ్ బాటిల్ వుంది.

"తప్పురా! ఏమిటా మోటుదనం!" అన్నాడతడు వారి వంక కోపంగా చూస్తూ.

అతడు లేచి నిలబడ్డాడు. ఆమెను లెమ్మన్నట్లు సైగ చేశాడు. ఆమె సంశయంగా చూస్తూ లేచినిలబడింది.

అంతే!

ఛటాలన ఆమె చీరకుచ్చిళ్లను పట్టుకొని లాగేసాడు. కుప్పలా ఆమె పాదాల దగ్గర పడింది ఆమె చీర.

వికటంగా నవ్వుతూ ఆమెను చుట్టుముట్టారు వారు. శామ్యూల్ వెనుకనుండి ఆమెను బలంగా వాటేసుకున్నాడు. అతని మొరటు పెదవులు ఆమె నున్నని చెంపలను తమకంగా స్పృశిస్తున్నాయి.

మోహన్ ఆమె జాకెట్‌ను చించేశాడు. బ్రా హుక్స్ తెంచేశాడు. పచ్చని బంగారు కలశాల్లా మెరుస్తున్న ఆమె నిండయిన గుండెలవంక చూస్తూ ఆశగా పెదవులు తడుపుకున్నాడు అతడు.

ఈ మధ్యలో ఆమె లంగా బొందును లాగటానికి ప్రయత్నిస్తున్నాడు త్రినాథ్.

ఆకలిగొన్న మూడు పులుల మధ్యనున్న లేడిలా ఉంది ఆమె పరిస్థితి.

వారి మధ్య నుండి తప్పించుకోవడానికి డెస్పరేట్‌గా ప్రయత్నిస్తూంది ఆమె. ఒడ్డున పడ్డ చేపలా గింజుకుంటూంది. నిస్సహాయంగా అరుస్తూంది.

కాని....ఆమె ఆక్రందన అరణ్యరోదనే అవుతూంది.

శామ్యూల్ ఆమె బుగ్గను కసిగా కొరికాడు. 'అమ్మా' అంటూ బాధగా అరిచింది ఆమె. ఆచ్ఛాదన లేని ఆమె గుండెలపై చేయివేశాడు మోహన్.

అదే సమయంలో ఆ తోటలోనికి ప్రవేశించిందొక

జీపు. దాని హెడ్‌లైట్స్ కాంతి సరిగ్గా వారిమీదే పడింది.

కనులు చిట్లించుకుంటూ చూశారు వారు. ఆ కాస్త వ్యవధిలో వారి బంధనం నుండి బయటపడింది ఆమె.

జీపును ఆపి క్రిందకు దిగుతున్న రఘును చూసేసరికి ఆమె కళ్ళు మిల, మిలా మెరిశాయి.

ఒక్క పరుగున అతడి దగ్గరకు చేరుకుంది. అతలా అతడిని చుట్టేసుకుని, అతడి గుండెలపై తలవాల్చి వెక్కి వెక్కి ఎడ్వసాగింది.

వారు ముగ్గురూ మెల్లగా నడుచుకుంటూ జీపును సమీపించారు. వారిని చూసి చిగురుటాకులా వణికిపోయింది ఆమె.

"రఘూ! వీళ్ళు....వీళ్ళు నన్ను బలవంతంగా...." ఆపైన చెప్పలేక బోరుమని ఏడ్చింది ఆమె.

వారివంక సాలోచనగా చూశాడు రఘు.

"పోనీ....కమలా! నీమీద మోజుపడ్డారేమో! ఒప్పేసుకోలేక పోయావా?" కూల్‌గా అన్నాడు అతడు.

"ర....ఘూ!"

అతడివంక నమ్మలేనట్లు చూసిందామె.

"తప్పేముంది కమలా! నీవేం పతివ్రతవు కావుగా. ఆడది ఒకడితో తిరిగి చెడినా, పదిమందితో తిరిగి చెడినా, ఒక్కటే. అయినా....పరాయి మగాడితో తిరగకూడదనే పట్టింపులు నీకు లేవుగా?"

అతడు నవ్వుతూ అన్న ఆ ఒక్కొక్క మాట ఒక్కొక్క బాణంలా ఆమె గుండెల్లో గుచ్చుకున్నాయి.

'ఏ ప్రియుడి మైకంలో తాళికట్టిన భర్తకు అన్యాయం చేసిందో, ఆ ప్రియుడే ఇప్పుడు ధాపర్లా తనను పరాయి

మొగాళ్ళకు అప్పజెప్పుతున్నాడు.'

ఈ నిజాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతూంది.

తనను ఆనుకుని ఉన్న కమలను వారి మధ్యకు త్రోశాడు రఘు.

"ఎంజాయ్ మై ఫ్రెండ్స్. ఎంజాయ్!" అన్నాడు నవ్వుతూ.

"థ్యాంక్యూ బాస్" అన్నారు ఆ ముగ్గురూ ముక్త కంఠంతో.

'అంటే రఘూ వీళ్ళ నాయకుడా!' అనుకుందామె ఆశ్చర్యంగా.

ఇన్నాళ్ళూ రఘు ఆమెకు ఆరడుగుల అందగాడిగానే తెలుసు. వేలకువేలు ఎడంచేత్తో ఖర్చుపెట్టగల జల్సా పురుషుడిగానే తెలుసు. ఊరిలో అంతా పిలిచే పిల్లజమీందార్ గానే తెలుసు.

కాని, రాఘు అసలుస్వరూపం ఏమిటో ఆమెకు ఇప్పుడే అర్థమయింది. ఆమె కన్నుల పొరలు తొలగిపోయాయి.

తన వంటిమీద విషసర్పాల్లా ప్రాకుతున్న వారి చేతులను విసరికొట్టింది. అడ్డంగా నిలుచున్న రఘును వెనక్కు త్రోసి పరుగెత్తసాగింది.

ఆమె శీలం చెడిన ఆడదే కావచ్చు. కాని అంత మాత్రాన ముగ్గురు మగాళ్ళు తనను చెరచబోతుంటే, అదీ ఒక క్రొత్త అనుభవమేలే అని హాయిగా ఎంజాయ్ చేయడానికి ఆమె సెక్సుయల్ మానియాక్ కాదు

ఆమె పరుగెడుతూంది భీతహరిణంలా. ఆయాసంతో వగరుస్తూ, లేని ఓపికను తెచ్చుకుంటూ, కాళ్ళలోని సత్తువనంతా కూడదీసుకొని పరుగెడుతూంది?

వారు నలుగురూ వేటకుక్కల్లా క్రూరంగా నవ్వుతూ

ఆమెను వెంబడిస్తున్నారు.

తోటను దాటింది గుట్టను ఎక్కింది. ముళ్ళకంపలు తగిలి పళ్ళు గీసుకుపోతున్నా, రాళ్ళు తగిలి మోకాళ్ళు కొట్టుకుపోతున్నా ఆమె పరుగునుమాత్రం ఆపలేదు.

రైలుకట్ట వచ్చింది. ఆమె ఒక్కసెకను ఆలోచించింది.

వారికి చిక్కేబదులు గోదావరిలో దూకి చావటం మేలు అనుకుంది ఆమె. తన భర్తకు చేసిన ద్రోహానికి అదే నిజమైన నిష్కృతిగా భావించింది ఆమె.

ఇప్పుడామె రైల్వే బ్రిడ్జివైపు పరుగెడుతూంది. ఆమెకు పది అడుగుల దూరంలో ఆ నలుగురూ పరుగెత్తుకుంటూ వస్తున్నారు.

పరుగు....పరుగు....ఒకటే పరుగు.

విరక్తితో ఒకరు.

వ్యామోహంతో ఒకరు.

ప్రాణం తీసుకోవడానికి ఒకరు.

కామం తీర్చుకోవడానికి ఒకరు.

పరుగు....పరుగు....ఒకటే పరుగు!

6

కొండ మీదనున్న గుడి ఆవరణలో ప్రజలంతా కూర్చుని ఉన్నారు. ఓ ప్రక్క పిల్లలు ఆడుకుంటున్నారు. వారి ముఖాల్లో విషాదం గూడుకట్టి ఉంది.

వారంతా వరద బాధితులు.

గర్భగుడి ముందు నేలమీద కూర్చుని గీతలోని పరమార్థాన్ని చెబుతున్నాడు పూజారి.

"పాపం పండినప్పుడు, పాపులతో లోకం నిండినప్పుడు భూ భారాన్ని తగ్గించడానికి ఇలాంటి ప్రళయాల్నే సృష్టి

స్తాడు ఆ భగవంతుడు.

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాప నార్థాయ
సంభవామి యుగే! యుగే!

శిష్టుల రక్షించుటకు, దుష్టుల శిక్షించుటకు, ధర్మ సంస్థాపనకు యుగ, యుగమూ నేను అవతరిస్తూనే వుంటాను. అన్నాడు శ్రీకృష్ణుడు.

ఏమో! ఈ కలికాలంలో ఆ ప్రభువు ఏ శక్తిగా సాక్షాత్కరిస్తాడో!"

పూజారి కంఠం ఖంగున మ్రోగుతూంది. అతని గీతోపన్యాసం ఒక ప్రవాహంలా సాగిపోతూనే వుంది.

సరిగ్గా అదే సమయంలో....

కమల సరిగ్గా రైల్వే బ్రిడ్జిమధ్యకు చేరుకుంది. ఆమెకు నాలుగడుగుల దూరంలో ఉన్నారు ఆ నలుగురూ.

నాలుగు ప్రక్కలనుండీ ఆమెను చుట్టుముడుతున్నారు. ఆమె నిర్వికారంగా వారివంక చూసింది.

అంతలో....

ప్రళయభీకర విస్ఫోటంలా కొండల్లో ప్రతిధ్వనించిన మేఘ గర్జన. పర్జన్యుని ఘోష.

వేయి శిరసులనూ విప్పార్చుకొని, కొండమీద నుండి జర, జరా క్రిందకు ప్రాకిన ఆదిశేషునిలా కొండల్లో నుండి మహోధృతంగా క్రిందకు దూకిన జలపాతం.

తాటి ఎత్తున లేచిన ఒక ఉత్తుంగతరంగం బలంగా ఆ రైల్వే బ్రిడ్జిని తాకింది.

ఆ దుష్ట చతుష్టయానికి వినిపించిందీ....కనిపించిందీ..

ఒక ప్రళయభీకర ఘోష. నల్లని కొండలా లేచిపడిన ఒక రాక్షస అల. అంతే?

ఆ ఉధృతానికి పేకముక్కలా కూలిపోయింది ఆ బ్రిడ్జి. ఆ వంతెన శిథిలాలతో పాటు ఆ అనంత జలప్రవాహంలో కొట్టుకుపోయారు వారు అయిదుగురూ.

*　　　*　　　*

వరద తగ్గాక—

వాస్తవాలు బయటకు వచ్చాక—

అదే గుడి ప్రాంగణంలో పూజారి వారి అయిదుగురి చావు గూర్చి ఇలా వ్యాఖ్యానించాడు.

"చూసారా!

ఊర్లు దోచిన సొమ్ము తోటలోనే ఉంది.

గోదాములు దోచిన ధాన్యం గోదాముల్లోనే వుంది. కాని దోచిన మనుషులు లేరు. వరదపాలై పోయారు.

ఆ దుష్టులను నాశనం చేయడానికే వారందరినీ ఆ వంతెనమీదకు చేర్చాడు ఆ భగవంతుడు. ప్రళయకాల పర్జన్యునిగా వచ్చి వారిని నాశనం చేశాడు.

'వినాశాయచ దుష్కృతాం!' అంటే ఇదే."

పూజారి మాటలను వింటున్న నేను మనసులో ఇలా అనుకున్నాను.

"భగవాన్!

నీవంటూ వుంటే,

పూజారి చెప్పినదే నిజమయితే.... ఎవరో కొద్దిమందిని శిక్షించడానికి ఇంతమంది అమాయకులను క్షోభపెట్టడం న్యాయమా!"

నీలిరంగు పట్టుచీర

వి. పద్మప్రియ

సాయంత్రం ఐదుగంటల వేళ యింటికి వచ్చాడు రామబ్రహ్మం. అతను యింటిమొహం చూసి అప్పటికి నాలుగురోజులవుతోంది.

భార్యా, కొడుకూ ఎలావున్నారో అన్న ఆత్రుత ఎంత మాత్రం లేదతనిలో.

ఇంట్లో అడుగు పెట్టగానే ముందు భార్య డబ్బులు దాచే ప్రదేశాలన్నీ గబగబా వెతికాడు. ఎక్కడా పైసా కూడా కనపడ్లేదు. అతనికి చిర్రెత్తుకొచ్చింది. వంటింటి లోకి వెళ్ళాడు చిరాగ్గా.

అక్కడ భార్య జయ పొయ్యిమీద అన్నం వండుతూ కూర్చునుంది నిర్లిప్తంగా. భర్త యింటికి రావటం, పేగు మాడిన కుక్కలాగా ఇల్లంతా వెదకటం అన్నీ గమనిస్తూనే వుంది ఆమె. అయినా ఏమీ మాట్లాడలేదు.

"ఏమే? ఇంటిలో చిల్లుకానీ కూడా లేదు. ఈ నెల జీతం అంతా ఏంచేశావే?" గర్జించినట్టు అడిగాడు.

ఓ పలకరింపు లేదు. ఎలావున్నావు అన్న ఆదరణ లేదు. రాగానే డబ్బు! డబ్బు! చతుష్పాద జంతువులా కనిపిస్తున్న భర్తకేసి నిదానంగా ఓ మారు చూసి, మళ్ళీ తలవంచుకుని అన్నం కలియబెట్టసాగింది జయ మౌనంగా.

"నిన్నేనే అడుగుతుంటే మాట్లాడవే? ఒళ్ళు పొగ రెక్కిందా?" పిచ్చెక్కినట్టు అరిచాడు.

"పిల్లాడికి నాలుగురోజుల్నించి జ్వరం. మూసిన కన్ను తెరవలేదు. జీతమంతా వాడి వైద్యానికే ఖర్చయిపో యింది. ఈరోజే కొంచం తేరుకున్నాడు. ఇంకెక్కడుం టుంది నా దగ్గర డబ్బు? ఈ నెలంతా ఎలా గడపాలా అని బెంగతో ఛస్తున్నాను" కొద్దిగా గాద్గదికమైన గొంతుతో చెప్పింది.

పెళ్ళానికి జీతం వచ్చివుంటుంది, అదంతా ఎగరేసుకు పోవచ్చని గంపెడాశతో ఇంటికి వచ్చిన రామబ్రహ్మానికి భార్య మాటలు అశనిపాతంలా తగిలాయి.

ఆపుకోలేని కోపంతో ఒక్క ఉదుటున ఆమె దగ్గరకు వెళ్ళి జుట్టుపట్టుకుని విసురుగా పైకిలేపి ఫెళ్ళున కొట్టాడు

తలని గోడకేసి.

జయ బాధతో కెవ్వుమని అరిచింది.

"పాపిష్టిముండా! చావవే! చావు! డబ్బంతా ఖర్చు పెట్టేశావా? ఎవణ్నడిగి ఖర్చుపెట్టావే. కక్కవే! ఖర్చు పెట్టిందంతా కక్కవే?" ఈడ్చి చెంపమీద మరోదెబ్బ వేశాడు.

అసలే నాలుగురోజుల్నించి పిల్లాడిపల్ల నిద్రాహారాలు లేవు. దానికితోడు గొడ్డును బాదినట్టు బాదే మొగుడు! జయ నీరసంగా వున్నచోటే కూలబడిపోయింది. ఆ దెబ్బలకి మరో ఆడదయితే అక్కడికక్కడే చచ్చిపోయేది. ఆరేళ్ళ నించీ అలవాటుపడ్డ శరీరం. మనసుతోపాటు అదీ శిలయిపోయింది. ఒక్క కన్నీటి బొట్టుకూడా రాని కళ్ళతో మొద్దులా చూస్తూ అలాగే కూర్చుంది.

డబ్బు దొరకలేదన్న కక్షతో అక్కడున్న గిన్నెలు, సామానులూ అన్నీ కాళ్ళతో తన్నుకుంటూ ముందుగదిలోకి వెళ్ళాడు రామబ్రహ్మం. అక్కడకూడా కొంత హంగామా చేసి, అటుకెలికి యిటుకెలికి, యిక విసుగెత్తి బైటకి పోబోతూండగా అప్పుడు పడింది అతని దృష్టి దానిమీద!

మేకులమన్న దండెంమీద మసక వెల్తురులో మిలమిలా మెరుస్తోంది సరికొత్త ధర్మవరం పట్టుచీర!

చూసిందే తడవుగా చప్పున వెళ్ళి దాన్ని చేతుల్లోకి తీసుకుని చూస్తూ ఆశ్చర్యంగా. "ఒసేయ్. ఈ పట్టుచీర ఎక్కడిదే నీకు?" అన్నాడు.

'పట్టుచీర' అన్నమాట వినగానే జయలో చలనం వచ్చింది. గబుక్కున లేచి ముందుగదిలోకి వచ్చింది.

"నాది. యిటివ్వండి" మొగుడి చేతిలోంచి లాక్కోబోయింది.

"ఇంత ఖరీదయింది నీ కెక్కడిదే? నేనుగాకుండా ఇంకో మొగుడెవడయినా వున్నాడా ఏమిటి?" విషపునవ్వు నవ్వుతూ అడిగాడు.

"ఛీ నోటికొచ్చినట్టు మాట్లాడకండి. ఎదురింటి పార్వతమ్మగారు కొనిపెట్టింది నాకిది. రెండునెల్లు కాలు ఫ్రాక్చరయి ఆవిడ మంచంలో వుంటే నేను వంటచేసిపెట్టాను. ఆ కృతజ్ఞతకొద్దీ యిచ్చింది ఆవిడ. దాన్నలా వుండనివ్వండి దయచేసి."

"ఎవర్తె ఆ పార్వతమ్మ బుద్ధిలేనిది? తింటానికి గతిలేని నీకు పట్టుచీర కొనిపెట్టటం ఏమిటే? ఆ యిచ్చేదేదో డబ్బు రూపంగా యిస్తే బాగుండేదిగా? నువ్వయినా అలా అని అడక్కపోయావా దేభ్యం మొహానివి."

"డబ్బు యిస్తే తీసుకోననే ఆవిడ నాకు చెప్పకుండా కొనితెచ్చి, చేతిలో పెట్టి తీసుకోమని బ్రతిమిలాడింది. అదక్కడుంచండి. దానిజోలికి పోవద్దు" బితుకు బితుగ్గా అంది భర్త వైఖరి తెలిసిందవటంవల్ల.

"నోర్ముయ్యవే దేభ్యం! మొగుడి ఆనందంకోసం కాణీ అయినా యివ్వలేవుగానీ దొరికిందేదో తీసుకుపోతుంటే అడ్డుమాత్రం నిలుచుంటావ్. ఎవరో యిచ్చిందేగా నీబాబు సొమ్ము ఏం కాదుగా లే అడ్డులే" అంటూ ఆ పట్టుచీర లాక్కుని పేపరులో చుట్టి బయటకు తీసుకుపోయాడు.

తాగి తందానాలాడాలన్న బలమైన కాంక్షతో వెర్రెక్కిపోతున్నవాడికి అడ్డు నుంచుంటేమాత్రం అదో అడ్డంకా?

జయ నిస్సత్తువగా చూస్తూండిపోయింది. వంటింట్లో అన్నం ఆమె హృదయంలాగే కళపెళమంటోంది.

2

అలా వెళ్ళినవాడు రాత్రి పదకొండింటికి యింటికి వచ్చాడు రామబ్రహ్మం పూర్తినిషాలో. బయట భోరున వర్షం. అంత వానలో తడిసొచ్చినా అతని మత్తు యెంత మాత్రం దిగలేదు.

"చీర అమ్మేశారా?" అమ్మేసే వుంటాడని రూఢిగా తెలిసినా అడిగింది జయ.

"ఆ! సుబ్బరంగా అమ్మేశాను. వెంకటనర్సయ్య కళ్ళ కద్దుకుని తీసుకున్నాడు. రెండొందలిచ్చాడు. థాంక్స్ పార్వతమ్మా మెనీమెనీ థాంక్స్! నాకు ఇంకో రెండు రోజులు బెంగలేదు" ఎక్కిళ్ళు పెడుతూ మాట్లాడాడు.

నులకమంచం తల్లకిందులుగా వాల్చుకుని దబ్బున అందులో పడిపోయి, క్షణాలమీద నిద్రలోకి జారు కున్నాడు.

జయ గాఢంగా నిట్టూర్చి వంటింటి తలుపులు దగ్గరగా వేసి, తుంగచాప వాల్చుకుని నడుం వాల్చింది. నీరసంగా వుంది. అయినా ఆకలిలేదు. యుగయుగాల్నించి ఏదో మోస్తున్నంత బరువుగా వుంది మనసు.

అలా ఓ పది నిముషాలు గడిచాయి. బయట వాన చప్పుడు పెద్దగా వినిపిస్తోంది.

ఇంతలో ఆ చప్పుడుని చీల్చుకుంటూ మరోచప్పుడు తలుపుమీద ధభధభమని.

జయ ఉలిక్కిపడి లేచికూర్చుంది. తమ తలుపేనా? అయితే యింతరాత్రి యింటికొచ్చే దెవరు?

రెట్టిస్తున్నట్టుగా మళ్ళీ చప్పుడయ్యింది తలుపు.

జయ తొందరగా లేచి తలుపుతీసింది మరుక్షణం ఆమెని తోసుకుంటూ లోపలికి అడుగుపెట్టి చప్పున గడియ

వేసేశాడు ఒక ఆగంతకుడు. అనుకోని ఆ సంఘటనకి నిశ్చేష్టురాలయిపోయింది జయ.

ఆమె తేరుకుని అరవబోయేలోపు బలంగా తన అరచేత్తో ఆమె పెదవుల్ని మూసేశాడు ఆ వ్యక్తి. ఆమె చెవిదగ్గర కఠినంగా అన్నాడు.

"అరవకు? అరిచావంటే కత్తితో పొడుస్తాను. మాట్లాడకుండా వూరుకుంటే ఏమీ చేయను."

జయ కొయ్యబారిపోయి అలాగే చూస్తోంది.

ఆమె అరవదని నిశ్చయించుకున్నాక అతను చెయ్యి తీసేశాడు.

"లైటెక్కడ?" మెల్లగా అడిగాడు. జయ లైటు వేసింది ఆ వెలుగులో అతని నుదుటిమీదనుంచి కారుతున్న ద్రవాన్నిచూస్తూ, "రక్తం" అంది అప్రయత్నంగా.

"పోలీసు తరుముకొస్తుంటే పరిగెత్తుకొస్తూ ఆ తొందరలో కరెంటు పోల్‌కి గుద్దుకున్నాను. దెబ్బ బలంగానే తగిలింది. కాసిని నీళ్ళు తీసుకురా" అన్నాడు.

ఎవరో యింటికి వచ్చిన అతిథిలాగా ప్రవర్తిస్తున్న అతణ్ణి చూస్తుంటే భయానికి మించిన ఆశ్చర్యం కలుగుతోంది జయకు.

వంటింట్లోకెళ్ళి కుండలోంచి నీళ్ళముంచి, దాంతో పాటు పాత చీరముక్కకూడా తీసుకొచ్చింది.

అతను తాపీగా ఆ గుడ్డముక్కని నీళ్ళల్లో ముంచి గూట్లోవున్న అద్దం ముక్కలో చూసుకుంటూ గాయం శుభ్రంగా తుడుచుకున్నాడు. కొద్దిగా ఉబుకుతోంది రక్తం.

ఆ గుడ్డముక్కనే గట్టిగా తలకి కట్టుకున్నాడు. తనతో

పాటు తీసుకొచ్చిన సూట్ కేస్‌మీద పడ్డ నీళ్ళు చేత్తోతుడిచి దాన్ని మూలగా పెట్టాడు.

జయ అతని చర్యలు విభ్రాంతిగా గమనిస్తోంది.

"కాస్త వాన తగ్గేదాకా నువ్వు భరించక తప్పదు. ఈ టైమ్‌లో బైటకెళితే నేను పట్టుబడే అవకాశాలు చాలా వుంటాయి" అన్నాడు అతను ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"నువ్వు-నువ్వు దొంగవా?" అంది పెదవులు తడి చేసుకుంటూ.

అతను అందంగా చిరునవ్వు నవ్వి,

"లేకపోతే ఇంత రాత్రి దౌర్జన్యంగా పరాయి ఇంటిలో ఎందుకు దూరతాను?" అన్నాడు.

జయ నోట మాటరాక అలాగే చూడసాగింది. ఇరవై ఎనిమిదేళ్ళు వుంటాయతనికి. పొడుగ్గా చామనచాయగా వున్నాడు. తీక్షణంగా మెరుగ్గా వున్న కళ్ళు. బాగా పరిచయ మైన వ్యక్తిలా అనిపిస్తున్నాడు. "దొంగని" అని అతను చెప్పుకుంటున్నాడు కాబట్టి నమ్మాలిగానీ, అసలలా లేనే లేదు.

అతను తడిసిపోయిన షర్టు విప్పి మూలన వుండి దండెంమీద ఆరేశాడు. జుట్టులోంచి నీళ్ళు కారుతుంటే తల యిటూ అటూ విదిలించాడు. అది చూసి జయ దండెంమీది టవల్‌తీసి అందించింది. "థ్యాంక్స్" అని నవ్వి టవల్‌తో తల తుడుచుకున్నాడు గదిలో ఓ పక్క నులక మంచంమీద ఒళ్ళుమరిచి నిద్రపోతున్న రామ బ్రహ్మాన్ని, మరోపక్క బొంతమీద పడుకుని వున్న రెండేళ్ళ పసివాణ్ణి ఓక్షణం పరికించి చూసి,

"మీ ఆయననుకుంటాను? నిద్రపోతే చప్పున లేవడా?" అనడిగాడు.

"తాగినమత్తు. ఎండెక్కేదాకా దిగదు" నిర్లిప్తంగా అంది.

అతని కళ్ళల్లో ఆశ్చర్యం కదులాడింది.

కాసేపు మౌనం తర్వాత

"ఏమీ అనుకోవద్దు. ఆకలేస్తోంది. ఏమయినా వుందా యింట్లో?" అన్నాడు సంకోచిస్తూ.

"అన్నం వుంది. యిక్కడకు తీసుకురానా?"

"వద్దు వంటగదిలో కొస్తాను పర్వాలేదంటే."

"పర్వాలేదు రా" ఆమె లోపలికి వెళ్ళింది.

అతను అనుసరించాడు.

ఆమె గబగబా పీటవేసి. కంచం, మంచినీళ్ళు పెట్టింది. అన్నం వడ్డించి, ఉల్లిపాయ పచ్చడి వేసింది.

అతను ఆత్రుతగా కలుపుకుని తినసాగాడు. ఈలోపు స్టవ్ వెలిగించి, సాంబారు వెచ్చపెట్టింది. వేడివేడిగా పొగలు కక్కుతూ ఘుమఘుమలాడుతున్న సాంబారు అతని అన్నంలో పోసింది. ఒక్క మెతుకుకూడా మిగల్చకుండా తినేశాడు అతను. చెయ్యి నాలికతో రాసుకుంటూ,

"వంట చాలాబావుంది. ఆకలి చల్లబడింది. చాలా థ్యాంక్స్" అన్నాడు.

జయ నవ్వి వూరుకుంది. చాలా ఏళ్ళ తర్వాత ఓ మనిషి నోటినుండి ప్రశంసలు వింటోంది ఆమె.

అతను చెయ్యి కడుక్కోవటానికి లేచాడు. ఆమె దొడ్డి తలుపు తీసింది. అతను బయట అడుగు పెట్టబోతుండగా,

"జాగ్రత్త అక్కడ గొయ్యివుంది చూసుకో" అంది.

అతను చెయ్యి కడుక్కుని, మూతి తుడుచుకుని లోపలికి వచ్చాడు. ఆమె తలుపు వేసేసింది. చలిగాలి ఆ కాసేపట్లోనే వాళ్ళిద్దర్ని రయ్యిన వణికించింది.

"వాన తగ్గలేదింకా" అన్నాడు.

"తగ్గేదాకా వుండవచ్చు" అన్నది.

"తెల్లారిపోతేనో?"

"అయితే ఏం?"

"నలుగురి దృష్టిలో పడతాను, నాలాంటి దొంగని నీ లాగా మంచితనంతో ఆదరించేవాళ్ళు ఎక్కడుంటారు? ఎంతమందుంటారు?"

"ఎక్కడ దొంగతనం చేసివస్తున్నావు?"

"వెంకటనర్సయ్య బట్టలషాపులో పట్టు చీరలు! ఆ సూట్ కేసులో వున్నవి అవే! ఆ సూట్ కేస్ మోసుకొస్తూంటేనే పోలీసుదృష్టిలో పడ్డాను. వాడికి అనుమానం వచ్చి వెంట పడ్డాడు."

"వెంకటనర్సయ్య షాపా? మా ఆయన నా పట్టుచీర అక్కడే అమ్మేశారు యివాళ"

"అమ్మేశాడా? ఎందుకని?"

"తాగటానికి యింట్లో ఏదుంటే అది అమ్ముతారు"

"ఉద్యోగం ఏమీ చెయ్యడా?"

"ఇదివరకు చేసేవారు. ఇప్పుడేమీలేదు. నా సంపాదనే యింటికి ఆధారం. నేనో చిన్న టీచర్ని"

అతను చలించాడు. "ఎందుకింకా అలాంటి మొగుణ్ణి పట్టుకు వేగటం? వదిలెయ్యక" ఆవేశంగా అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అతను క్షణం ఆగి "అధికంగా మాట్లాడితే క్షమించు. నీలాంటి మంచి అమ్మాయికి రావలసిన కష్టాలు కావివి. ఆ బాధతో అన్నాను" అన్నాడు.

"పర్వాలేదు" అంది క్లుప్తంగా. ఇద్దరూ ముందు గదిలోకొచ్చారు. ఆమె చాపమీద కూర్చుంది. అతను

స్టూలుమీద కూర్చున్నాడు. వాన చప్పుడుచేస్తూ కురుస్తోంది.

"దొంగతనాలు చేయటం తప్పుకాదా?" ఉన్నట్టుండి అడిగింది.

"నే నెక్కువ చదువుకోలేదు. ఎవరూ నాకు పనివ్వలేదు. చిన్నతనంలో ఆకలికి తట్టుకోవటం చాలా కష్టం. అందువల్ల దొంగతనాలకి అలవాటుపడ్డాను. అది యింత వరకూ కొనసాగుతూనే వున్నాయి. దొంగతనం తప్పా ఒప్పా అని నేను ఆలోచించదల్చుకోలేదు. ఎందుకంటే ఇంతకన్నా గొప్పగా బ్రతకాలన్న ఆశయం నాకు లేదు. వెనకా ముందూ ఎవరూలేని తెగిన గాలిపటాన్ని నేను. ఎలా బ్రతికేసినా అడిగేవారు బాధపడేవారు లేరు."

"నీ పేరేమిటి?" కుతూహలంగా అడిగింది.

"చెప్పలేదుకదూ, కృష్ణ. నీపేరు?"

"జయ!"

"జయ! బాగుంది" అతను తనలో తనే 'జయ' 'జయ' అని గొణుక్కున్నాడు. ఏవో జ్ఞాపకాలతో అతని కళ్ళల్లో విషాదరేఖలు తారట్లాడాయి.

"కాసేపు పడుకుంటావా?" ఐదు నిముషాల తర్వాత అడిగింది. అతను, ఆలోచనలోంచి తెప్పరిల్లి "మరి నువ్వు?" అన్నాడు.

"నేను మా అబ్బాయి పక్కన పడుకుంటాను"

"సరే ఓ అరగంట తర్వాత లేస్తాను. ఈలోపు వాన తగ్గుతుందనే ఆశిస్తున్నాను" అని లేచి చాపమీద పడుకున్నాడు.

"బనీను విప్పెయ్యరాదా తడిసిందికదా"

అతను మళ్ళీ లేచి బనీను విప్పి అది తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు.

3

జయ పిల్లాడిపక్కన నడుంవాల్చింది. ఏవో ఆలోచనలు ఆమె మెదడుని ఆక్రమించుకుని నిద్ర రానివ్వటం లేదు.

ఒకపక్కనించి అమాయకంగా వున్న అతడి ముఖం కనిపిస్తోంది. హఠాత్తుగా ఆమెకు తనో దొంగకి ఆశ్రయము యిచ్చానన్న విషయం గుర్తొచ్చింది. తనకా విషయం ఎలా మరపుకు వస్తోందా అని నవ్వుకుంది ఆమె. అతనిలో ఏదో చిత్రమయిన ఆకర్షణ, ఆత్మీయత వున్నాయి అనిపిస్తోంది. పరాయి వ్యక్తిని చూస్తున్నట్టు లేదు.

పది నిముషాలు గడిచాయి.

ఆమెమీదున్న నమ్మకంతో నిశ్చింతగా నిద్రపోతున్నాడు కృష్ణ. నిద్రలో అటువైపు తిరిగాడు.

పరధ్యానంగా అటేచూస్తున్న ఆమె ఉలిక్కిపడింది.

ఆచ్ఛాదనలేని అతని విశాలమయిన వీపుమీద కుడిజబ్బ కివతల పొడుగ్గా పెద్ద మచ్చ! దానిపక్కన నల్లటి పుట్టుమచ్చ! బొట్టు బిళ్ళంత పుట్టుమచ్చ!

జయకి ఒక్కసారి గుండె జల్లుమంది. కళ్ళు పెద్దవి చేసి మరీ చూసింది.

అదే మచ్చ! ఖచ్చితంగా యిలాగే, చిన్నప్పుడు ఆటల్లో కృష్ణుడు బావని తను తోస్తే అతనెళ్ళి రాళ్ళమీద పడ్డాడు. ఓ పలుకురాయి సూదిలా వుండి అతని వీపుమీద చీరుకుపోయింది. డాక్టరు ఐదారు కుట్లువేశాడు.

తనవల్లే అలా జరిగిందని బాధపడి ప్రతిరోజూ బావ

వీపుమీద దెబ్బకి తనే మందు రాసేది. ఆ తర్వాత చాలా రోజులు ఏదీ నీ దెబ్బ ఎలా ఉంది? అంటూ అది మచ్చగా మారేవరకూ పరామర్శిస్తూనే ఉండేది. అతని వీపుమీద ఆ పుట్టుమచ్చ, దానిపక్క తనవల్ల తగిలిన దెబ్బతాలూకు పొడుగాటి మచ్చ యింకా అప్పుడే దిద్దినట్టు జ్ఞాపకం తనకి!

అంటే, అంటే ఆ కృష్ణుడు బావే ఈ కృష్ణ కాదుకదా!

భరించలేని ఉద్వేగపు తెర ఒకటి ఆమెని వణికించింది.

పద్నాలుగేళ్ళ వయసులో తల్లినీ తండ్రినీ కోల్పోయి తమ పంచన చేరి అష్టకష్టాలూ పడ్డాడు మేనత్త కొడుకు కృష్ణుడు. ఇంటిలో ఓ మెంబరు ఎక్కువయ్యాడన్న కక్షతో చదువు మానిపించి అడ్డమయిన చాకిరీ అతనిచేత చేయించేది తన తల్లి. సరిగ్గా అన్నంపెట్టేది కాదు.

"నీకోసం, కేవలం నీకోసమే ఈ యింటిలో వుంటున్నాను జయా! లేకపోతే ఎప్పుడో పారిపోయేవాణ్ణి" అనేవాడు బావ తన చిన్నారి చెయ్యి చెంపకు ఆనించుకుంటూ. ఇద్దరూ ప్రాణానికి ప్రాణంలా కలిసిమెలిసి వుండేవాళ్ళు.

ఒకరోజు ఏమయిందో మరి సరిగ్గా గుర్తులేదు. చెప్పకుండా యింటిలోంచి మయమయిపోయాడు. మళ్ళీ కనపడలేదు. తను చాలారోజులు బెంగపెట్టుకుని, ఏడ్చి, అలమటించింది. తర్వాత క్రమక్రమంగా మర్చిపోయింది. కాదు, మర్చిపోయానని అనుకుంది. లేకపోతే బావ జ్ఞాపకాలు యింత పచ్చిగా ఇతని వీపుమీది మచ్చని చూడగానే తనని కదిపి, కుదిపి బాధించాయెందుకు? అసలు ఇతను బావేనా? తను పొరబడుతోందా? లేపి అడిగేస్తే?

ఆమె అదోరకపు విపత్కర సందిగ్ధావస్థలో పడి కొట్టుకుపోతుండగా కృష్ణ అటూ యిటూ ఓసారి కదిలి లేచి కూర్చున్నాడు.

గుడ్లప్పగించి చూస్తూన్న జయనిచూసి, ఆశ్చర్యంగా-
"నువ్వింతా నిద్రపోలేవా? టైమెంతయింది? నేను చాలా
సేపు పడుకున్నానా?" అన్నాడు.

జయ నోరు పెగుల్చుకుని.

"కృష్ణా! ఒక సంగతి అడగాలని వుంది. నీ వీపుమీద
ఆ మచ్చ ఎలా వచ్చింది?" అనడిగింది, అతని జవాబు
కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తూ.

అనుకోని ఆ ప్రశ్నకు అతను విస్మయం చెంది, వీపు
తడుముకుని,

"మచ్చా? ఓ యిదా?" అని నవ్వి, "చిన్నప్పుడు
మా మరదలు ఆటల్లో నన్ను రాళ్ళమీదకి తోసింది. అప్పుడు
తగిలిందీ దెబ్బ. ఆ అమ్మాయి పేరుకూడా నీపేరే-జయ!"
అన్నాడు.

జయ కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. సంతోషంతో ఎగిసి
పడుతున్న గుండెని అదుముకుంటూ.

"నేను.... నేను, నేనే ఆ జయని కృష్ణా! నేనే.
అచ్యుతంగారు, నీ మేనమామ కూతుర్ని" అంది ఆహ్లా
దంగా నవ్వుతూ. నవ్వు, ఏడుపు కలగలిసి, ఆమె వదనం
ఇంద్రధనుస్సులా శోభించింది.

కృష్ణ విభ్రాంతుడయ్యాడు.

4

ఆ తర్వాత రెండుగంటలసేపు వాళ్ళకి ఈ లోకమే
తెలియలేదు.

ఎన్నెన్నో ముచ్చట్లు, కబుర్లు, తీపి జ్ఞాపకాలు! శిల
అయిపోయానని అనుకున్న జయ మళ్ళీ మానవజన్మ
ఎత్తిన దానిలా పరవశించిపోతోంది.

కృష్ణ సంగతి సరేసరి. మళ్ళీ ఆ చిన్ననాటి కృష్ణుడు

లాగానే మారిపోయాడు.

తేనె తాగితాగి అలసిపోయినట్టు, మధురస్మృతులు పంచుకొని. పంచుకొని యిద్దరూ అలిసిపోయారు.

"జయా! ఏమీ అనుకోకు. నీ ఒళ్ళో పడుకోవాలని వుంది" ఆర్తిగా అడిగాడు కృష్ణ.

జయ ఏమీ అనుకోలేదు. తన కొడుకుని పడుకోబెట్టుకున్నట్టే కృష్ణ తలని ఒడిలో పెట్టుకున ఆప్యాయంగా నిమిరింది.

"ఇలాగే చచ్చిపోతే బాగుణ్ణనిపిస్తోందే జయా" అన్నాడు కళ్ళుమూసుకుని.

"ఛ! అవేం మాటలు?"

"నిజం: ఇంక నాకు ఏమీ అక్కర్లేదు. చాలా తృప్తిగా వుంది. మళ్ళీ చూడనేమో అనుకున్న నిన్ను చూశాను. అయితే దురదృష్టం చూడు. నీ ఆత్మబంధువునేగానీ. నీ అవస్తలు పంచుకోటానికి అర్హతలేని దురదృష్ట జీవినయ్యాను. గౌరవంగా, స్వేచ్ఛగా నీ యింటికి రాలేని దొంగబ్రతుకు నాది" కృష్ణ కళ్ళు చెమర్చాయి.

జయ గుండె బరువెక్కింది. మౌనంగా వుండిపోయింది.

"జయా! ఒకటడగనా?"

"ఊ"

"నువ్వు.నువ్వు. నాతో వస్తావా? ఇద్దరం కొత్త జీవితాలు నిర్మించుకుని ఆనందంగా గడుపుదాం. వస్తావా జయా."

"నేనా? నీతోనా" చకితురాలయింది. "నాకు పెళ్ళయింది బావా!"

"అది పెళ్ళేనంటావా జయా? తాగి, తందానాలాడి,

నిన్ను కొట్టి, రక్కి, హింసిస్తూ నరకం చూపిస్తున్న ఈ దౌర్భాగ్యుడు నీకు భర్తేనంటావా? ఈ సంసారం ఒక సంసారమే నంటావా? దీన్ని వదిలేస్తే ప్రళయం వస్తుం దంటావా?" అతనిలో ఆవేశం....జయ నరనరాల్లో వణుకుపుడుతోంది. జరగరానిదేదో జరుగుతున్నట్టు....

"బావా! నువ్వు అర్థంలేకుండా, నామీద జాలికొద్దీ ఏదేదో మాట్లాడుతున్నావ్. నీతో రావటం ఎలా సాధ్య మవుతుంది నాకు. అది జరగని పని!"

"ఎందుకు జరగదు జయా! నాతో వచ్చి నా జీవితంలో జ్యోతులు వెలిగించటానికి నీకు నీ మనస్సుని మించి అంగీకరించేవాళ్ళు యింకెవరు కావాలి జయా నా బ్రతుకు ఎప్పుడో ఎక్కడో యిలాగే దొంగబ్రతుకులాగే ముగిసి పోయేకన్నా, నీ సాహచర్యంలో కొత్త ఊపిరి పోసుకుని, కొత్త జీవితం గడిపే అదృష్టం దక్కనీయి జయా! నా కోరిక మన్నించు. ఈ చిన్ననాటి స్నేహితుడు మీద నీకు ఏమాత్రం ప్రేమ, జాలి కలగటంలేదా? ఆలోచించు జయా!" కృష్ణ వణుకుతున్న చేతులతో ఆమె చేతులు పట్టుకుంటూ అన్నాడు.

జయ మనసులో ఏదో ప్రకంపన! ఏదో అంతర్యుద్ధం. ఆమె నిర్వీణ్ణురాలై అలాగే గోడకానుకుని కూర్చుండి పోయింది. కృష్ణ మూసుకుని వున్న దేవత గుడి తలుపుల ముందు వెర్రిభక్తుడిలా ఎంతోసేపు ఆమె జవాబుకై ఆత్రు తగా నిరీక్షించాడు.

ఆమె మౌనం అతనికి కత్తిపోటయింది. తూలుతూ లేచాడు. సూట్‌కేసు తెరచి, అందులోంచి ఒక నీలిరంగు పట్టుచీర తీసుకొచ్చి ఆమె ఒడిలో పెట్టాడు.

"జయా! నిన్ను బాధపెట్టాను మన్నించు. నా స్మృతి

చిహ్నంగా ఈ పట్టుచీర తీసుకో! దొంగసొమ్మని తిరస్కరించకు. నిండుమనసుతో యిస్తున్నాను. కలకాలం సుఖంగా జీవించు. ఇకనే వెళ్తాను. తెల్లవారబోతోంది. వానకూడా వెలిసింది. నాకు సెలవియ్యి జయా! మళ్ళీ నీకు కనబడను. ఇదే ఆఖరిచూపు."

జయ మసకబారిన కళ్ళలో తన ఒడిపైవు చూసుకుంది. అదే చీర! తన భర్త సాయంత్రం బలవంతంగా తన్ని లాక్కుపోయి, తాగుడుకోసం వెంకటనర్సయ్య షాపులో అమ్మేసిన చీర! ఇది చీరేనా? కాదు! ఇది తన అభిమానం! తన జీవితం!

జయలో ఒక్కసారిగా వున్నట్టుండి వచ్చిందో ప్రళయ ప్రకంపనము! అగ్నిశిఖలా లేచింది! ఊడుతున్న జుట్టుని ముడేసుకుంది. నిద్రపోతున్న పిల్లాణ్ని చివాలున భుజాన వేసుకుంది!

"పద బావా! నేనుకూడా నీతో వస్తున్నాను. ఎక్కడకయినా తీసుకుపో. నీ యిష్టం! ఈ కుహనా సాంప్రదాయపు ఇనపతెరల వెనుక నేనింకా ఆట్టేకాలం మగ్గలేను. నన్ను ఈ సంకెళ్ళనించి విముక్తని చెయ్యి."

"జయా" సంభ్రమంగా చూశాడు.

"అవును బావా! నువ్విప్పుడు ఆప్యాయంగా నాకు కానుకిచ్చిన పట్టుచీర నాదే బావా! నా మొగుడు అమ్మేసిన చీర! అతను అమ్మింది చీరకాదు బావా! నా శాంతిని, నా ఆత్మగౌరవాన్ని అమ్మేశాడు. నువ్వు నీకు తెలియకుండానే మళ్ళీ వాటిని నాకు తెచ్చి అప్పగించావు! జీవన సముద్రాన్ని చిల్లి తెప్పలో దాటాలనుకునే వెర్రిభ్రమలు యిప్పుడు నాలో లేవు! పద బావా వెళదాం! నా చెయ్యి పట్టుకుని నీ కిష్టమయిన దారిలో నడిపించు."

"జయా!" పొంగిపొరలిన ప్రేమతో ఆమె తల నిమిరాడు అతను.

"థాంక్స్ జయా! నా అదృష్టాన్ని నాకు దక్కించావు! ఈ పట్టుచీర యిక్కడ వదలద్దు. దీన్ని యిప్పుడే కట్టుకో. ఇంతకన్నా శుభసందర్భం ఏమీలేదు మనకి."

జయ అతనిమాటని పాటించింది. నీలిరంగు పట్టుచీర ఏదో దివ్యశక్తిలా వెలుగులు విరజిమ్ముతోంది ఆమెలో. చంటివాణ్ని తన భుజాన వేసుకుని, మరోచేత్తో జయ చెయ్యి పుచ్చుకుని బయటకు నడిచాడు కృష్ణ.

కర్మానుబంధంలా పడుకుని వున్న రామబ్రహ్మంవైపు కన్నెత్తికూడా చూడకుండా ముందుకు సాగింది జయ! ఆమె మనసు నిశ్చలంగా వుంది!

మనసుకీ, జీవితానికీ పట్టిన చీడల్ని వదిలించుకున్నవాళ్ళ మనసులు నిశ్చలంగానే వుంటాయి! □

స్వానుభవాలు!

భయం

వసుంధర

అతడి వెనుకే ఆమె కూడా బస్సెక్కింది.

ఒక నలభై ఏళ్ళ నడివయసు వ్యక్తి లేచి నిలబడి ఆమెకు సీటిచ్చాడు. నడివయసు వ్యక్తి వెనుకే అతడూ నిలబడ్డాడు.

అతడామెను గమనించలేదు. ఆమెమాత్రము అతడినే

గమనిస్తోంది. ఆమె కన్నుల్లో కుతూహలముంది.

ఒకచోట అతడు బస్సుదిగాడు. ఆమెకూడా దిగింది.

అతడు వడివడిగా నడుస్తూంటే "ఏయ్ మిస్టర్!" అందామె.

అతడు ఆగి వెనక్కు తిరిగి ఆమెవంక ఆశ్చర్యంగా చూశాడు.

ఆమె అతణ్ణి సమీపించి "సుమారు గంటనించి నిన్ను నుసరించి వస్తున్నాను. నన్ను గమనించలేదా?" అంది.

"నేను నిన్ను చూడ్లేదు" అన్నా డత డాశ్చర్యంగా.

"ఎందుకు చూడ్లేదు"

"ఎందుకు చూడాలి?"

"ఏం-నేనందంగా లేనా?"

ఈ ప్రశ్నకతడు తెల్లబోయి—"ఉన్నావు" అన్నాడు.

"బస్సులో ఓ నడివయసు వ్యక్తి లేచినిలబడి నాకు సీటిచ్చాడు. నువ్వుమాత్రము నన్ను పట్టించుకోలేదు" అన్నదామె.

"అయితే ఏమయింది? నువ్వూ నన్ను పట్టించు కోకు...."

"నువ్వు నాగురించి ఏమనుకుంటున్నావో—ఎప్పుడూ కార్లో తిరిగే మనిషిని నీకోసం బస్సెక్కాను మొదటి సారిగా...." అందామె.

అతడు మరింత తెల్లబోయాడు.

"ఇప్పుడు చెప్పు. నువ్వు నన్ను పట్టించుకోకపోతే నా కెంత బాధగా వుంటుంది?" అందామె.

"నీ వివరాలు చెప్పు" అన్నాడతడు కుతూహలంగా.

"ఇలా నిలబడిపోతే బాగుండదు. మనం నడుస్తూ మాట్లాడుకుందాము" అందామె.

ఇద్దరూ కలిసి జంటగా నడుస్తున్నారు.

"ఇప్పుడు నీ వివరాలు చెప్పు" అన్నాడతడు.

"ముందు నీ వివరాలు చెప్పు" అందామె.

"నా వివరాలు తెలియకుండానే నన్ననుసరించివచ్చేవా?" అన్నాడతడు.

"నిన్ను చూశాను. అంతే నీగురించి తెలుసు. అప్పుడు డాడీ వున్నారు నా కార్లో! ఆయనతో నాకు వేరే పనుందని దిగిపోయాను. నిన్ననుసరించాను."

"నాపేరు చరణ్! రకరకాల ఏజన్సీలున్నాయి నాకు. ఊళ్ళోని చాలా షాపులకు మెటీరియల్ నాద్వారా సప్లై అవుతుంది" అన్నాడతడు.

"అంటే నీకుద్యోగం లేదా?"

"లేదు. కానీ నెలకు యాభై వేలు తక్కువుండదు నా సంపాదన!"

ఆమె కళ్ళు మెరిశాయి.

"మరి నీ వివరాలు చెప్పు" అన్నాడతడు మళ్ళీ.

"నాపేరు వీణ. మా నాన్నగారి పేరు రాజు. బహుశా ఆయనకూ నువ్వు చాలా మెటీరియల్స్ సప్లై చేస్తూండి వుండాలి" అంది వీణ.

"రాజు అంటే?"

"బజార్లో రాజూ కాంప్లెక్స్ లేదూ!" అందామె.

"బాప్‌రే—రాజుగారు మీ నాన్నగారా?" అన్నాడాతడు.

"అవును."

"అయితే నాతో కలసిరాకు" అన్నాడతడు.

"ఏం?"

"ఆయనకు తెలిస్తే బాగుండదు."

"తెలియకపోతే బాగుంటుందా?"

"రాజుగారంటే నాకు భయం."

"ఎందుకు?"

అతడు మాట్లాడకుండా "ప్లీజ్-వెళ్ళిపో" అన్నాడు.

"నేను నీతో స్నేహం కోరుతున్నాను. కాదనకు" అందామె.

"మనం స్నేహంగా వుంటే మీ నాన్నగారు నన్ను చంపేస్తారు."

"నెలకు యాభై వేలు సంపాదిస్తున్నావు. నువ్వు మా నాన్నగారికెందుకు భయపడతావు?" అందామె.

"ఏం-నీకు మీ నాన్నగారంటే భయంలేదా?"

"లేదు...."

"అబద్ధం-నీ కాయనంటే భయముంది...."

"నీకెలా తెలుసు?"

"మీవంటి వాళ్ళ యిళ్ళలో తీరుతెన్నులు నాకు బాగా తెలుసు."

"పొరపడ్డావు. నాకు మా నాన్నగారంటే భయంలేదు. అందుకు ఋజువు కావాలంటే చూపగలను" అంది వీణ.

"అయితే...." అని ఆగాడతడు.

"ఊఁ" అంది వీణ.

"అక్కడ లాంప్‌పోస్ట్ దగ్గర రిక్షా కనబడుతోంది చూశావా?" అన్నాడతడు.

"ఊఁ" అందామె.

"ఆ రిక్షావాడు కండలు తిరిగిన యువకుడు. మనిషి కూడా ఎంతో బాగున్నాడు."

"ఊఁ"

"అతణ్ణి నువ్వు పెళ్ళిచేసుకుంటానంటే మీ నాన్నగా రొప్పుకుంటారా?"

వీణ తెల్లబోయి "ముందు నే నొప్పుకోవాలిగదా!" అంది.

"ఒప్పుకుంటావు - నీ మాట నిజమని ఋజువు కావా లంటే!"

"ఏడిసినట్లుంది నీ పరీక్ష-నేనడిగిందేమిటి-నువ్వు చెబు తున్నదేమిటి?" అంది వీణ కోపంగా.

"నిజంగా పెళ్ళిచేసుకోమనలేదుగా. మీ నాన్నగారి నడిగి చూడు. ఏమవుతుందో చూద్దాం" అన్నాడు చరణ్.

"అడుగుతాను. కూడా నువ్వూ వస్తావా?"

"నేనెందుకు?"

"మా నాన్నగారు నా కిచ్చిన స్వేచ్ఛను కళ్ళారా చూద్దువుగాని...."

"మీ నాన్నగారంటే నాకు భయం...."

"మరి ఋజువెలా తెలుస్తుంది నీకు?"

"రేపు కార్లో మీ యిద్దరూ బీచికి రండి. ఈ రిక్షావా డప్పుడు ఫుల్ సూట్‌లో వుండాలి" అన్నాడు చరణ్.

"సరే!" అంది వీణ.

2

బీచిరోడ్డుమీద ఓ లాంప్ పోస్టుదగ్గర నిలబడి ఉన్నాడు చరణ్. అతడికి ప్రక్కగా కారాగింది. అందులోంచి వీణ, ఓ ఫుల్‌సూట్ యువకుడు దిగారు.

చరణ్ వీణను గుర్తుపట్టాడు. ఆమెను సమీపించి "ఇతడెవరు?" అన్నాడు.

"నిన్న నువ్వుచూపిన రిక్షావాడు" అంది వీణ.

చరణ్ అతడిని గుచ్చిగుచ్చి చూస్తూ "ఇతడు రిక్షావా

డిలా లేదే!" అన్నాడు.

"అదీ ఋజువుచేస్తాను" అంటూ వీణ ఆ ఫుల్ సూట్ యువకుణ్ణి కార్లోకి వెళ్ళమంది. అతడు కార్లోకివెళ్ళి అయిదు నిముషాల్లో మళ్ళీ దిగాడు. చరణ్ అతణ్ణిచూసి ఆశ్చర్య పోయాడు.

ఆ ఫుల్ సూట్ యువకుడి రూపం పూర్తిగా మారిపోయి నది. మాసిన నిక్కరు, చిరుగుల బనియన్, నల్లటి వళ్ళు....

"అదిగో అక్కడుంది నీ రిక్షా" అంది వీణ.

దూరంగా రోడ్డుకు ప్రక్కగా ఓ రిక్షా వుంది. ఆ యువ కుడా రిక్షాదగ్గరకు వెళ్ళాడు.

"కావాలంటే మనమిద్దరము ఆ రిక్షా ఎక్కుదాము" అంది వీణ.

"అది అమానుషం."

"ఎందుకని?"

"నిన్న వాణ్ణి పెళ్ళిచేసుకుంటా నన్నావు. ఈరోజు నిన్నూ నన్నూ రిక్షాలో లాగమనడము వాడినెంత హర్ట్ చేస్తుంది?"

"ఏమీ చేయదు-వాడికి నేను నూరురూపాయ లిచ్చాను. ఎంతో సంతోషముగా వున్నాడు" అంది వీణ.

"నువ్వసలు వాణ్ణి మీ నాన్నగారి దగ్గరకు తీసుకుని వెళ్ళావా?"

"అనుమానముంటే నువ్వూ నాతో రావాల్సింది."

"నిన్ను నేను నమ్మానులే" అన్నాడతడు.

"అయితే మన స్నేహం."

"కుదరదు" అన్నాడతడు.

"ఎందుకని?"

"మీ నాన్నగారంటే నాకు భయం."

"మా నాన్న నాకు భయపడతాడు. నాతో స్నేహంగా ఉంటే నీకూ భయపడతాడు" అంది వీణ.

చరణ్ నవ్వి "మీ నాన్నగారిని భయపెట్టే ఉద్దేశ్యము నాకు లేదు" అన్నాడు.

"ఎందుకని?"

"భయపెట్టాలంటే ఆయన జోలికి వెళ్ళాలికదా!"

"నీకు నిజంగా రాజుగారంటే భయంలేదు" అంది వీణ.

"ఉంది" అన్నాడతడు.

ఆమె తమాషాగా నవ్వింది "భయముంటే నాతో స్నేహం వద్దనవు. నా మనసు నొచ్చుకుంటే అది రాజు గారి మనసు నొచ్చుకున్నట్లే!"

"అయినా ఫరవాలేదు. నీ మనసు నొప్పించినందుకు రాజుగారేమీ అనుకోరు."

"ఆయన అనుకునే విధంగా నేను చెబుతాను...."

"అంటే?" అతడు కాస్త కంగారుపడ్డాడు.

"నీమీద లేనిపోనివి కల్పించి చెబుతాను."

"చెప్పొద్దు" అన్నాడతడు.

"నేను చెప్పినట్లు వింటే చెప్పను."

"నీతో స్నేహం తప్ప మరేమైనా వింటాను."

"సరే—అయితే విను.... రేపొక్కరోజు దేవీ ఫ్యాన్సీ స్టోర్సులో అన్ని వస్తువులమీదా టెన్ పర్సెంట్ డిస్కౌంటివ్వాలి."

"ఎందుకు?"

"నాతో స్నేహం వదుల్చుకునేందుకు."

"దేవీ ఫ్యాన్సీ స్టోర్సు ఎక్కడుంది?"

ఆమె చెప్పింది.

"సరే" అన్నాడతడు.

3

"హలో! రవిశంకరేనా మాట్లాడుతూంట!"

"అఁను.... నేనే.... అవతలెవరు?"

"నేను వీణను."

"హాఁ వీణా ఏమిటి విశేషం?"

"రేపు నీ ఫ్యాన్సీస్టోర్లో అమ్మకానికి కొత్తకొత్త వస్తువులన్నీ పెట్టు."

"ఎందుకు?"

"రేపు నీకు విపరీతమైన అమ్మకాలు...."

"ఎలా చెప్పగలవు?"

"అంతమంది మధ్య నువ్వొక్కడివే టెన్ పర్సెంట్ డిస్కౌంటిస్తే జనం ఎగబడక ఏం చేస్తారు?"

"డిస్కౌంటా-యిప్పుడా....ముందుగా ధరల లేబిల్సు తయారుచేయకుండా డిస్కౌంటేమిటి?" అన్నాడు రవిశంకర్.

"అందువల్ల నీకేమీ నష్టముండదు. నువ్వెంత డిస్కౌంటిచ్చావో అంతా కూడా ఓ పార్టీ యిస్తాడు నీకు. బిల్సన్నీ జాగ్రత్తగా తయారుచేయి. ఈరోజే అడ్వర్టయిజ్‌మెంటు, పబ్లిసిటీ చూసుకో...."

"నువ్వు చెప్పేదేమిటో నాకర్థంకావడంలేదు...."

"అర్థమవుతుంది."

"ఎందుకిదంతా అసలు?"

"నువ్వు నన్ను మనసారా ప్రేమించావు. నేను నీ ప్రేమనంగీకరించలేకపోయాను. నావల్ల నీకీ మాత్రం లాభం వస్తే అదో సంతోషం నాకు."

"వీణా—నాకు లాభంవద్దు. నువ్వే కావాలి."

వీణ ఫోన్ పెట్టేసింది.

"బావకేనా ఫోన్ చేశావు?" అన్నాడు పక్కనే వున్న రాజు.

"అవును నాన్నా."

"వాడికింకా పైత్యం వదిలినట్లు లేదు....ఏమన్నాడు?" అన్నాడు రాజు కోపంగా.

"నేనే కావాలిట...."

"హుఁ" అని హుంకరించాడు రాజు "కూటికి గతిలేని వెధవని తీసుకొచ్చి దుకాణం తెరిపించాను. వరసకు బావైతే మాత్రం తన అంతస్తు తెలుసుకోవద్దూ?"

"దగ్గర నాలుగు డబ్బులు చేరితే ఎవరైనా అంతస్థులు మర్చిపోతారు నాన్నా!"

"మన చరణ్ విషయం చూడు నువ్వు కావాలని అతడి స్నేహం కోరినా నామీద గౌరవంతో దూరంగా ఉంటున్నాడు. అంతస్థులో అతడు నీ బావకంటే ఎన్నోరెట్లు గొప్ప."

"చరణ్ అసలురంగు నేను బయటపెడతానుగా" అంది వీణ.

"అది నీవల్ల కాదు. నా వంటివాళ్ళకు భయపడుతూ నీ వంటి వాళ్ళకు దూరంగా ఉంటే తప్ప అతడి ఆస్తి, అంతస్థు నిలబడవు" అన్నాడు రాజు నమ్మకంగా.

"చూస్తారుగా నా ప్రతాపం" అంది వీణ.

"ఇంతవరకూ ఏం జరిగింది? ఓ రిక్షావాణ్ణి ఫుల్‌సూట్లో నీ పక్కన కూర్చోపెట్టుకున్నావు. నీ బావ వ్యాపారములో ఓరోజు లాభం తెచ్చిపెడుతున్నావు. చరణ్‌కు మాత్రం దగ్గర కాలేవు" అన్నాడు రాజు.

"చరణ్‌కు నేను దగ్గరైతే మా యిద్దరి పెళ్ళి జరిపిస్తారా నాన్నా!" అంది వీణ తండ్రివంక కుతూహలంగా చూస్తూ.

"నువ్వు చరణ్‌ను ప్రేమిస్తున్నావా?"

"అది తెలుసుకుని ఏం ప్రయోజనం?" అంది వీణ.

"నేను నీ ప్రేమనే గౌరవిస్తున్నాను. నీ సుఖమే నా సంతోషం...."

"బావ విషయంలో మీరు నా అభిప్రాయం అడగ లేదు."

"బావ విషయంవేరు. వాడు లేమిలో పుట్టిపెరిగాడు. వాడు నువ్వంటే ఆశపడుతున్నాడు. పెళ్ళయ్యాక ఆ ఆశ అసూయగా మారుతుంది. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో నీ జీవితాన్ని నరకంగా మార్చుతాడు."

"మరి చరణ్."

"చరణ్ స్వయంకృషితో పైకివచ్చాడు. అంతులేని ఆస్తి ఉందతడికిప్పుడు. అయినా వినయగుణం వదల లేదు. అతడు నిన్ను కోరలేదు. పెళ్ళాడతాననలేదు. అందువల్ల నిన్ను తప్పక బాగా చూసుకుంటాడు."

"అంటే చరణ్ మీకు నచ్చేడా?" అంది వీణ.

"లేదు" అన్నాడు రాజు గంభీరంగా.

"మరి?" అంది వీణ ఆశ్చర్యంగా.

"నీకు నచ్చితే సరిపెట్టుకుంటాను. నీకు నచ్చకపోతే మాత్రం నీకు అన్నివిధాలా తగిన వరుణ్ణి నేను చూస్తాను" అన్నాడు రాజు.

"చరణ్ మీకెందుకు నచ్చలేదు."

"నా కళ్ళముందు జాతకాలు మారిన వారెవ్వరూ నాకు నచ్చరు."

"అయితే నన్ను చరణ్‌దగ్గరకెందుకు వెళ్ళనిస్తు

న్నారు?''

"బేబీ-నువ్వు బావ ప్రేమగురించి చెప్పావు. అప్పుడు నేను చరణ్‌గురించి చెప్పి-అలాంటివాడే నా కూతుర్ని పెళ్ళాడతాననడానికి భయపడతాడన్నాను. భయపడడని సవాలు చేశావు. నిజం నువ్వే తెలుసుకుంటావని అంతా నీకే వదిలిపెట్టాను'' అన్నాడు రాజు.

"మీరు చాలా చిత్రమైన మనిషి నాన్నా!'' అంది వీణ.

రాజు నవ్వి "డబ్బున్నవాడు మామూలుగా వుండ కూడదు. చిత్రంగానే ఉండాలి'' అన్నాడు.

"నేను చరణ్‌ని మరో విధంగా లొంగదీస్తాను. నేనసలు మీ కూతుర్నే కాదనీ అంతా నాటకమనీ చెబు తాను'' అంది వీణ.

"ట్రై యువర్ లక్!'' అన్నాడు రాజు. అతడు చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో పరిహాసముంది.

4

చరణ్ ఆమెవంక ఆశ్చర్యంగా చూసి "నువ్వు రాజు గారమ్మాయివి కాకపోతే నాతో అబద్ధమెందుకు చెప్పావు?'' అన్నాడు.

"ఆయన నిన్ను పరీక్షించమన్నాడు. తన కూతుర్ని పెళ్ళాడతాననే ధైర్యం చరణ్‌కుండదని ఆయన ధృవ పర్చుకోవాలనుకున్నాడు....''

"మరిప్పుడెందుకు నిజం చెప్పావు?''

"ఆయన పనైపోయింది. నా పని కాలేదు.''

"ఏమిటి నీ పని?''

"నీతో స్నేహం.''

"ఎందుకు నాతో స్నేహం?''

"ఎందుకంటే ఏం చెప్పను—ఎలా చెప్పను? బహుశా నేను నిన్ను ప్రేమిస్తున్నానని నా అనుమానం."

"అయితే...."

"మనము కొన్నాళ్ళు స్నేహంగా వుందాము—ఒకరి గురించి ఒకరు బాగా తెలుసుకుందాం. ఇష్టమైతే అప్పుడు పెళ్ళిచేసుకోవచ్చు."

"నాకిప్పుడే ఇష్టంలేదు."

"ఎందుకని?"

"నువ్వు రాజుగారమ్మాయివి కాబట్టి!"

"కాదని చెప్పానుగా?" ఆమె కళ్ళలోని కుతూహలం ఆమె అందాన్ని మరింతగా పెంచింది.

"అవుననడానికి తిరుగులేని ఋజువుంది!"

"ఏమిటది?"

"నాతో స్నేహంకోరి ఓ రిక్షావాడికి సూటూ బూటూ వేసి పక్కన కార్లో కూర్చోపెట్టుకున్నావు. అంతటి ఉదార హృదయం రాజుగారమ్మాయికి తప్ప సాధ్యపడదు."

వీణ బుగ్గలు ఎరుపెక్కాయి. అప్పుడామె ముఖం ఉదయసూర్యుడిలాగుంది "ఇదేనా నీ ఋజువు!"

"ఇది మామూలు ఋజువు. తిరుగులేనిది వేరే వుంది!"

"అదేమిటి?" ఆమె కళ్ళు రెపరెపలాడాయి.

"ఫుల్‌సూట్లో వున్న మగాణ్ణి చింకి బట్టలలోకి మార్చి వాడి రిక్షాలో మనమిద్దరము సవారీ చేద్దామన్నావు."

"అయితే?"

"అందలమెక్కించిన చేత్తోనే అధఃపాతాళానికి తోయ గల క్రూరత్వం రాజుగారమ్మాయికే సాధ్యపడుతుంది."

ఈ మాటలు విన్నప్పుడు—వీణ ముఖం చీకట్లో మిగి లిన సానబెట్టని రత్నంలాగుంది. "నీకు మా నాన్నగారంటే

భయంలేదు. ఉంటే ఇలాంటి మాటలనలేవు?" అందామె.

"నిన్ను నాకు దూరంగా వుంచుకునేందుకు-నిన్నేమన్నా ఆయన నొప్పుకోరు. నాచేత ఇంకా యింకా వాగించకు. ప్లీజ్ నాకు దూరంగా వుండు."

"నువ్వు మా నాన్నగారికి నిజంగా భయపడటంలేదు. నేనంటే యిష్టంలేక అలా వంకపెడుతున్నావు."

"నిన్ను నమ్మించటం కోసం ఒక్క రోజులో పద్దెనిమిదివేలు నష్టపోయాను — దేవీ ఫ్యాన్సీ స్టోర్సులోని డిస్కౌంటంతా భరించి!" అన్నాడు చరణ్ దీనంగా-

"నన్ను నమ్మించే ఉపాయం నీకు తెలుసు."

"తెలియదు."

"బాగా ఆలోచించి చూడు."

"అవసరం లేదు."

"అయితే నీకు నేను వారంరోజులు గడువిస్తున్నాను. బాగా ఆలోచించి చెప్పు. నీకే ఉపాయమూ తోచకపోతే అది నేనే చెబుతానప్పుడు."

"ఇప్పుడే చెప్పొచ్చుగా" అన్నాడతడు కుతూహలంగా.

"చెప్పను. ఈ వారంరోజుల్లోనూ నాకూ కొన్ని పనులున్నాయి."

"కానీ నాకు వారంరోజుల గడువవసరం లేదని ముందే చెప్పాను."

"అవసరం లేకపోతే ఇప్పుడే చెప్పొచ్చుగా" అంది ఆమె.

ఏమనుకున్నాడో చరణ్ వెళ్ళిపోయాడు.

5

"బేబీ—నువ్విలా చరణ్‌ని వెంటాడి వేధించడం బాగోలేదు."

"నే నతణ్ణి వేధించడంలేదు. అతడు నా సమక్షాన్ని కోరుతున్నాడు."

"ఎలా చెప్పగలవు?"

"ఇప్పుడు చెప్పను."

"కానీ చరణ్ ఇప్పుడేం చేస్తున్నాడో తెలుసా?"

"ఏం చేస్తున్నాడు?"

"తనమీద తప్పుడు కేసు బనాయింపుకుని జైలుకు వెడుతున్నాడు."

"ఎందుకు?"

"జైలుకు వెళ్ళినవాడితో నువ్వు స్నేహం చేయవుగా-అందుకని!"

"అంతా అబద్ధం నాన్నా!" అంది వీణ.

"లేదమ్మా—నిజం. అతడికి నేనంటే చాలా భయం. పాపం—అండిజోలికి వెళ్ళకు...." అన్నాడు రాజు.

"నువ్వంటే భయమెందుకు? నువ్వతడి నేం చేయగలవు?"

రాజు విలన్‌లా నవ్వి "సమాజంలో ఈ స్థాయికి చేరుకున్న నా గురించి నీ కంటే అతడికే బాగా తెలుస్తుంది" అన్నాడు.

"అతడు నయవంచకుడైతే....?"

"అంటే?"

"అతడి కారణంగా నాకు తెలిసిన అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది."

రాజు చిరాకుపడ్డాడు.

చరణ్‌కి డబ్బుంది. వయసుంది. అందమైన మగాడు. ఎందరో ఆడపిల్లలతడి వెంట పడటం సహజం. వారిలో ఎవరైనా ప్రోత్సహిస్తే ఓ అడుగు ముందుకు వేయడమూ

సహజం. అప్పుడా తప్పు ఆడపిల్లదే కానీ అతడిది కాదు.

"చరణ్‌కి చాలామంది గర్ల్‌ఫ్రెండ్సున్నారు."

"అవును—ఆడవాళ్ళకు దూరంగా వుండాలనుకుంటా డతడు. అందుకే వారికి అతడంటే ఆకర్షణ."

వీణ ఇబ్బందిగా తండ్రివంక చూసి—"మీ కతడంటే చాలా ఆకర్షణగా ఉంది. అందుకు కారణం దూరంకాదని నాకు తెలుసు" అంది.

"వేవీ—మాటలు పెంచకు. చరణ్‌ని కలుసుకుని అతడితో స్నేహాన్ని కోరటం లేదని చెప్పేసేయ్. లేకుంటే అనవసరముగా అతడు జైలుపాలవుతాడు."

"మీరే అతడికి సహకరిస్తున్నారని నా అనుమానం" అంది వీణ.

"అతడు పైకిరావడానికి సహకరించినవాణ్ణి—క్రిందకు జారిపోతూంటే ఎలా ఊరుకోగలను? కానీ ఇప్పుడతడికి నా సహకారం అవసరంలేదు. అంతగా ఎదిగా డతడు!"

"అయితే జైలుపాలు కానివ్వండి....ఏమవుతుందో చూస్తాను."

6

చరణ్ నిజంగానే అరెస్టు చేయబడ్డాడు. అతడింటిలో మత్తుపదార్థాలున్న పెట్టె ఒకటి దొరికింది పోలీసులకు. ఎవరో ఫోన్‌చేస్తే వున్నపళంగా వెళ్ళి ఇల్లు వెదికేశారు పోలీసులు.

వీణ ఆశ్చర్యపడింది.

ఆమె జైలుకి వెళ్ళి చరణ్‌ని కలుసుకుంది. అతడిపై జాలిపడింది.

"నిజంగా ఇంతపని చేస్తావనుకోలేదు!" అందామె.

"మరోదారి కనపడలేదు నాకు" అన్నాడతడు.

"ఇప్పుడేం చేస్తావు?"

"నాతో స్నేహం కోరనని చెప్పు. క్షణాలమీద జైలు నించి బయటకు రాగలను."

"అదెలా సాధ్యం?"

"నాకన్నీ సాధ్యమే."

"ముందు జైల్నించి బయటకురా."

"స్నేహం గురించి వాగ్దానం చేయి."

"చేస్తాను. కానీ ఇప్పుడు కాదు. రెండ్రోజుల్లో నేనిచ్చిన వారంరోజుల గడువూ అయిపోతుంది. అప్పుడు మా యింటికి రా" అంది వీణ.

చరణ్ ఆమెవంక అనుమానంగా చూశాడు. ఇంకా ఆమె తనకెలాంటి పరీక్షలు పెట్టబోతోందోనని అతడిభయం.

మర్నాడే చరణ్ విడుదలయ్యాడు. అతడి వద్ద దొరికినవి మత్తు పదార్థాలు కావనీ—మందులకువాడే రసాయనాలనీ పోలీసు పరీక్షలో తేలిందిట. పోలీసులతడికి క్షమార్పణ కూడా చెప్పుకున్నారు.

ఆ మర్నాడు నిర్ణయించిన సమయానికి చరణ్ రాజు ఇంటికివెళ్ళాడు. ఓగదిలో రాజు,వీణ,చరణ్ కూర్చున్నారు.

"సార్—నేను చేయగలిగినదంతా చేశాను" అన్నాడు చరణ్.

"నాకు తెలుసు. ఇందులో నీ తప్పేమీ లేదు" హామీ యిచ్చాడు రాజు.

"నేను నిన్ను కొన్ని ప్రశ్నలడగాలి" అంది వీణ.

"అడుగు" అన్నాడు చరణ్.

"నీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న సుభద్ర కాలేజీలో నా క్లాస్‌మేటు. ఆమె చెప్పిన ప్రకారం నువ్వామెకు ఆశపెట్టావు. మోసంచేశావు."

చరణ్ ఆశ్చర్యంగా—"సుభద్ర నీకలా చెప్పిందా? ఆమెను నాకు దూరంగా వుంచాలని ఎంతగానో ప్రయత్నించాను.... అవేమీ చెప్పలేదా?" అన్నాడు.

"నాతోనూ దూరంగా వుండాలని నువ్వు ప్రయత్నించావు. కానీ నీ ప్రయత్నాల్లో సిన్సియారిటీ లేదు."

"ఎందుకు లేదు? రిక్షావాడిని పెళ్ళిచేసుకుంటానని తండ్రికి చెప్పమన్నాడు. దేవీ ఫ్యాన్సీస్టోర్లో ఒకరోజంతా టెన్ పర్సెంట్ డిస్కౌంటిచ్చాడు. ఆఖరికి జైలుపాల యాడు .... ఇంతకంటే సిన్సియారిటీ ఏముంటుంది?" అన్నాడు రాజు.

"ఉంటుంది."

"ఏమిటది?" అన్నాడు రాజు.

"చరణ్ ఎంతో తెలివైనవాడు. వారంరోజుల టైములో అన్నీ తెలుసుకోలేడా? అతడే మీకు చెబుతాడు" అంది వీణ.

"చరణ్ తెలివి నాకు తెలుసు. మీ తెలివీ తెలుసు. అతడంటే మీ కిష్టం. ఈ నాటకమంతా మీరూ అతడూ కలిసే ఆడారనీ నాకు తెలుసు. అతడిపట్ల నా ఆకర్షణను పెంచాలని మీ రిద్దరూ తీవ్రంగా ప్రయత్నించారు" అంది మళ్ళీ వీణ.

"గ్రహించావన్నమాట" అన్నాడు రాజు ఇబ్బందిగా.

"చరణ్ సుభద్ర విషయంలో మిమ్మల్ని నమ్మించాడు. నన్ను నమ్మించలేడు."

"ఎందుకని?"

"సుభద్ర ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలుసా? అప్పటికే చరణ్‌కి వివాహమయిందన్న నిజం తెలిసి!" అంది వీణ ఆవేశంగా.

"ఏమిటీ?" అన్నాడు రాజు.

"బుర్రలు మార్చి బుర్రలు పెట్టగలమనుకునే మీ

రిలాంటి చిన్న విషయాల్లో పప్పుల్లో కాలేస్తూంటారు. చరణ్ స్వయానా తన మరదలిని పెళ్ళిచేసుకున్నాడు. ఆమె పల్లెటూళ్ళో వుంది. అప్పుడప్పుడక్కడికి వెళ్ళొస్తూంటాడు. తన స్వప్రయోజనాలకోసం ఇక్కడ పట్నంలో ఒంటరిగా ఉంటున్నాడు. భార్యకానీ అత్తమామలు కానీ అతడి కెదురుచెప్పే స్థితిలో లేరు. అతడు మరో పెళ్ళి చేసుకున్నా వారు నోరెత్తలేరు. అది వారి అసహాయత. ఈ చరణ్ నిజంగా నాకు మారంగా ఉండాలనుకుంటే తనకు పెళ్ళయిపోయిందన్న ఒక్కముక్క చెబితే సరిపోయేది. అది చెప్పకపోవడం వల్లనే అతడి సిన్సియారిటీనీ, అతడి సిన్సియారిటీని నమ్మే మిమ్మల్నీ అనుమానించాను."

"అంతా అబద్ధం-నాకు పెళ్ళయిందనడానికి సాక్ష్యం" అన్నాడు చరణ్.

సరిగ్గా అప్పుడే గది తలుపులు తెరుచుకున్నాయి. అక్కడో యువతి నిలబడి వుంది ఆమె చేతిలో ఓ కవరు వుంది.

"నాన్నా! ఆమె చరణ్ భార్య. ఆమె చేతిలోని కవర్లో పెళ్ళి ఫోటోలు, శుభలేఖ ఉన్నాయి. మీరంటే భయపడే చరణ్ మీకు చెప్పకుండా దాచిన నిజమిది. సుభద్రవంటి అమ్మాయిలు ఆత్మహత్య చేసుకోకుండా, మీలాంటి తల్లిదండ్రులు నాబోటి కూతుళ్ళ గొంతు కోయకుండా ఆగాలంటే—చరణ్ మీరంటే నిజంగా భయపడే మాటైతే - అతడి భార్యకి ఊళ్ళో చరణ్ భార్యగా స్థానం సంపాదించి పెట్టండి...." అని అక్కణ్ణించి వెళ్ళిపోయింది వీణ.

రాజు చరణ్ వంక చూశాడు.

నిజమైన భయం ఎలా ఉంటుందో చరణ్ కళ్ళు ఆయనకు చెబుతున్నాయి. □

ప్రతీకార జ్వాల

బొమ్మిడి అచ్చారావు

నాది పాము పగ! నా చెల్లెలి జీవితాన్ని నాశనం చేసిన చంద్రరావుని ప్రాణాలతో వదిలిపెట్టకూడదని ఆ నాడే ప్రతిజ్ఞ చేసుకున్నాను మనసులో. అయితే దాన్ని కార్య రూపంలో పెట్టడానికి ఈనాటిదాకా అవకాశం దొరకలేదు.

చంద్రరావుని చంపటం అనుకున్నంత తేలిక కాదు.

అతను సామాన్యుడు కాడు. సంఘంలో ఇంతో అంతో పలుకుబడి ఉన్నవాడు. డబ్బు మదంతో బాగా బలిసిన వాడు. ఎప్పుడూ కాలు కిందపెట్టకుండా కార్లలో తిరిగే వాడు. అలాంటివాడ్ని చాలా పకడ్బందీగా అంతం చెయ్యాలి!

చంద్రరావు ఒకప్పుడు నా ప్రాణస్నేహితుడు. నా మాట వేదవాక్కుగా భావించేవాడు. నావంటి స్నేహితుడు లభించటం తన అదృష్టమని చెప్పేవాడెన్నోసార్లు.

వాడివెంట ఓ అమ్మాయి పడి వాడి ఆకర్షణలో శలభంలా మాడిపోయింది. ఆమెతో అవసరం తీరాక ఆమెను పురుగులా విదిలించి పారేశాడు. ఆమె వాడ్ని పెళ్ళిచేసుకో మని కాళ్ళ వేళ్ళ పడింది. వాడు నిర్లక్ష్యంగా నవ్వి పొమ్మ న్నాడు.

ఆ అమ్మాయి దీనావస్థకి నాకు మాత్రం చాలా జాలే సింది. ఆ అమ్మాయిని అన్యాయం చెయ్యొద్దని, పెళ్ళి చేసుకోమని వాడికి నచ్చచెప్పాను.

వాడు పెద్దగా నవ్వేసి "కావాలంటే నువ్వు చేసుకో! పిల్ల మాత్రం చాలా సుఖాన్నిచ్చింది. అలాంటి అమ్మా యిలు చాలా అరుదుగా దొరుకుతారు. అనుభవించిన అమ్మాయినల్లా పెళ్ళిచేసుకుంటూ పోతే ఈ పాటికి సెంచరీ దాటి పోయుండేది!" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేకపోయాను. వాడిలోని రాక్షసుడ్ని మొదటిసారిగా చూశా నా రోజు.

అయితే వాడి పాపిష్టి చూపు నా చెల్లెలిమీద పడ్తుందని గాని, వాడి కామతృష్ణకి దాన్ని బలిచేస్తాడనిగాని ముందుగా ఊహించివుంటే వాడి స్నేహానికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేసుండేవాడ్ని!

కాని జరగబోయేది ముందుగానే తెలుసుకోవటం మని షికి సాధ్యంకాదు గదా!

నేనింట్లో లేని సమయంలో వాడు ఒంటరిగా ఉన్న చెల్లాయిని నిర్బంధించాడు. అది ఎదురు తిరిగింది. వాడి పశుబలాన్నెదిరించలేక కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడింది. కన్నీళ్ళతో వాడి పాదాలు కడిగింది. తనని నాశనం చెయ్యొద్దని దీనాతిదీనంగా వేడుకుంది.

కాని ఆ దుర్మార్గుడి మనసు కరగలేదు. ప్రాణస్నేహితుడి చెల్లెలని కూడా చూడకుండా దారుణంగా చెరిచాడు దాన్ని. సమయానికి అమ్మ పురాణశ్రవణానికి గుడికి వెళ్ళింది. నేను ఆఫీసుకి వెళ్ళాను. చెల్లాయి ఒంటరిగా చిక్కింది.

నా చెల్లెలు ఆత్మాభిమాని, సెన్సిటివ్. జరిగిన అవమానాన్ని ఆ చిన్నమనసు తట్టుకోలేక పోయింది. గన్నేరు పప్పు కొట్టుకుని తిన్నది. నాకు జరిగిన ఘోరాన్ని తెలియ చెయ్యటం కోసమే ప్రాణాలు నిలుపుకుని ఎదురుచూసింది. నాతో చెప్పి కన్నుమూసింది. నాలో ప్రతీకార జ్వాల చెలరేగింది. చెల్లాయి అనవసరంగా తొందరపడి ఆత్మహత్య చేసుకుని వుండకపోతే ఆ చంద్రావుగాడి చేత దాని మెళ్ళో మూడుముళ్ళు వేయించి వుండేవాడ్ని. పూర్ గర్ల్! ఆవేశం తప్ప ఆలోచన లేదు.

నేనా క్షణంలోనే నా ప్రతీకారం తీర్చుకోవాలని గాఢంగా నిర్ణయించుకున్నాను. చెల్లాయి శవం నట్టింట్లో ఉండగానే చంద్రావింటికి వెళ్ళాను. వాడింట్లో లేడు. వాడి అమ్మ, నాన్న, తమ్ముడు రెండురోజుల క్రితం గుంటూరు పెళ్ళికి వెళ్ళి ఇంకా తిరిగిరాలేదు.

ఇంట్లో చంద్రావు చెల్లెలు మనోహరి మాత్రమే

వుంది!

ఆమెను చూడగానే నా ఆలోచన మనోహారిన నడిచింది. చంద్రావుని హత్యచేయటానికి ముందు వాడి చెల్లెల్ని మానభంగం చెయ్యాలి! నా చెల్లెల్ని వాడు అమానుషంగా చెరిచినట్టే నేనూ మనోహరిని చెరచాలి!

నాలో రాక్షసుడు లేచి బుసలుకొట్టాడు. ఒక్కసారిగా మనోహరిని నా సందిట బంధించాను.

ఎన్నడూలేని ఈ విపరీత ప్రవర్తనకి మనోహరి కొద్ది సేపటివరకు నిర్ఘాంతపోయింది. ఈలోపల ఆమెను రెండు చేతుల్తోను ఎత్తి బెడ్‌రూంలోకి తీసుకుపోయి బెడ్‌మీద కూలేశాను.

నా కళ్ళలోని ఎర్రజీరలు, నా ముఖంలోని క్రౌర్యం చూసి బాగా భయపడిపోయింది మనోహరి. అయినా నన్ను ప్రతిఘటించింది.

"ఎందుకు రాజూ, నన్నేం చేయబోతున్నావు?" అనడిగింది ధైర్యం తెచ్చుకుని.

"నీ అన్న నా చెల్లెల్ని చెరిచాడు. అది ఆత్మహత్య చేసుకుంది. అదే పని ఇప్పుడు నేను చేయబోతున్నాను" అంటూ ఆమె చీరకుచ్చిళ్ళు పట్టుకుని లాగేశాను.

మనోహరి నా కళ్ళలోకి సూటిగా చూసింది. "నా అన్న ఇంత దుర్మార్గాని కొడికట్టినందుకు చాలా విచారిస్తున్నాను. గర్హిస్తున్నాను. కాని ఒక్కమాటడుగుతాను, సమాధానం చెప్పు! నన్ను పాడుచేస్తే నీ కసి తీర్తుందేమోగాని.పోయిన నీ చెల్లెలు తిరిగొస్తుందా? నా అన్న పశుప్రాయుడు. నువ్వు నా దృష్టిలో ఈ క్షణందాకా ఎంతో ఉత్తముడివి, ఉన్నతుడివి. నన్ను ఎంగిలి చేయటంలో నీ కానందం లభిస్తే, నీ పగ ప్రతీకారమే నీకు ముఖ్యమయితే నన్ను

ఏమైనా చేసుకో" అంటూ తనే దుస్తులన్నీ ఒలిచి నగ్నంగా మంచంమీద పడుకొంది.

నా వెన్నున కొరడాతో ఛెళ్ళున ఎవరో చరిచినట్టనిపించింది. కిందపడున్న చీరను ఆమె ఒంటిమీద కప్పాను. చాలా అమానుషంగా ప్రవర్తించాననిపించింది. రక్తం చల్లారిపోయింది.

"సారీ మనోహరీ!" అన్నాను అస్పష్టంగా.

మనోహరి కళ్ళు ఆనందంతో, ప్రశంసతో మెరిశాయి. చకచక గుడ్డలు కట్టుకుని వెళ్తున్న నా దారికడ్డుగా నిలిచింది.

"రాజూ, జరిగిందానికి నేనెంతో బాధపడ్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకో! అప్పుడు నా అన్న నీ కాళ్ళకింద చెప్పులా పడుంటాడు. వాడ్ని నీ ఇష్ట మొచ్చినట్టు హింసించి నీ కసి తీర్చుకో!" అన్నది.

నేను మారుపలక్కుండా అక్కడ్నుంచి వచ్చేశాను. మనోహరిలాంటి దివ్యసుందరమూర్తిని నే నింతవరకు ఎక్కడా చూడలేదు. ఆమె తనంతట నన్ను వరిస్తుంటే మరో సందర్భంలో అయితే ఎగిరి గంతేసి ఒప్పుకునే వాడ్ని! కాని ఇప్పుడామె నా చెల్లెలి మరణానికి కారకుడైన వాడి చెల్లెలు! నా శత్రువుతో వియ్యమా? వాడ్ని చంపి నా చెల్లెలి ఆత్మకు శాంతి కలిగించాలి! నేనేమయిపోయినా ఫరవాలేదు.

నా చెల్లెలు చితిమంటల్లో మాడి మసైపోతుంటే గాఢంగా ఒట్టుపెట్టుకున్నాను—చంచ్రావుని ఖండఖండాలుగా చీల్చి వాడి నెత్తుటితో దాని సమాధిని అభిషేకిస్తానని!

అయితే ఈ నాటివరకు నాకు అవకాశం చిక్కలేదు! ఆ సంఘటన తర్వాత వాడెందుకో నా కళ్ళపడలేదు. బహుశా

వాడిమీద పగతీర్చుకుంటా ననుకుని వుంటాడు. ఏదో విధంగా నా చెల్లెలి నుంచి అసలు విషయం నాకు తెలిసి వుంటుందని గ్రహించి వుంటాడు. అందుకే నన్ను తప్పించుకు తిరిగాడు.

అలాంటి పరిస్థితుల్లో వాడ్ని చంపటంవల్ల నేరం నా మీదకే వస్తుంది. ఎందుకంటే, మనోహరికి నా పగ, ప్రతీకారం గురించి బాగా తెలుసు! పోలీసుల ఎంక్వయిరీలో నా పేరు బయటపడటం ఖాయం!

అందుకే నేను తొందరపడలేదు. నిదానంగా నా పథకాన్ని అమలు చెయ్యటానికి నిర్ణయించుకున్నాను. ముందు, నాకు చంద్రావుమీద అనుమానం లేదని వాడనుకునేలా ప్రవర్తించాలి! అయితే నేను మొదట్లోనే తప్పటడుగులు వేశాను. నా అంతర్యాన్ని మనోహరికి చెప్పేశాను. ఆమె చంద్రావుతో ఈపాటికి నా విషయం చెప్పేసి వుంటే, నా పథక మంతా తలకిందు లవుతుంది. అందుకని ముందుగా నా అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలను కున్నాను.

మనోహరి కాలేజీలో ఫైనల్ బిఎస్సీ చదువుతోంది. ఆమె కాలేజికి వచ్చే సమయానికి ఆమె కోసం కాలేజీ దగ్గర్లో కాచుకున్నాను.

ఆమె నన్ను పలకరింపుగా నవ్వింది. తర్వాత నా దగ్గిరగా వచ్చి "బావున్నావా రాజూ! మళ్ళీ ఇన్నాళ్ళ తర్వాత చూస్తున్నాను. మా యింటికి రావటమే మానేశావు. నువ్వింకా పాత పగ మరచిపోలేదనుకుంటాను అవునా?" అన్నది.

నేను చిన్నగా నవ్వి, "నో, నో మనూ, అదేంలేదు. నే నా విషయాన్ని అప్పుడే వదిలేశాను. నువ్వు నా కళ్ళ

తెలిపించావు. ద్వేషం పెంచుకుని రాక్షసుడిగా మారటం వల్ల లాభం లేదని నిర్ణయించుకున్నాను'' అన్నాను. మనోహరిని 'మనూ' అని పిలవటం చాన్నాళ్ళ నుంచీ అలవాటు.

ఆమె కళ్ళు తళ తళ మెరిశాయి ఆనందంతో! "నా మాటకి విలువిచ్చినందుకు చాలా సంతోషం. థాంక్యూ!" అన్నది.

"ఆ నాటి నా తొందరపాటు చర్యకు సిగ్గుతో నీకు ముఖం చూపించలేక మీ యింటికి రాలేకపోయాను. కాని మీ అన్న యెందుకు మానేశాడు? నే ననుకున్నదేమి టంటే...." చెప్పటం ఆపాను.

మనోహరి అలజడిగా చూసింది నా వంక.

"ఆ నాడు నేనన్న మాట చంచలావుతో తొందరపడి అనేశారేమోనని...."

మనోహరి చురుగ్గా చూసింది నా వంక.

"నేనంత తెలివితక్కువ దాన్నని భావించినందుకు బాధగా వుంది" అన్నది.

"సారీ! మనూ! ఈ నాటి వరకు చంచల్ నా దగ్గరకు రాకపోవటంవల్ల అలా అనుమానించాను. నిన్ను శంకించి కాదు!"

"అయితే మళ్ళీ మీ రిద్దరు పూర్వంలా స్నేహంగా క్లోజ్‌గా వుండాలి. రేపు సాయంత్రం మా ఇంటికి రా! అన్నయ్య నీ కోసం ఎదురుచూస్తుంటాడు."

"ఆల్ రైట్! థాంక్యూ మనూ!"

మనోహరి ముఖం వెలిగిపోయింది. ఆమె కళ్ళల్లో నా పట్ల ప్రేమానురాగాలు స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి.

2

మర్నాడు సాయంత్రం లాన్స్‌లో కూచుని చంచ లావు. మనోహరి నా కోసం ఎదురుచూస్తున్నారు.

చంచలావు నన్ను చూడగానే నవ్వుతూ చేయి ముందుకు సాచాడు. నేను కూడా వాడి చేతిని నవ్వుతూ అందుకున్నాను. కొన్ని క్షణాలపాటు యిద్దరం ఒకరి నొకరు ఆప్యాయంగా కౌగలించుకుని విడిపోయాం. చంచ లావుని సుముఖుడ్ని చేసినది మనోహరేనని స్పష్టంగా తెలుస్తూనే వుంది

ఆమె నవ్వుతూ మా యిద్దరివంక చూస్తోంది. లోనికి వెళ్ళి రకరకాల పదార్థాలు పట్టించుకుని వచ్చింది నౌఖరు చేత.

చంచలావు, మనోహరి కూడా కొసరి కొసరి నాకు తినిపించారు. చివర్లో నా కిష్టమైన మేంగో జ్యూస్ తెచ్చి స్వయంగా తన చేతుల్తో తాగించింది.

నేను నా చెల్లెలి విషయం యేమాత్రం ప్రస్తావించ కుండా జాగ్రత్తపడ్డాను. చంచలావే సానుభూతి చూపిస్తూ దాని సంగతి ఎత్తాడు.

"పాపం! చెల్లాయి అకస్మాత్తుగా పోయిందట కదా! ....అయామ్ వెరీ సారీ! పనుల తొందర్లో రాలేక పోయాను" అన్నాడు బాధగా.

"ఇట్సాల్‌రైట్! దాని ఆయువు చెల్లిపోయింది, వెళ్ళి పోయింది. ఎవరేం చెయ్యగలం?" అన్నాను ఆ విష యాన్ని తేలిగ్గా తీసేస్తూ!

వాడి ముఖంలో కనిపించిన రిలీఫ్ నేను గుర్తించక పోలేదు.

మరో అరగంట వాళ్ళతో గడిపి, ప్రతి సాయంత్రం

వాళ్ళింటికొచ్చేలాగా నాచేత ఒట్టు వేయించుకుని వదిలాడు నన్ను చంచల్రావు. మనోహరి కళ్ళతోనే అనురాగం వర్షిస్తూ వీడ్కోలు చెప్పింది.

ఇంటికొచ్చాక తీవ్రంగా ఆలోచించాను. ఏ విధంగా చంచల్రావుకు నా మీదికి అనుమానం రాకుండా నా చేతికి మట్టి అంటకుండా మట్టుపెట్టాలా అని చాలా రకాలుగా ఆలోచించాను. ఎన్నో మార్గాలు కనిపించాయి కాని, ఎక్కువ శాతం రిస్కుతో కూడుకున్నవే!

నా చెల్లిని చంపి వాడెలా హాయిగా స్వేచ్ఛగా తిరుగుతున్నాడో, వాడ్ని చంపి నేనూ స్వేచ్ఛగా తిరగాలి! జైలుకెందుకు వెళ్ళాలి?!

ఆ రోజు నుంచి వాడెప్పు డెక్కడకు వెళ్తున్నాడో, యెంతసేపుంటున్నాడో, యేమేం చేస్తున్నాడో అన్నీ వివరంగా స్టడీ చేయటం మొదలెట్టాను. వాడి దినచర్యలో యెక్కువ శాతం అమ్మాయి వేటకే కేటాయించినట్టు నా కర్థమయ్యింది.

గతంలో వాడితో నేను సన్నిహితంగానే మెలిగాను. కాని అమ్మాయిలంటే వాడికింత విపరీతమైన క్రేజ్ వున్నట్టు నాకు తెలీదు. కొంతమందిని డబ్బుతో ఆకర్షించుకుంటే మరికొందర్ని పెళ్ళి చేసుకుంటానని మభ్యపెట్టి తన అవసరాలు తీర్చుకుంటున్నాడు.

ఏ ఆడపిల్లల జీవితాలతో ఆటలాడుకుని వాళ్ళని జీవం లేని బొమ్మల్లా విసిరికొడ్తున్నాడో ఆ ఆడపిల్లల కారణంగానే వాడు అంతమయ్యేలా వెయ్యాలని ప్లాన్ చేశాను.

3

సాయంత్రం ఆరున్నర గంటలవుతుంది.

చంచల్రావుని రహస్యంగా ఫాలో అవుతున్నాను.

కార్లో వాడు, వెనకనే టాక్సీలో నేను. ఈ మధ్య టాక్సీ ఆటో ఖర్చుల కోసం కనీసం ఆరువేలు ఖర్చుపెట్టాను. డబ్బు ఖర్చుకోసం వెనుదీయ్యటం లేదు నేను! నా ప్రతీ కారం తీరటం ముఖ్యం. నేను బికారినయిపోయినా బాధ పడను!

బస్టాప్‌కి కొంచెం దూరంలో ఆగాడు. అక్కడ మెరుపు తీగెలాంటి అమ్మాయి నిల్చుని వుంది. వాడు కారు దిగి ఆమె దగ్గరగా వెళ్ళాడు. పది నిమిషాల తర్వాత ఆమె నవ్వుతూ వాడితో కారెక్కింది. బహుశా వాళ్ళిద్దరికి ఇదివరకే పరిచయ ముండి వుండాలనిపించింది.

కారు సరాసరి సవేరా హోటల్ ముందాగింది. సిటీలో పేరున్న హోటల్. ఖరీదైన హోటల్.

కారు పార్క్ చేసి హుందాగా కౌంటర్‌వైపు నడిచాడు. నేను టాక్సీవాలాని పంపించేసి ముఖానికి పేపరడ్డం పెట్టుకుని వాడి చర్యల్ని గమనిస్తున్నాను.

రూం తీసుకున్నాడు. రిసెప్షనిస్ట్ రూం నెంబర్ చెప్పి కీ యిచ్చి, బాయ్‌ని తోడు పంపాడు.

రూం నంబర్ ఒన్ తర్టీఫోర్! స్పష్టంగానే వినిపించింది.

చంచల్రావు ఆ అమ్మాయితో మేడమెట్లెక్కి వెళ్తున్నాడు. నేను అనుసరించటం అనవసరం! వాళ్ళిద్దరు ఈ రాత్రంతా బహుశా అక్కడే స్వర్గద్వారాలు తెరుచుకుని ఆనందసాగరంలో మునిగి తేల్తారు.

మంచి అవకాశం! సద్వినియోగం చేసుకోవాలి!ముందు నే నీ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేనని రుజువు చేసుకోవటానికి ఎలిబీ సంపాదించుకోవాలి. పదిమంది దృష్టిని ఆకర్షించుకుని వాళ్ళ సాక్ష్యాన్ని సంపాదించాలి.

హోటల్, పబ్లిక్ ప్లేస్. సినిమాథియేటర్—ఇలాంటి మరికొన్ని మెదిలాయి మనసులో.

థియేటరైతేనే మంచిదనిపించింది. థియేటర్ స్వప్న ప్రియ నెన్నుకున్నాను. అందుక్కారణముంది. ఆ థియేటర్ ఊరికి ఆ చివర సవేరా హోటల్ ఈ చివర వున్నాయి. ఎవరికీ అనుమానం రాదు.

ఏదో పాత సినిమా, జనం ఆట్టే లేరు. అదే మంచిది. ఉన్న పదిమందినీ తేలిగ్గా ఆకర్షించవచ్చు. టిక్కెట్ను దొరకవనే సమస్య లేదు.

టిక్కెట్టు తీసుకుని బాల్కనీలోకి వెళ్ళి కూచున్నాను. బొత్తిగా ప్రేక్షకులు లేరు. అక్కడొకడు, అక్కడొకడు కూచున్నారు. సాక్ష్యానికి సరిపోరు.

పై నుంచి యే క్లాసులో జనం బాగా ఉన్నారో చూసుకున్నాను. సెకండ్ క్లాస్‌లో రష్‌గా కనిపించింది. బయటికొచ్చి సెకండ్‌క్లాస్ టికెట్ తీసుకున్నాను. నా లాంటివాళ్ళు కూచోవటానికి ఇబ్బందిపడే క్లాసది: అయితే నా ధ్యేయం సినిమా చూడటం కాదు.

నా వెనకసీటువాడు కాళ్ళతో నా సీటును తన్నుతున్నాడు సినిమాలో పాట కనుగుణంగా. నాకు సరైన అవకాశ మొచ్చింది.

కాళ్ళు తియ్యమన్నాను. తియ్యలేదు. సరికదా కిళ్ళీ తుంపరలు మీద పడేలా నవ్వాడు వెకిలిగా. మరింత గట్టిగా సీటును తన్నిపెట్టాడు.

నేను సీట్లోంచి చటుక్కున లేచాను. అప్పటికే జనం విసుగ్గా చూస్తున్నారు మా ఇద్దరివంక—సినిమా డైలాగులు మిస్సయిపోతున్నాయని!

నేను మెరుపువేగంతో వాడ్ని కాలరుపట్టి పైకిలేపి

దవడలు రెండూ వాయించాను, వాడు బూతులు తిడుతూ వెనక సీట్లోంచి నా సీటుమీదికి ఉరికాడు.

వాడ్ని ఒక్కతోపు తోశాను. ప్రేక్షకులమీద అమాంతం పడిపోయాడు.

అంతే! పెద్ద గందరగోళం చెలరేగింది. ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ, తిట్టుకుంటూ గొడవగా అరుస్తున్నారు. ఇంతలో మరికొంతమంది చేరి కొట్టుకునేవాళ్ళను విడదీశారు.

అసలు గొడవకి కారణమేమిటని ఆరా తీశారు. ఆపరేటర్ బొమ్మ వేయడం ఆపేశాడు. థియేటర్ యాజమాన్యంవాళ్ళు హడావిడిగా మా సీట్ల దగ్గరకొచ్చారు. సర్ది చెప్పి గొడవ సర్దుమణగటానికి ఇరవై నిమిషాలుపైనే పట్టింది.

మా ఇద్దర్ని సీట్లు మారమని సలహా ఇచ్చారు, అక్కడివాళ్ళు. నా వెనకనున్న వాడింకా బుసలుకొడ్తున్నాడు. సీటు మారనన్నాడు. నేనే లేచి అక్కడికి నాలుగు వరసలు అవతలకుపోయి ఖాళీగా వున్న సీట్లో కూర్చున్నాను.

సినిమా మళ్ళీ మొదలయ్యింది.

అందరూ శ్రద్ధగా సినిమాలో నిమగ్నమయ్యారు. ఇంటర్వెల్ తర్వాత మళ్లీ సీట్లోకి వచ్చి కూచున్నాను. అయిదు నిమిషాల తర్వాత సిగరెట్లకోసం జేబులు తడుముకుంటూ బయటికొచ్చాను.

థియేటర్ బయట కొద్ది క్షణాలు నిల్చుని వాచీ చూసుకున్నాను. ఎనిమిదిగంటలయ్యింది. పోతున్న టాక్సీనాపి ఎక్కి కూచున్నాను.

హోటల్ సవేరా చేరుకున్నాను. రూంనంబర్ నూట

ముప్పయినాలుగు దగ్గర ఆగి మునివేళ్ళతో తలుపుమీద కొట్టి బాల్కనీ చివరికి వెళ్ళి నేను కనపడకుండా ఆ గది కనపడేలా నిల్చుని చూస్తున్నాను.

చంద్రరావు తల బయటకు పెట్టి చూశాడు, చాలా విసుగ్గా. ఎవరూ కనిపించకపోవటంతో చిరాగ్గా తలుపు వేసేసుకున్నాడు పెద్ద శబ్దంతో.

నేను నవ్వుకున్నాను చంద్రరావు గదిలోనే ఉన్నాడు. వాడి ఒంటిమీద గుడ్డలు కనిపించలేదు. అడ్డదిడ్డంగా లుంగీ కట్టుకుని తలుపులేసినట్టు గ్రహించాను. అంటే ఇంకా ఆ అమ్మాయి గదిలోనే ఉందన్నమాట!

జేబులోనించి కర్చీఫ్ తీశాను. తలమీది నుంచి కళ్ళు మాత్రం కనిపించేలా ముఖానికి అడ్డుగా కట్టుకున్నాను. బాల్కనీలో ఎవరైనా నన్ను గమనిస్తున్నారేమోనని కొద్ది క్షణాలు చూశాను. ఎవరూ కనిపించలేదు.

తలుపులు టకటకమని చప్పుడు చేశాను. చాలా కోపంగా తలుపులు తెరిచాడు చంద్రరావు. ఓరవాకిలిగా తెరిచి ముఖాన్ని బయటకు పెట్టాడు నేను మెరుపు వేగంతో లోపలకు చొరబడ్డాను.

మంచంమీద ఎవరూలేరు. బాత్‌రూంలో నీళ్ళ చప్పుడవుతున్నాయి. ఒక్క అంగలో బాత్రూం గడియ బయట నుంచి బిగించేశాను.

"ఎవర్నువ్వు? ఏమిటీ దౌర్జన్యం?" అంటూ అరిచాడు చంద్రరావు.

అదే వేగంతో గది తలుపులోపల బోల్టు వేసేశాను.

చంద్రరావు నన్ను వెనుకనుంచి గట్టిగా పట్టుకున్నాడు. నేను చాలా వేగంగా జేబులో నించి నీడిల్ తీసి అతని చేతి మీద గుచ్చాను. సరిగ్గా నరంమీద!

చటుక్కున చేతిని వెనక్కు లాక్కున్నాడు చంచ్రలావు. సైనేడ్ పూసిన నీడిల్ అది! క్షణాలమీద నేల కూలిపోయాడు చంచ్రలావు.

అప్పుడు కర్చీఫ్ తొలగించాను.

"నువ్వా?" అన్నాడు అదిరిపడి కాని అప్పటికే విషం అతని నరనరాన వ్యాపించింది.

వాడి ముఖంమీదికి వంగి "చంచ్రలావ్, ప్రాణానికి ప్రాణం నా సిద్ధాంతం! నా చెల్లెలు ఆత్మ శాంతిస్తుంది!" అన్నాను చాలా మెల్లిగా.

బాత్‌రూం తలుపు టకటక లాడిస్తోందామె.

తలుపు తీయటం ప్రమాదం: ఆమె సమయానికి బాత్ రూంలోకి వెళ్ళి వుండకపోతే నేనే ఏదో విధంగా ఆమెను బంధించాల్సి వచ్చేది. ఆమెకు గుర్తు తెలియకూడదనే కర్చీఫ్ అడ్డం పెట్టుకున్నాను. చంచ్రలావుకి కనపడినా ప్రమాదంలేదు—వాడెలాగూ బతికివుండడు కనక! పైగా నేను వాడ్నెందుకు చంపానో ప్రాణం పోయేముందు వాడికి తెలియాలిగా! అందుకే వాడికి నా ముఖం చూపించాను.

చంచ్రలావు శరీరమంతా నల్లగా బొగ్గులా మాడి పోయింది. అచేతనంగా పడున్నాడు.

నా చేతిలోని కర్చీఫ్‌తో బోట్లుమీది వేలిముద్రలు, బాత్‌రూం గడియమీది వేలిముద్రలు చెరిపేశాను. తలుపు తెరిచి బయటకు చూశాను. పక్కగదిలో వాళ్ళెవరో అప్పుడే లోనికి వెళ్ళి తలుపు వేసుకుంటున్నారు.

బాత్రూం తలుపు దబదబ మోదుతోందామె. చంచ్రలావుని పేరుపెట్టి పిలుస్తోంది—నేనే మాత్రం ఆలస్యం చెయ్యలేదు.

నిమిషాలమీద రోడ్డుమీది కొచ్చి టాక్సీపట్టుకుని స్వప్న ప్రియ థియేటర్ చేరుకుని లోపలికిపోయి కూచున్నాను.

అప్పుడు సరిగ్గా ఎనిమిదిగంటల నలభై నిమిషాలయింది. మరో ఇరవై నిమిషాల్లో సినిమా పూర్తయింది.

అంతకితం తగవుపడ్డ కుర్రాడు మళ్లీ నా వైపు క్రూరంగా చూసి మాట బయటికి రాకుండా తిట్టాడు. నేను గట్టిగా అరుస్తూ వాడిమీదికి గెంతాను.

"అబ్బబ్బ. సినిమా అయిపోయింది. ఇంటికి పోతూ కూడా ఏమిటయ్యా రగడ?" అంటూ ప్రేక్షకులు విసుక్కుంటూ మమ్మల్ని విడదీశారు.

నేను వాడివంక కోపంగా చూస్తూ బయటికొచ్చాను. సిటీబస్‌లో ఇంటికొచ్చాను.

నా మనసిప్పుడు చాలా ప్రశాంతంగా ఉంది. నాచెల్లెలు ఆత్మ ఏ లోకాల్లో ఉన్నా నేను తీసుకున్న ప్రతీకారానికి చాలా సంతోషిస్తూంది. చంద్రరావును హతమార్చటం వల్ల నా చెల్లెల్లాంటి మరెందరో ఆడపిల్లల జీవితాలు నాశనం కాకుండా కాపాడబడ్డాయి! ఆ తృప్తి చాలు నాకు!

చాన్నాళ్ళ తర్వాత హాయిగా నిద్రపోయాను.

4

అమ్మ కంగారుగా తట్టి లేపుతుంటే ఉలిక్కిపడిలేచాను. ఎండ తీవ్రత గదిలోపడ్డ కిరణాలవల్ల గ్రహించాను.

"బాబూ....పోలీసులు...." అంటూ కంగారు పడిపోతోంది అమ్మ.

నా నిద్రమత్తు వదిలిపోయింది.

"గతరాత్రి చంద్రరావుని హత్య చేసినందుకు నిన్న రెస్టు చేస్తున్నాం" అన్నాడు పోలీసు ఇనస్పెక్టరు.

నేను నిర్ఘాంతపోయాను. ఎలా తెలిసింది వీళ్ళకి?

"మీరు పొరబడుతున్నారు. చంద్రరావు నా ప్రాణ స్నేహితుడు. అతడ్ని నేను హత్యచేయటమేమిటి?"

ఇనస్పెక్టర్ వెనకనున్న కుర్రాడు "ఈయనే సార్, రాత్రి స్వప్నప్రియ మొదటి ఆట సినిమా కొచ్చారు." అన్నాడు.

నాకు చాలా ఆనందంవేసింది. "అవును ఇనస్పెక్టర్, గతరాత్రి నేను స్వప్నప్రియలో పిక్చర్ చూసి వచ్చి పడుకుని నిద్రపోయాను. చంద్రరావు హత్య సంగతి నేనెరగను" అన్నాను. నా ఎలిబీ చాలా పకడ్బందీగా వుంది. అందుకు ప్రత్యక్షసాక్షి ఆ కుర్రాడు! ఇంతకీ ఎవరీ కుర్రాడు?

"గుడ్! నువ్వు స్వప్నప్రియలో ఒకే ఆటకు రెండు టికెట్లు ఎందుకు తీసుకున్నావో చెపుతావా?" అన్నాడు ఇనస్పెక్టర్.

"రెండు టిక్కెట్లేమిటి? నేను సెకండ్ క్లాస్‌కి వెళ్ళాను" అన్నాను. బాల్కనీ టికెట్ తీసుకున్న విషయం వీళ్ళ కెలా తెలుస్తుంది? అదీ నా ధైర్యం.

ఇనస్పెక్టర్ చేతిలో రెండు టికెట్ కౌంటర్ ఫాయిల్స్ ప్రత్యక్షమయ్యాయి. "ఇవి రెండూ నిన్న ఫస్ట్‌షోకి చించిన టికెట్స్ కౌంటర్ ఫాయిల్స్." అన్నారు.

"ఏమో, అవెవరివో నాకేం తెలుసు? నేను సెకండ్ క్లాస్‌కే వెళ్ళాను. కౌంటర్‌ఫాయిల్ అప్పుడే పారేశాను." అన్నాను బింకంగా.

"నువ్వు ఎనిమిదినుంచి ఎనిమిదిగంటల నలభై నిమిషాల వరకు థియేటర్లోలేవు. నువ్వు బయటకు వెళ్ళిరావటం ఈ కాంటీన్ కుర్రాడు చూశాడు. హత్య ఎనిమిదీ

పదిహేను, ఎనిమిది నలభై మధ్య జరిగినట్టు డాక్టర్స్ రిపోర్టు. అంతేకాదు, నిన్ను హత్యాస్థలంలో చూసిన ప్రత్యక్షసాక్షి—చంచల్రావుతో నిన్న హోటల్ రూంలో గడిపిన అమ్మాయి. ఆమె గదిలో ఏదో గొడవ జరుగుతుంటే బాత్ రూం పైనున్న వెంటిలేటర్ లోనించి చూసింది...."

"ఇతనే సార్...." అంటోన్న అమ్మాయి వైపు త్రుళ్ళిపడి చూశాను. ఆమెనే నిన్న చంచల్రావు హోటల్ కి తీసుకువెళ్ళింది....

నిస్తేజంగా నేలమీద కూలిపోయాను. □

పబ్లిషర్లకు మనవి:

కీ॥ శే॥ టెంపోరావుగారి నవలలు రీ ప్రింట్ చెయ్యదలుచుకునేవారు ఈ క్రింది వారిని సంప్రదించగలరు.

డాక్టర్ వి. సుభద్ర

3 - H 70, సెంట్రల్ ఎవెన్యూ,

హౌసింగ్ బోర్డు కాలనీ, కొరత్తూరు,

మద్రాసు - 80.

మోహజ్వాల బలి

కె.బి.యస్.కుమార్



నేను జీపు దిగ్గానే అందరూ ఆత్రంగా ఎదురొచ్చి నమ్రతగా నాకు విష్ చేశారు.

కాని నేను వాళ్ళ నమస్కారాలని స్వీకరించి వాళ్ళ నమ్రతని ఆస్వాదించే స్థితిలో లేను.

మనసంతా టెన్షన్! అదో రకమైన గుబులు!!!

రామానాయుడు రాజకీయంగా చాల పలుకుబడి గలవాడు. పైగా రాష్ట్రమంత్రుల్లో ఒకాయనకి చాల దగ్గరి బంధువు. నాయుడు తల్చుకుంటే మమ్మల్ని ఏమైనా చేయించగలడు. అది ట్రాన్స్ఫర్ కావచ్చు. సస్పెన్షన్ కావచ్చు. వుద్యోగం లోంచి పీకేయించినా ఆశ్చర్యపోనక్కరలేదు.

అసలు సంగతేమిటంటే....?

రామానాయుడికి చాల పొలముంది. అందులో అతడు వెయ్యాల్సినవన్నీ వేశాడు. యింకా ఇరవై ఎకరాలు మిగిలాయి. ఆ పొలంలో అతడు ఈ వూరి పశువుల డాక్టరు సలహాపై పేరాగడ్డి వేశాడు.

పేరాగడ్డి పశువులకి బలవర్ధకమైన ఆహారం.

పాడి పశువులకైతే మరీను!

రామానాయుడికి నలభై ఆరు పాడిగేదెలు, ఆరు జెర్సీ ఆవులు వున్నాయి.

గేదెల్లో ముప్ఫయ్ రెండు క్రాస్ బ్రెడ్ ముర్రా జాతివి. మిగతావి నాటువి!!

పదిహేనురోజుల క్రితం ఓ ముర్రాగేదె చచ్చిపోయింది. అదుగో - అప్పట్నుండే మా డిపార్టుమెంటుకి కష్టాలు మొదలయ్యాయి.

నిజానికిలాంటి పరిస్థితుల్నెదుర్కోవటం మా ధర్మం. మేమున్నది అందుకోసమే! కాని ఈ పరిస్థితి వేరు!!

ఈ పరిస్థితి విపత్కర పరిస్థితిగా పరిణమించడానికి కారణం ఆ గేదె రామానాయుడుది కావడమే. అదికూడ ఏ యాక్సిడెంటులోనో చావక - ముసరవ్యాధితో మరణించడమే!

ముసర వ్యాధి!

రింతర్ పెస్ట్!!

పశువుల్లో వచ్చే భయంకరమైన అంటురోగం! గంటకి అయిదు కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ వ్యాధికి సంబంధించిన వైరస్—గంటకి పది పశువుల్ని పొట్టన పెట్టుకోగలదు!!

ఒక్క పశువు చచ్చినంత మాత్రాన దిగులుపడే స్వభావం కలవాడు కాడు నాయుడు. ఆ వార్త వినగానే దాన్ని ఈడ్చి అవతల పారేయమన్నాడు మామూలుగా విస్కీ చప్పరిస్తూ.

మర్రోజుకి ఒక జెర్సీ ఆవు, రెండు ముర్రా గేదెలు జబ్బు పడ్డాయి. వి.ఎ.ఎస్. (వెటర్నరి అసిస్టెంట్ సర్జన్) వద్దకి తీసుకొచ్చారు. జబ్బు లక్షణాల్నిబట్టి ముసరవ్యాధిగా సస్పెక్ట్ చేశాడు డాక్టర్.

అతడి అనుమానాన్ని బలపరుస్తూ ఆ రాత్రి మూడు పశువులూ మృతి చెందాయి.

మర్రోజు పోస్టుమార్టమ్ కండక్ట్ చెయ్యబడింది. ముసర వ్యాధేనని తేలింది. కన్ఫర్మేషన్ కోసం స్పెసిమన్స్ కలెక్ట్ చేసి క్లినికల్ ల్యాబ్‌కి పంపించారు. ముసర వ్యాధి పాజిటివ్‌గా రిపోర్టు వచ్చింది.

రిండర్‌పెస్ట్ అవుట్ బ్రేకయిందని తెలియజేస్తూ అసిస్టెంట్ డైరెక్టర్‌కీ జాయింట్ డైరెక్టర్‌కీ రిపోర్టులు పంపబడ్డాయి.

అఫెక్టయిన ఏరియాలో - అంటే ఈ వూళ్ళో—జబ్బు లేని పశువులకీ, ఈ వూరికి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో వున్న గ్రామాల్లోని ఆరోగ్యవంతమైన పశువులన్నిటికీ ముసరవ్యాధి నిరోధక టీకాలు వెయ్యవలసిందిగా సిబ్బందికి సర్క్యులర్లు పంపబడ్డాయి.

ముసరవ్యాధి నిర్మూలన పథకం కంట్రోల్లో వున్న

చెక్‌పోస్టులూ విజిలెన్సు యూనిట్లూ మొబైల్ స్క్వాడ్స్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం రంగంలోకి దూకారు.

పదిరోజుల్లో వేక్సినేషన్‌కి సంబంధించిన కార్యక్రమాలన్నీ పూర్తయిపోయాయి.

సిబ్బంది అలసటతో కూడిన తృప్తితో నిట్టూర్చారు.

ఎవరి హెడ్‌క్వార్టర్స్‌కి వారు వెళ్ళిపోయారు.

కాని మా డిపార్టుమెంటుని సవాలు చేస్తూ యిదన్నీ జరిగిన అయిదోరోజు నుండీ రామానాయుడు పశువుల్లో ఒక్కొక్కటే చావటం ప్రారంభించింది. ఇది అందరికీ అంతుబట్టని సమస్యగా పరిణమించింది.

ఇదెలా సంభవించింది? వ్యాక్సినేషన్ కండక్ట్ చేశాక్కూడ — కంట్రోల్ అయిన వ్యాధి ఎలా విజృంభించింది? రామానాయుడి పశువులే చనిపోవడానికి కారణమేమిటి? లోపం ఎక్కడుంది?

....ఇలాంటివే ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. వీటికి సమాధానాలు స్ఫురించకముందే మండుతోన్న అగ్గిపుల్ల వేసిన విస్కీలా భగ్గుమన్నాడు రామానాయుడు. రెండు రోజులు విస్కీ ముట్టుకోకుండా తిరిగిన ఫలితంగా ఆయన పశువులకి టీకాలు వేసిన వెటర్నరీ అసిస్టెంటుకి సస్పెన్షన్ ఆర్డర్సు పట్టుకొచ్చాడు.

ఇది రామానాయుడికి సంబంధించిన కేసు కావటంతో ఎంక్వయిరీ ఆఫీసరుగా హైద్రాబాదు నుండి నేను రప్పించబడ్డాను.

2

"నీ పేరు?" అడిగాను.

"రవి...." చెప్పాడతడు. అతడి ముఖంగా దీనంగా వుంది. పలకరిస్తే చాలు. ఏడ్చేసేలా వున్నాడు. పాపం!

పేదవాడులా వున్నాడు.

"ఈ వుద్యోగంలో నీ సర్వీసెంత?"

"అయిదేళ్ళు సార్!!"

"ఈ వూరికి ఎంతకాలమైంది వచ్చి?"

"ఇది రెండో సంవత్సరం సార్!"

"మాటి మాటికీ సార్ అనాల్సిన పన్లేదు. బై దిబై .... నీ అలక్ష్యం కారణంగా రామానాయుడుగారు చాల పశు వుల్ని నష్టపోయారు. ఆ నష్టం విలువెంతో చెప్ప గలవా?"

"దాదాపు లక్షరూపాయలు."

"దీనికి నీ సమాధానం యేమిటి?"

సమాధానంగా ఏడ్చేశాడు రవి.

"ఏడుపు సమాధానం కాదు. ఏడుపు నీ ఉద్యోగాన్ని నీకు తిరిగి సంపాదించి పెట్టదు. మైండిట్ .... బై దిబై .... ముసరవ్యాధి గురించి నీకేం తెల్సు?"

"భయంకరమైన రోగం సార్," కళ్ళు తుడుచు కున్నాడు.

"ముఖ్యమైన పాయింటు చెప్పు."

"ఇంతవరకూ మందు కనిపెట్టబడని జబ్బు సార్ యిది!"

"మరి దీని నివారణకి ఏం చెయ్యాలి."

"ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వెయ్యాలి."

"ప్రస్తుతం దీనికొరకు ఏ వ్యాక్సిన్ సరఫరా చెయ్య బడుతోంది?"

"టిష్యూ కల్చర్!"

"ఈ వ్యాక్సిన్ ప్రభావపు కాలపరిమితి ఎంత?"

"జీవితకాలం!"

"మొన్న యెన్ని ఆంప్యూల్స్ సప్లయ్ చెయ్యబడింది?"

"అయిదువందల ఆంప్యూల్స్!!"

"నీ భాగానికి నువ్వు ఎన్ని చేశావు?"

"దాదాపు రెండువేల పశువులకి చేశాన్సార్!!"

"ఒక్కో ఆంప్యూల్ యాభై డోసుల్ని కలిగివుంటుంది ఆ లెక్కన దాదాపు వేస్టేజితో కలుపుకొని నలభై అయిదు ఆంప్యూల్స్ వాడివుండాలి నువ్వు. అవునా!"

తలూపాడు రవి.

"నువ్వు స్వయంగా టీకాలువేసిన పశువుల్లో నాయుడు గారివి కాక—వేరే ఏవైనా చచ్చాయా?"

"లేవ్సార్?!"

"నాయుడుగారిపై నీకు వ్యక్తిగతంగా ఏదైనా కక్ష వుందా!" ఆ ప్రశ్న అడగటం వేస్టని నాకు తెల్సు. అయినా రొటీన్‌గా అడగాలి మరి.

"నాయుడుగారితో కక్ష పెట్టుకోవటం కొండని ఎలుక ఢీ కొట్టడమే అవుతుంది సార్! నేను చిట్టెలకని!!"

"వారి పశువులకి టీకాలు వెయ్యటంలో నువ్వు అవలంబించిన పద్ధతు లేమిటి?"

"ఆ రోజు రాత్రి వ్యాక్సిన్ వచ్చింది సార్! 'ఐస్' కొద్దిగా వుండటంతో మొత్తం వ్యాక్సిన్ని నాయుడుగారింట్లోని ఫ్రిజ్‌లో పెట్టడం కోసం వాళ్ళింటికి వెళ్ళాను. స్వయంగా దగ్గరుండి, ఐస్ ఛాంబర్‌లో పెట్టించి వచ్చాను."

"ఆ తర్వాత?"

"మర్రోజుదయమే వెళ్ళి ఒక ఆంప్యూల్‌ని బ్రేక్‌చేసి నార్మల్ సెలైన్‌ని చల్లబరచి ఆంబర్డ్ కలర్డ్ బాటిల్

(గోధుమ రంగులో వుండే వెడల్పు మూతిగల చిన్న గాజు సీసా)లో ఫిఫ్టీ సీసీ వేసి ఆ తర్వాత ఆ బాటిల్‌ని ఐస్ ముక్కల మధ్య వుంచి ప్రతి పశువుకీ స్వయంగా చేశాను."

"బాటిల్‌నీ సిరెంజినీ స్టెరిలైజ్ చేశావా?"

నిలువుగా తలాడించాడు రవి.

"ఎంతసేపు వుడకబెట్టావ్?"

"ఇరవై నిమిషాలు...."

"మొత్తం వ్యాక్సిను బ్రూనెంబరు ఒకటేనా?"

"ఒకటే సార్!!"

"ఎక్స్‌పైరీ డేట్?"

"వచ్చే నెల నాలుగోతేదీ!!"

అతన్ని పంపేసి రాజన్నని పిలిపించాను.

3

"నువ్వేనా రాజన్నవి?"

"అవును దొరా!"

"నాయుడుగారి మొత్తం పశువుల్ని నువ్వొక్కడివే చూసుకుంటావా?"

"అవునండీ....అయితే మేత, దాణా వెయ్యడం. పేడ రొచ్చు తీసెయ్యడం నేను చూసుకుంటానండి. రెండు పూటలా పాలు పిండటం, పశువుల్ని కడగటం సుబ్బన్న చూసుకుంటాడండీ!"

"మా రవి పశువులకి టీకాలు వేసేప్పుడు నువ్వు దగ్గరే వున్నావా?"

"అవును దొరా! ఒక్కో పశువునూ నేనే పట్టుకొని రవిబాబుతో సూదులేయించానండీ!"

"రవి ఎన్నిగంటలకి వచ్చాడిక్కడికి?"

"పొద్దుటే ఆరున్నర కొచ్చాడండి."

"అప్పట్నుండి జరిగింది చెప్పు...."

"రాగానే మందుగొట్టాలు (ఆంప్యూల్స) తెమ్మన్నా డండి. నేను లోపలకి పోకూడదుగదండీ! అమ్మాయిగార్ని కేకేశానండి...."

"అమ్మాయిగారంటే—?"

"సుమిత్రమ్మగోరండి: మా అయ్‌గోరి కూతురుగోరండి:"

"వయసెంతుంటుంది?"

"యిరవై దాటదండి...."

"పెళ్ళయిందా?"

"అవలేదండి...."

"చెప్పు ..."

"అమ్మాయిగో రొచ్చారండి. చెబితే తీసుకొచ్చారండి. రవిబాబు మందు కలుపుతున్నాడండి. ఈలోగా టిపిను చెయ్యాలని అమ్మాయిగోరు అన్నారండి. వాళ్ళేదైనా చెబితే ఎదురు చెప్పకూడదు గదండీ: అందుకని రవిబాబు ఎల్లిపోయారండి."

"మందు అప్పుడు ఎక్కడుండింది?"

"మంచుముక్కల మధ్యనండి. పావుగంట తర్వాత టిఫిను తిని రవిబాబు వచ్చాడంటి. పశువులన్నిటికీ సూదులు చేశాం."

"ఆ పావుగంటా నువ్వు వ్యాక్సిన్—అదే—మందు దగ్గరే వున్నావా?"

"వున్నానండి."

"మీ అమ్మాయిగారు ఎలాంటి వారు?"

"దొరా!"

"ఏమిటి?"

"ఈ మాటలు నాతో అన్నారు గాబట్టి బతికిపోయారు. యింకెప్పుడూ అనమాకండి. ప్రాణాలెగిరిపోతయ్...."

ఉలిక్కిపడ్డాను. వాడి కంఠంలో ధ్వనించింది క్రౌర్యమో మరేదో—నా కర్థంకాలేదు.

4

సీలింగ్ ఫ్యాను మెల్లగా తిరుగుతూ చిరుగాలిని సరఫరా చేస్తోంది. గదిలో నీలం రంగు జీరోలైటు మందంగా వెలుగుతోంది.

ఆలోచిస్తున్నాను.

వ్యాక్సిను (బూ, బ్యాచ్) నెంబరు ఒకటే అయినప్పుడు, వ్యాక్సిన్ అంతా ఫ్రిజ్‌లో భద్రపరచబడినప్పుడూ ఆ ఒక్క ఆంప్యూలే చెడిపోయే ప్రసక్తేలేదు.

లేక....

నా ఆలోచనల్ని తుంచేస్తూ తలుపు తెర్చిన సవ్వడి విన్పించింది. మల్లెల సుగంధం ముందుగా నాసికాపుటలకి సోకిన తర్వాత ఓ స్త్రీ ఆకారం మసగ్గా కన్పించింది.

"ఎవరది?" అన్నాను చటుక్కున లైటు వేసి.

"నేను" అందామె.

వయసు ముప్పయ్ వుండొచ్చు. అందంకంటే ఆకర్షణ ఎక్కువగా కన్పిస్తోంది! ఆమె ఎవరో అర్థమైంది.

"బాబుగారి గెస్ట్ హవుస్‌లో మగాడు రాత్రి మకాం చేశాడంటే మాకు డ్యూటీ వున్నట్టే లెక్క...." అందామె నర్మగర్భంగా.

"నేనలాంటివాణ్ని కాను. వెళ్ళు" అన్నాను.

"బాబుగారి యింటికి వచ్చినవాళ్ళు ఏ లోటూ లేకుండా బైటికి వెళ్ళాలి."

"నేను మీ బాబుగారి యింటికి రాలేదు, డ్యూటీపై వచ్చాను."

"అవన్నీ నా కనవసరం. అయినా మీరిప్పుడు ఇక్కడ వున్నారు గాబట్టి బాబుగారి కంట్రోల్లో వున్నట్టే లెఖ్ఖ. ఈ రాత్రికి నేను మీదాన్ని. అంతే...."

"ఆడది అనే పదానికున్న అర్థాన్ని హత్యచేస్తున్నారు మీరు. ఆడతనానికి మచ్చతెస్తున్నారు."

"ఆ మచ్చ రావడానిక్కారకుడైన మగాడి వారసుడా! ఆడది మంచుముక్కలాంటిది. ఆ ముక్కని చూస్తూ వేడెక్కి ఆ మంచుముక్కనే కౌగిలించుకొని కరగించాలి గాని, మంచుముక్కలపై సీసాలా ఆడదాన్ని చూసి జారి పోయి—పారిపోతావేం? ఆ నాడు ఆ సీసా జారిపోయి నప్పుడు నువ్వు రాలేదు. ఇప్పుడు తల్చుకుంటేనే నవ్వొస్తోంది."

'మైగాడ్!! క్లూ దొరికింది' అనుకున్నాను ఆనందంగా.

5

చిన్న పొరబాటు ఎంత పతనానికైనా బాధ్యుల్ని చెయ్య గలదు, ఎంత నష్టాన్నైనా కల్గించగలదు అన్పించింది. ఆమెని మాటల్లో బెట్టి, అసలు విషయం రాబట్టాక.

ఆనాడు వ్యాక్సిను కలిపాక సుమిత్ర రవిని బ్రేక్‌ఫాస్ట్‌కి కోసం లోపలకి పిల్చింది. వ్యాక్సిను కలిపిన నిమిషం నుండి రెండు గంటల్లోగా ఆ వ్యాక్సిన్ని వుపయోగించాలి. బ్రేక్‌ఫాస్ట్‌కి పది నిమిషాల కన్నా టైమ్ తీసుకోదు. ఈలోగా వ్యాక్సిను మరింత చల్లబడుతుందనే వుద్దేశ్యంతో దాన్నలాగే వుంచి లోపలకి వెళ్ళాడు రవి.

పాలు పోయించుకోవటం కోసం ఆ సమయంలో వచ్చిన 'ఈవిడగారు' చూసుకోకుండా చెయ్యి తగిలించటంతో

గిన్నెలోని మంచుముక్కలపై వున్న వ్యాక్సిన్‌గల ఆంబర్డ్ కలర్డ్ బాటిల్ ఒరిగిపోయి ఒలికిపోయింది, వ్యాక్సినంతా.

తన పొరబాటుని కప్పిపుచ్చుకోవటం కోసం, 'బాబు గారి' నుంచి చీవాట్లు అందకుండా తప్పించుకోవటం కోసం, నేలపై ఒలికిన వ్యాక్సిన్‌ని బట్టి ఆ మోతాదులో గిన్నెలో మంచుముక్కలు కరగగా ఏర్పడిన నీటిని బాటిల్లో వేసి, ఏమీ ఎరగనట్టు బాటిల్ని మంచుముక్కలపై సర్ది' ఒలికిన వ్యాక్సిన్ని అక్కడే వున్న పాత గుడ్డతో తుడిచి, ఏమీ ఎరగనట్టు పాలుపోయిందుకుని వెళ్ళిపోయింది.

సందు దొరికితే బీడీ ముక్క కాల్చుకునే రాజన్న వ్యాక్సిన్‌వద్ద వుండకుండా ప్రక్కకి వెళ్ళి బీడీ కాల్చుకోవటం రాజన్న చేసిన నేరం. చేసింది చిన్న పొరబాటైనా, అది వ్యాక్సిన్ అని తెలీకపోయినా జరిగింది చెప్పకపోవటం 'ఆమె' చేసిన నేరం.

ఈ చిన్న నేరాల ఫలితంగా కొన్ని మూగజీవులు బలైపోయాయి. నాయుడుగారికి తీరని నష్టం వాటిల్లింది. ఈ విషయం వ్రాస్తే వాళ్ళిద్దరికీ నాయుడుగారు విధించే శిక్షేమిటో నేనూహించగలను. కాళ్ళో కీళ్ళో విరిచేస్తారు:

అయినా తప్పదు.

ఒక నిర్దోషి బైటికి రావాలి. ఇందులో మా డిపార్టుమెంటు లోపం గాని, అసమర్థతగాని లేదని ఋజువు కావాలి.

అలాగే రిపోర్టు రాశాను.

రవికి మళ్ళీ వుద్యోగం వచ్చింది.

కాని-వారం రోజుల తేడాతో రాజన్న, ఆమె-ఇద్దరూ వెళ్ళిపోతారని మాత్రం వూహించలేకపోయాను. □

కఠినశిల

హుస్సేన్ బాషా

ఊర్మిళ మేడమీద కిటికి ఎదురుగా కూర్చొని రోడ్డుపై వచ్చేపోయే వాహనాలకేసి చూస్తోంది.

తను ఆశించినట్లు జీపు—టాక్సీ—రిక్షా—ఏ ఒక్కటి యింటి ముందు ఆగకుండా అటూ ఇటూ దూసుకుపోతూనే ఉంది. కాని, నిన్న మధ్యాహ్నం భోంచేసి ఆఫీసుకు

వెళ్ళిన ఊర్మిళ భర్త—మరునాడుదయం పది గంటలు దాటినా ఇంటికి రాలేదు. కారణం తెలియక ఆమెకు కన్నీరు ఆగడంలేదు. హృదయం అలజడి చెందుతుంది. మనసు వ్యాథాభరితమైంది. ఏదో చెప్పలేని ఆందోళన అర్థంకాని ఆరాటం. అణుచుకోలేని ఆవేదన ఊర్మిళను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ప్రతిరోజు ఆఫీసుకు వెళ్ళే ఆమె భర్త ఉమామహేశ్వర్, సాయంత్రం ఆరుగంటలకు బయట తనకు ఎన్ని పనులున్నా తనకోసం భార్య ఎదురు చూస్తుందని యిల్లు చేరుకునేవాడు. వచ్చేప్పుడు పూలు కట్టించుకొని, తెచ్చి భార్య జడలో తురిమి "ఎంత అందంగా ఉన్నావో ఊర్మిళా! నీ అందం చూసి దేవకన్యకూడా సిగ్గుపడుతుంది" అనే వాడు. ముఖం కడుక్కొని ట్రిమ్‌గా తయారై భార్యను పిలుచుకొని సినిమాకు, షికారుకు బయల్దేరేవాడు.

ఊర్మిళకు ఉమామహేశ్వర్‌తో పెళ్ళై సంవత్సరం దాటి పోయింది. ఈ సంవత్సర కాలంలో నెలకు మూడురోజులు తప్ప మిగతా రోజుల్లో ఏ ఒక్కరోజూ వృధా పోనిచ్చే వాడు కాదు. షాపింగుకు వెళ్ళాలన్నా, సినిమా—షికార్లకు వెళ్ళాలన్నా చివరకు బంధుమిత్రుల యిళ్ళకు వెళ్ళాలన్నా ఊర్మిళ అతని వెంట వుండవలసిందే. కాని, ఏ నాడూ జరుగని రీతిగా నిన్నటినుండి భర్త యింటికి రాక పోయే సరికి భయాందోళనతో కంపించిపోతోంది.

ఊర్మిళ 7 గంటల వరకు నిరీక్షించింది. ఆరు గంటలకు వచ్చేవాడు 7 గంటలకు రాకపోయేసరికి ఏ మిత్రులైనా అతన్ని బలవంతంగా సినిమాకో, ఏ పార్టీకో పిలుచుకు వెళ్ళి వుండొచ్చని, మనసులో కోపంగా వున్నా సరిపెట్టుకో గల్గింది. రాత్రి 10 గంటలు దాటినా అతను రాలేదు.

పదిగంటలు దాటినా భోజనాల విషయం తలబెట్టకపోయే సరికి అత్తా, మామలు యిద్దరూ కలిసి అడిగారు. "అబ్బాయి యింకా రాలేదా?" అని.

"ప్రతిరోజు ఆరు గంటలకు వచ్చేవారు. ఈరోజు పది దాటినా రాలేదు. ఎక్కడికి వెళ్ళి వుంటారు మామయ్యా?"

"నీకు చెప్పి వెళ్ళడానికి తీరికలేక—ఎవరి బలవంతం మీదైనా సినిమాకు వెళ్ళాడేమో?"

"అలా వెళ్ళినా ఈపాటికి రావాలిగా?"

"ఒకవేళ క్లబ్బుకు వెళ్ళాడనుకోడానికి—క్లబ్బులకు వెళ్ళే అలవాటు లేదాయె. మరి ఎక్కడికి వెళ్ళినట్లు?"

"అర్జంటుగా పని వుండి ఆఫీసులోనే వుండిపోయాడేమో?"

"ఫోన్‌చేసి కనుక్కోండి!" అంది భర్తను ఊర్మిళ అత్త యశోదమ్మ.

శోభనాద్రి వెంటనే ఆఫీసుకు రింగ్‌చేశాడు.

రెస్పాన్స్ రాలేదు.

"ఆఫీసులో యెవ్వరు లేనట్లుంది యశోదా!....యెవరు పలుకడంలేదు" అన్నాడు భార్యతో శోభనాద్రి.

ఊర్మిళ అయోమయంలో పడిపోయింది.

రాత్రి అందరు ఉమామహేశ్వర్ కోసం ఎదురుచూసి-చూసి భోజనాలు చేయకుండానే పడుకున్నారు.

రాత్రంతా నిద్రపోలేదు ఊర్మిళ.

తెల్లారిం తరువాత తండ్రి తెలిసిన చోటల్లా విచారించి వచ్చాడు. జాడ తెలియలేదు.

ఆఫీసులో పనిచేసేవారిని అడిగారు. సాయంత్రం 5 గంటలకు వెళ్ళిపోయాడన్నారు.

"అమ్మా? ఊర్మిళా!!" పిలిచాడు శోభనాద్రి.

ఊర్మిళ కన్నీళ్ళు తుడుచుకుంది. "కనిపించారా మామయ్యా?"

శోభనాద్రి పలుకలేదు.

కోడలు కన్నీరు పెడుతూ దుఃఖిస్తుంటే శోభనాద్రి మనసు బాధతో విలవిల్లాడింది.

"ఏడ్వకమ్మా! నే వెళ్ళి పోలీసు కంప్లయింట్ యిచ్చి వస్తాను."

అంతలో చిన్నకొడుకు వెంకటేష్ గబగబా ఆ గదిలోకి వచ్చాడు.

"నాన్నా! ఈ ఉత్తరం అన్నయ్య టేబిల్ మీద పుస్తకంలో ఉంది చూడండి!" అని కంగారుపడుతూ ఉత్తరం అందించాడు. శోభనాద్రి ఉత్తరం చదువసాగాడు.

"ఉమామహేశ్వర్!

నువ్వు నన్ను మరిచిపోయినా నేను నిన్ను మరిచి పోలేదు. నువ్వు నాకు చేసిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకుంటాను. నాకు నీ ప్రాణాలు కావాలి. ఇప్పుడు నీ ప్రాణాలు నా గుప్పెట్లో ఉన్నాయి. నీ ప్రాణాలు ఏ విధంగానైనా తీస్తాను....నీ ప్రాణాలు పోయేముందు నువ్వే అర్థం చేసుకుంటావ్. ఆ ముహూర్తం త్వరలోనే పెట్ట బోతున్నాను.

— నీ మృత్యువు"

శోభనాద్రి కొయ్యబారిపోయాడు.

అతని చేతులు ఒణికాయి. ఉత్తరం జారిపోయింది.

మామయ్యలో కలిగిన మార్పుకు ఊర్మిళ కంగారు పడింది.

ఉత్తరం అందుకొని ఆత్రుతగా చదివింది.

"మామయ్యా!?"—

ఆయన కోడలు ముఖంలోకి జాలిగా చూశాడు. కాని, ఏం చెప్పలేదు.

ఆ ఉత్తరం వ్రాసిందెవరో అతనికి అర్థమైంది.

వివరంగా కోడలి కా విషయం చెప్పలేని అశక్తుడయ్యాడు.

2

శోభనాద్రి చెప్పిన విషయమంతా జాగ్రత్తగా విన్నాడు ఇన్‌స్పెక్టర్ మనోహర్.

"మీ కొడుకు ఉమామహేశ్వర్‌కు ఈ ఉత్తరం వ్రాసిందెవరో మీకు తెలుసా?"

"వీరభద్రరావ్."

"అంటే మీ మొదటి కోడలు వసుంధర తండ్రికదూ?"

"అవును. మేము అతని కూతుర్ని కిరసనాయిలు పోసి తగులబెట్టామని—అతను మమ్మల్ని యింకా అనుమానిస్తూనే ఉన్నాడు. అది జరిగి రెండు సంవత్సరాలు గడచిపోయాయి. భార్యపోయిన నా కొడుక్కి మళ్లీ ఊర్మిళ అనే అమ్మాయిని వివాహం చేశాను. అందుకోసం అతను ఉమామహేశ్వర్ మీద పగ సాధించాలని వాడి ప్రాణాలు తీయడానికి సంకల్పించాడు. నా కొడుకును నిన్న సాయంకాలం మాయం చేశాడు. వాడు నా కొడుకును ఏంచేశాడో? మీరు వాడి ఆచూకీ తీయాలి. వీరభద్రరావుపై కఠిన చర్య తీసుకోవాలి." కన్నీళ్ళు తుడుచుకున్నాడు శోభనాద్రి.

"శోభనాద్రిరావుగారూ!—మీ మొదటి కోడలు కిరసనాయిలు ఒంటికి పోసుకొని కాల్చుకుంది. తన ప్రాణాలు తీసుకోడానికి తనే బాధ్యురాలని, దీనికి సంబంధించి భర్తకుగాని, యింట్లో యితర వ్యక్తులకుగాని ఏలాంటి

సంబంధం లేదని—కడుపునొప్పిని భరించలేక తనే ఆత్మ హత్య చేసుకున్నట్లు గవర్నమెంట్ హాస్పిటల్లో మేజిస్ట్రేటు గారికి మరణ వాఙ్మూలం యిచ్చి ప్రాణాలు విడిచింది. వసుంధర తండ్రి మీపై చేసిన అభియోగాన్ని మేజిస్ట్రేటు గారు త్రోసిపుచ్చి కేసు క్లోజ్ చేశారు. దీన్నిబట్టి ఆమె ఆత్మహత్యతో మీకెలాంటి సంబంధంలేదని తేలిపోయింది. ఆ రికార్డు నా దగ్గరవుంది. రెండేళ్ళ తర్వాత వీరభద్రరావ్ పగసాధించడానికి ప్రయత్నం చేయడం అర్థంలేని విషయం. వీరభద్రారావ్‌ది ఏ ఊరన్నారు?"

"కర్నూలు."

"అడ్రసు?"

శోభనాద్రి చెప్పాడు.

అడ్రసు వ్రాసుకున్నాడు మనోహర్.

"వీరభద్రరావ్ గురించి తెలుసుకుంటాను....ఈ బెది రింపు ఉత్తరం అతనే వ్రాశాడని మీరు దృఢంగా చెప్ప గలరా?"

"నాకు అతనిమీదనే అనుమానం ఉంది."

"మీకు ఇంకెవరైనా శత్రువు లున్నారా?"

"లేరు."

"మీ అబ్బాయి ఉమామహేశ్వర్ ఏ ఆఫీసులో పని చేస్తున్నాడు?"

"హిందూస్థాన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్—అభిరామ పురం."

"మీరు వెళ్ళండి, అక్కడికి వెళ్ళి పరిశోధన జరుపు తాను. ఫోన్ నెంబర్ చెప్పి వెళ్ళండి. ఆచూకీ తెలియగానే చెబుతాను."

శోభనాద్రి తన రెసిడెన్షియల్ ఫోన్ నెంబర్ యిచ్చి వెళ్ళిపోయాడు.

3

అభిరామపురంలో వున్న హిందూస్థాన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వెళ్ళి, ఆఫీసు రూములో ప్రవేశించాడు ఇన్‌స్పెక్టర్ మనోహర్.

నిన్న సాయంత్రం 5 గంటలకు ఉమామహేశ్వర్ యింటికి వెళ్ళిపోయాడని అందరు చెప్పారు మనోహర్‌తో, అంతకు మించి అతని గురించి ఏ సమాచారము తెలియ లేదు.

మనోహర్ మెయిన్‌గేటు దగ్గరికి వచ్చాడు. అక్కడ ఉన్న కేబిన్ బయట వాచ్‌మెన్ కనిపించాడు.

"నిన్న సాయంత్రం నువ్విక్కడ డ్యూటీ చేశావా?" వాచ్‌మెన్‌ని అడిగాడు మనోహర్.

"చేశాను సార్."

"ఈ ఎస్టేట్‌లో స్టీల్‌ప్లాంట్ ఆఫీసులో సీనియర్ ఆఫీసర్ ఉమామహేశ్వర్ నీకు తెలుసుకదూ?"

"నాకేకాదు. ఆయన అందరికీ తెలుసు."

"నిన్న సాయంత్రం 5 గంటలకు ఆఫీసు పని అయ్యాక అతను ఇంటకి వెళ్ళడం నువ్వు చూశావా?"

"చూశాను సార్."

"అతనికేదైనా వాహనం ఉందా?"

"లేదు సార్. ఆయన రోడ్‌వరకు నడిచి వెళ్ళి — అక్కడ్నించి సిటీ బస్‌లో వెళతాడు."

"ఆయన కోసం ఎవరైనా ఇక్కడికి వచ్చి అడిగారా?"

"ఎవ్వరూ రాలేదు."

"రోడ్ యిక్కడికి కనిపిస్తుంది. ఆయన ఇక్కడ్నించి

వెళ్ళి, అక్కడ్నించి బస్సు ఎక్కి వెళ్ళడం చూశావా?"

"చూళ్లేదు. బస్ షెల్టర్ ప్రక్కలో పాన్‌షాపు వుంది. ఆ షాపువాడు పుస్తకాలు అద్దెకి యిస్తూ ఉంటాడు. అతను ఆ పాన్‌షాపు దగ్గరికి వెళ్ళిగాని—యింటికి వెళ్ళడు. బస్‌లో ఎక్కేవాళ్ళు—దిగేవాళ్ళు అతనికి కనిపిస్తుంటారు. ఉమామహేశ్వర్‌గారి విషయం అతన్ని అడిగితే తెలియవచ్చు సార్."

మనోహర్ మూడు నిముషాల్లో పాన్‌షాప్ చేరాడు. అంతవరకు వున్న యిద్దరెవరో సిగరెట్లు కొనుక్కొని అద్దె పుస్తకాలు తీసుకొని వెళ్ళిపోయారు. షాప్ యెదురుగా నిలబడ్డ మనోహర్‌ని చూసి పాన్ షాపతను నమస్కారం చేశాడు. లేచివచ్చి "బూతు పుస్తకాలు నేను అద్దెలకి పెట్ట లేదు సార్" అన్నాడు.

భయంతో అతను నా విషయం చెప్పేసరికి మనోహర్ అతని అమాయకత్వానికి చిరునవ్వు నవ్వాడు.

"నీ పేరు?"

"సోమనాధన్."

"ఆ ఎస్టేట్‌లో పనిచేసే ఉమామహేశ్వర్ నీకు బాగా తెలుసుననుకుంటాను."

"ఆయన ప్రతిరోజూ యింటికి వెళ్ళేటప్పుడు ఏవైనా పుస్తకాలు తీసుకువెళ్తారు సార్!"

"నిన్న సాయంత్రం ఆఫీసు అయ్యాక యిక్కడికి వచ్చి పుస్తకం తీసుకువెళ్ళాడా?"

"తీసుకున్నారు సార్."

"ఏ పుస్తకం తీసుకువెళ్ళాడు?"

"మేర్లిన్‌మన్రో....యింగ్లీషు పుస్తకం."

"అతను బస్సుకు వెళ్ళడం నువ్వు చూశావా?"

"రోజూ బస్సుకు వెళ్ళేవారు సార్. కాని, నిన్న మాత్రం టాక్సీలో వెళ్ళారు."

"అంటే, అతనే ఖాళీ టాక్సీ ఆపి ఎక్కి వెళ్ళాడా?.... టాక్సీలో ఎవరైనా వచ్చి అతన్ని పిలుచుకు వెళ్ళారా?"

"అది నేను గమనించలేదు సార్! అతను టాక్సీ ఎక్కి వెళ్ళడం మాత్రం చూశాను."

"టాక్సీ నెంబరు గుర్తుంటే చెప్పు."

"ఎమ్. ఎస్. ఎమ్. 9966."

"టాక్సీ నెంబరు అంత ఖచ్చితంగా యెలా చెప్ప గలుగుతున్నావ్!"

"ఆ నెంబరు యెటు చూసినా ఒకే విధంగా వుంటే చూసి నవ్వుకున్నాను సార్. అందుకే జ్ఞాపకం వుంది__"

మనోహర్ అక్కడ్నుంచి మళ్ళీ ఎస్టేట్ దగ్గిరికి వచ్చాడు. అక్కడ పార్కు చేసి వున్న పోలీస్ జీపు ఎక్కి వెంటనే టాక్సీస్టాండుకు బయలుదేరాడు. టాక్సీ స్టాండు లన్నీ గాలించగా ఆ నెంబరుగల టాక్సీ మూర్‌మార్కెట్ దగ్గిర కనిపించింది టాక్సీడ్రైవర్ టాక్సీవద్దే వున్నాడు.

మనోహర్ జీపు దిగి ఆ డ్రైవర్‌ని రమ్మని చెయ్యి ఊపాడు.

డ్రైవర్ వచ్చాడు. నమస్కారం చేశాడు.

"నేను టాక్సీని రాంగ్‌సైడ్‌లో ఉంచలేదు సార్" అన్నాడు భయంగా.

"నిన్ను పిలిచింది అందుకు కాదు. ఈ టాక్సీ నీ సొంతమేనా?"

"అవును సార్!"

"నిన్న సాయంత్రం 5 గంటల తరువాత నువ్వు అభి

రామపురంలో ఉండే ఎస్టేట్ యెదురుగా 14 నెంబరు స్టేజి దగ్గర ఉమామహేశ్వర్ అనే స్టీల్ ప్లాంట్ ఆఫీసర్‌ని నీ టాక్సీలో ఎక్కించుకున్నావని తెలుసుకున్నాను."

"అవును సార్! అతని ఫ్రెండ్ సిద్ధేశ్వరరావు నా టాక్సీ ఎక్కి అక్కడికి తీసుకువెళ్ళారు. అతన్ని కూర్చో బెట్టుకొని అంబత్తూరుకు తీసుకువెళ్ళారు సార్!"

"అంబత్తూరుకా? .... సిద్ధేశ్వరరావు యెవరో నీకు తెలుసా?"

"తెలియదు సార్!"

"సిద్ధేశ్వరరావు నీ టాక్సీలో యెక్కడ యెక్కాడు?"

"మైలాపూర్ చర్చి దగ్గర."

"అంబత్తూరులో వారిని ఎక్కడ దించావ్?"

"వీధి పేరు నాకు గుర్తులేదు. సిద్ధేశ్వరరావు చెప్పి నట్లుగా టాక్సీని తోలాను. రెండంతస్థుల భవనం ముందు టాక్సీ దిగి నాకు ఫేర్ చెల్లించి లోపలికి వెళ్ళారు."

"తిరిగి నీ టాక్సీలో రాలేదా వాళ్ళు?"

"ఫేర్ యిచ్చి నన్ను వెళ్ళిపొమ్మన్నాడు సిద్ధేశ్వరరావు."

"ఉమామహేశ్వర్ తను తిరిగి రావడానికి నిన్ను వెయిట్ చేయమనలేదా?"

"చెప్పాడు....కాని, చాలా ఆలస్యమౌతుంది నువ్వెళ్లు. ఆయన మరో టాక్సీలో వెళ్తారులే! అన్నాడు సిద్ధేశ్వర రావు. నేను బజారుకు వచ్చి వేరేవాళ్ళను ఎక్కించు కొచ్చాను."

"నేను యిప్పుడు అక్కడికి వెళ్తున్నాను. నువ్వు నా వెంట రావాలి."

"నేనా?....ఏం జరిగింది సార్?"

"ఉమామహేశ్వర్ నిన్న సాయంత్రం నుంచి కని పించడంలేదు."

"వాళ్ళు చాలా క్లోజ్ ఫ్రండ్స్‌లా ఉన్నారు సార్! టాక్సీలో కూర్చొని అంబత్తూరు వెళ్ళేవరకు చాలా సంతోషంగా మాట్లాడుకున్నారు. తమాషా కబుర్లు చెప్పుకొని నవ్వుకున్నారు."

"అక్కడికి వెళ్ళి విచారించాలి రా!....వెంటనే తిరిగొద్దాం. అంబత్తూరులో ఆ రెండంతస్థుల భవనం నాకు చూపిద్దువుగాని."

జీపు యెక్కాడు మనోహర్. టాక్సీడ్రైవర్ కూడా ఎక్కాడు.

అర్ధగంటలో అంబత్తూరు చేరి టాక్సీడ్రైవర్ చూపించిన రెండంతస్థుల భవనం ముందు నిలబడింది పోలీస్ జీప్. మనోహర్ డ్రైవర్‌ని పిలుచుకొని భవన ముఖద్వారం దగ్గరికి వెళ్ళి నిలుచున్నాడు.

పనిమనిషి చూసి వెళ్ళి చెప్పింది కాబోలు లోపల్నుంచి యిరవై రెండేళ్ళ యువతి బయటికి వచ్చింది. ఇన్‌స్పెక్టర్‌ని చూసి ఆశ్చర్యపడింది. ఆమె చాలా అందంగా వుంది.

"సిద్ధేశ్వరరావుగారి కోసం వచ్చాను. ఉన్నారా?" అని అడిగాడు మనోహర్,

"లేరు. సిటీలోకి వెళ్లారు."

"వారితో మాట్లాడ్డానికి వచ్చాను."

"రండి!....కూర్చోండి!!" యింట్లోకి ఆహ్వానించింది ఆ యువతి.

మనోహర్ హాల్లో కుషన్ చెయిర్‌లో కూర్చున్నాడు. అక్కడే టేబిల్ మీద కొన్ని వారపత్రికలు,

వార్తాపత్రికలు, నవలలున్నాయి. మనోహర్ దృష్టి ఒక ఇంగ్లీషు నవలపై బడింది.

మెర్లిన్‌మన్రో:....ఆ పుస్తకం లోపల పేజీమీద అభిరామపురం పాన్‌షాపు—స్టాంపు వుంది. నిన్న ఆ పుస్తకాన్ని అద్దెకు యిచ్చిన తారీఖు వేయబడి వుంది.

"మీరు ఎందుకు వచ్చారో తెల్సుకోవచ్చా?" అడిగిందా యువతి కాస్త దూరంలో నిలబడి.

"ఇది అద్దె పుస్తకంలా ఉంది. దీన్ని ఎవరు తెచ్చారు?" అడిగాడు మనోహర్.

"మావారి స్నేహితుడు ఉమామహేశ్వర్."

"అంటే మీరు సిద్దేశ్వరరావ్‌గారి...."

"భార్యని!....సులోచన నా పేరు."

"నిన్న సాయంత్రం మీ వారితో కలిసి ఉమా మహేశ్వర్ అతని టాక్సీలో యిక్కడికి వచ్చారు కదూ?"

"ఎవరి టాక్సీలో వచ్చారో నాకు తెలియదు. కాని, నిన్న యిద్దరు కలిసి వచ్చారు."

"ఉమామహేశ్వర్ నిన్న ఎంతసేపు వున్నారిక్కడ?"

"నిన్న నా భర్త్‌డే పార్టీ జరిగింది....సింపుల్‌గా చేసుకున్నాను. ముఖ్యమైన మిత్రులు ముగ్గురు-నలుగురు తప్ప యింకెవరినీ యిన్‌వైట్ చెయ్యలేదు. భోజనాలు జరిగిం తర్వాత ఉమామహేశ్వర్‌ను టాక్సీలో పంపించి యింటికి వచ్చారు వారు."

"ఉమామహేశ్వర్ యిక్కడ్నించి వెళ్ళేటప్పటికి టైం ఎంతయి వుంటుంది?"

"టైం కరెక్టుగా చెప్పలేను. పది గంటలు దాటి ఉంటుందనుకుంటాను."

"ఈ పుస్తకాన్ని ఉమామహేశ్వర్ మీరు చదువుకో

డానికి విడిచిపెట్టి వెళ్ళారా?"

"ఇంగ్లీషు పుస్తకాలు మా యింట్లో యెవరు చదవరు. బహుశ, పోయేటప్పుడు మరిచిపోయి ఉంటారు."

"సులోచనగారూ! మీవారు ఏం చేస్తుంటారు?"

"విల్లివాక్కంలో సుధామ ఫైనాన్స్ కార్పొరేషన్ మాదే .... ఉమామహేశ్వర్ గురించి యిదంతా మీ రెందుకు అడుగుతున్నారో చెబుతారా ఇన్స్పెక్టర్గారూ?"

"ఉమామహేశ్వర్ నిన్నటి నుంచి కనిపించటం లేదు."

సులోచన ఆశ్చర్యాన్వితురాలై చూసింది.

"అంటే? ...."

"అతనికేమైందో యింతవరకు తెలియలేదు. నిన్న మీ రిసెప్షన్కు యెవరెవరు వచ్చారో చెప్పగలరా?"

"ఇంకా నలుగురు వచ్చారు. వారు మావారి ఫ్రెండ్స్. వారి పేర్లు నాకు తెలియదు. వారితో నాకు పరిచయంలేదు. వారు యెప్పుడు యిక్కడికి రాలేదు. నిన్ననే వచ్చారు."

"సిద్ధేశ్వరరావ్గారు సిటీలోకి వెళ్లారన్నారు. విల్లి వాక్కంలోనున్న ఫైనాన్స్కార్పొరేషన్ ఎవరు మెంటె యిన్ చేస్తారు?"

"వారు లేనప్పుడు మేనేజర్ చూసుకుంటారు. అయినా ఈ రోజు ఆదివారం. ఆఫీసు ఉండదు."

"మీ వారిని మళ్ళీ వచ్చి కలుసుకుంటాను."

మనోహర్ నవలను టేబుల్పైనే పడేసి, బయటికి వచ్చి జీప్ ఎక్కారు.

4

చీకటి గదిలో బంధింపబడి ఉన్నాడు ఉమామహేశ్వర్. నిన్నరాత్రి 12 గంటల నుంచి యిప్పటివరకు అంటే

మరుసటి రాత్రి 9 గంటల వరకు అతనికి మంచినీళ్ళు యిచ్చేవాళ్ళు కూడా లేరు. దాహం! దాహం!! ....అంటూనే స్పృహ తప్పింది అతనికి.

ఎవరో చీకట్లోనే వచ్చి అతని ముఖంపై నీళ్ళు చల్లారు. పది నిమిషాల తరువాత మెల్లగా కళ్ళు తెరిచాడు.

అంతా చీకటి. ఎదురుగా యెవరో నిలబడ్డట్టు లీలగా కనిపిస్తుంది. ఆ మనిషి యెవరో ఆకారం కనిపించడం లేదు. "ఎవరు అక్కడ నిల్చున్నది?" హీనమైన స్వరంతో అడిగాడు.

ఆ ఆకారం ఫక్కుమని నవ్వింది. అతని ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

"నీళ్ళు త్రాగుతావా?"

"చాలా దాహంగా ఉంది. భోజనం యివ్వక నిన్నటి నుండి పస్తు. చంపుతున్నారు. కాస్త మంచినీళ్ళయినా యివ్వు."

"మంచినీళ్ళు కూడా యివ్వొద్దన్నారు. యెలా యివ్వను?"

"చెప్పిందెవరు?"

"నిన్ను యిక్కడికి రప్పించి బంధింపజేసిన వారు."

"ఎవరా కిరాతకులు?"

"అనుభవిస్తున్నావు. యింకా నీ బెట్టు పోలేదా!....నీ నీ బెట్టు....కాదు....కాదు. నీ ప్రాణాలు యింకొద్ది నిమిషాల్లో గాలిలో కలిసిపోతాయి. నీకు కావలసినవాళ్ళను తలుచుకొని దైవ ప్రార్థన చేసుకో!....ప్రాణాలు పోగొట్టుకునేవాడికి మంచి నీళ్ళెందుకులే....వస్తాను" అని ఆ ఆకారం ముందుకు కదిలి చీకటిలో కలిసి పోయింది. ఆ

మనిషి మగవాడో, ఆడదో స్వరాన్నిబట్టి గ్రహించ డానికి నీరసంవల్ల అతనికి సాధ్యం కావడం లేదు.

తనకోసం భార్య ఊర్మిళ, తమ్ముడు వెంకటేశ్, తల్లి-దండ్రులు ఎంత బాధపడుతుంటారో, ఎంత దుఃఖి స్తూంటారో తలుచుకుంటూంటే-అతనికి బాధతో కన్నీళ్ళు వర్షిస్తున్నాయి. హృదయం ఆవేదనతో అలమటించి పోతుంది. తనను యెవరు అక్కడికి తెచ్చారో, ఎందుకు బంధించారో, ఎందుకు తన ప్రాణాలు తీయ సంకల్పిం చారో అతనికి అర్థం కావటం లేదు.

తన తొలిభార్య తండ్రి వీరభద్రరావ్ ఆ పని చేయిం చాడనుకోడానికి తన్ను బంధించి తెచ్చిన నలుగురిలో అతను లేడు. పరోక్షంగా ఉండి, మరెవరితోనో బంధింప జేసి వుంటే యింతవరకు ముందుకు రాలేదు. తనను యెలా యెవరు బంధించి తెచ్చారో తలచుకుంటుంటే....ఆ గదిలో లైటు వెలిగింది. తలుపు తెరుచుకొని అతన్ని బంధించి తెచ్చిన నలుగురు వ్యక్తులు బిలబిలమంటూ లోపలికి వచ్చి తలుపులు అడ్డం వేశారు.

కాళ్ళు చేతులు కట్టివేయబడి నేలపై ముడుచుకు పడి వున్న ఉమామహేశ్వర్ తల యెత్తి ఆ నలుగురికేసి చూస్తున్నాడు. అతని కళ్ళు కన్నీటిని వర్షిస్తున్నాయి. "ఎవరు మీరు? నన్నెందుకు బంధించారు?" అని అడిగాడు.

అలా యిప్పటికి ఎ వందసార్లో అడిగి వుంటాడు. కాని అతని ప్రశ్నకు వికృతంగా, హేళనగా నవ్వుతారే తప్ప జవాబు యివ్వరు. ఇప్పుడు కూడా వికృతంగా నవ్వారు.

ఇద్దరు అతని కాళ్ళు చేతుల కట్లు విప్పదీశారు. సరిగా నిలుచోలేక తూలుతున్నాడు. ఎక్కడి కీళ్ళు అక్కడ

పట్టుకుపోయాయి. ఆవేశంతో క్రోధంతో, వారిని ఈడ్చి కొట్టి తిరుగబడి పారిపోవాలనుకున్నాడు. కాని అతని కా శక్తి నశించింది.

"మీరు యెవరో. నన్నెందుకు బందించారో చెప్పక పోయినా అది నా ఖర్మ అనుకుంటాను. ఇప్పుడు నన్ను విడిచిపెట్టండి. మీకెంతో పుణ్యముంటుంది" అన్నాడు దీనంగా ఉమామహేశ్వర్.

"నన్ను విడిచిపెట్టడానికి కాదు కట్లు విప్పింది. అదిగో ఆ సిమెంటు స్తంభానికి సిలువవేసి కట్టివేస్తారు."

స్తంభానికి అడ్డంగా రెండు మీటర్ల కర్రను కట్టారు. ఉమామహేశ్వర్‌ను ఈడ్చుకువెళ్ళి చేతులు బారగా లాగి సిలువ ఆకారంలో కట్టివేశారు.

అంతలో ఓ యువతి ఆ గదిలోకి ప్రవేశించింది. తల వంచుకొని కన్నీళ్ళుకారుస్తున్న ఉమామహేశ్వర్ ఆ యువతిని గమనించేస్థితిలో లేడు.

"మీరు వెళ్ళండి!" అందా యువతి.

నలుగురు బయటికి వెళ్ళిపోయారు.

తలుపులు మూసి కిలకిలా నవ్విం దా యువతి.

మెల్లిగా తలెత్తి చూశాడు ఉమామహేశ్వర్.

ఆ యువతిని చూసేసరికి చలించిపోయాడు.

"రా....ణీ!....నువ్వా?"

రాణీ గర్వంగా నవ్వింది!....కిలకిలా నవ్వింది!!.... వికటంగా నవ్వింది!!!....

ఆమె నవ్వులు శూలాలై అతని హృదయంలో గ్రుచ్చు కుంటున్నాయి.

అతని మనసును క్రుంగదీస్తున్నాయి.

అతని శరీరంపై తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నాయి.

"ఒకనాటి నీ ప్రియురాలును?....ఈనాటి నీ పాలిటి మృత్యువును!?"

"మన ప్రేమానుబంధం తెగిపోయి మూడేళ్ళు దాటి పోయింది. నన్ను పూర్తిగా మరిచిపోయావు అనుకున్నాను. ఇన్నేళ్ళ తర్వాత పగబట్టి నా మీద విజృంభిస్తావనుకో లేదు."

"నువ్వు చేసిన పాపం ఎంత ఘోరమైందో తలచు కుంటే యిప్పటికి నా గుండె దడ అధికమవుతుంది. ఆడదంటే ఆటబొమ్మని భావించే నీలాంటి కిరాతకులకు ఎలాంటి శిక్ష విధించాలో ఆలోచించడానికి యింతకాలం పట్టింది. ప్రతీకార జ్వాలలతో దహించుకుపోతున్న నా హృదయం - నీకు సరియైన గుణపాఠం చెప్పేవరకు శాంతించదు."

రాణి అతని దగ్గరికి వెళ్ళింది. రేజర్‌తో అతని పెదాల మీద గాటు పెట్టింది. రెండు పెదవులు నిలువునా కోసుకు పోయి నెత్తురు బొటబొటా కారింది. "రా....ణీ! ఎంతగా మారిపోయావు?" అన్నాడు బాధగా.

రాణి వెకిలిగా నవ్వింది. "నేను మారిపోలేదురా దుర్మార్గుడా!....నన్ను మోసంచేసి, నా హృదయంలో ఆరనిమంటను రేపి, నా మనసును కఠినశిలగా మలిచింది నువ్వేరా!....నన్ను ఆనాడు ముద్దులతో మురిపించి అధర మధురామృతాన్ని గ్రోలిన నీ పెదవులు యిప్పుడేమంటు న్నాయి? ముద్దులు కావాలంటున్నాయా?" అని రాణి చేతిలోని రేజర్‌తో అతని రెండు చెంపలమీద గట్టిగా గీచింది. పగిలిన దోసకాయలా చీలిపోయాయి అతని చెంపలు. రక్తం ఉబికి ధారలుగా కారసాగింది.

"అబ్బా!...." అని, కళ్ళుమూసుకొని మూలిగాడు

ఉమామహేశ్వర్. "రా....ణీ!?....ఎంతటి శిక్షను విధిస్తున్నావు?....నీ హృదయం ఎంత పాషాణమైంది?....నీకు చేసిన ద్రోహానికి యిప్పటికి విధించిన ఈ శిక్షచాలు. ప్లీజ్!....నన్ను విడిచిపెట్టు!" కన్నీరు రక్తం కలిసి ప్రవహిస్తుంటే ప్రాధేయపూర్వకంగా అర్థించాడు.

"చేతికి చిక్కిన శత్రువును విడిచిపెట్టేంత అవివేకం నా కేమీ లేదు. నిన్ను యింకా చిత్రవధ చేస్తాను. ఆడవారిపట్ల నీచాతినీచంగా ప్రవర్తించిన నీకు....దగాపడ్డ ఆడది పడ్డ హృదయావేదన ఎలాంటిదో-నువ్వు పడే బాధకన్నా అధికంగానే మానసికంగా బాధపడివుంటుందని-నువ్వు అర్థం చేసుకునేలా చేస్తాను. ఈ రాణికి చేసిన ద్రోహానికి ప్రతిఫలం ఎంత మధురంగా ఉంటుందో తెలుసుకోరా నికృష్టుడా!"—అని, రాణి అతని చేతిపై కత్తితో చెక్కింది.

"వద్దు రాణీ!....ఈ చిత్రవధ నేను భరించలేను. నన్ను క్షమించి విడిచిపెట్టు!"

"నన్ను ప్రేమించి గర్భవతిని చేశావు. ఉన్న సంగతి నీతో చెప్పి పెళ్ళి చేసుకుందామని అడిగితే—కట్నం ఎక్కువగా యిచ్చుకోలేని నన్ను యాభై వేలు యిస్తే చేసుకుంటాను లేకుంటే నీదారి నీది, నా దారి నాది అన్నావ్."

"నిన్ను కట్నం లేకుండా చేసుకోవాలనుకున్నాను. మా అమ్మా-నాన్న పడనీయలేదు. వారిని ఎదిరించి నిన్ను చేసుకునే ధైర్యంలేక - నీకు చేసిన మోసానికి శిక్ష ననుభవిస్తున్నాను—"

"మూడు మాసాలు గర్భం ధరించిన నా జీవితం ఏం కావాలనుకున్నావ్?"

"................"

"నువ్వు జవాబు చెప్పలేవు. నేను నీ పాపాన్ని మోయలేక, ప్రపంచంలో, సంఘంలో, సమాజంలో— పతితగా ముద్రవేయించుకోలేక గుట్టుగా అబార్షన్ చేయించుకున్నాను. ఎలా బయట పడిందో నా గుట్టు బయటికి వచ్చింది. గుండె జబ్బుగల మా నాన్న ఈ వార్త విని గుండె ఆగి చచ్చిపోయాడు. ఇదే దిగులుతో మంచానపడ్డ నా తల్లి ఆరుమాసాలకంటే యెక్కువ కాలం జీవించలేకపోయింది. నా జీవితం తెగిన గాలిపటం అయింది. మా కుటుంబం యిలా చివరిదశకు చేరుకోడానికి కారకుడివి నువ్వు!....

"నువ్వు చేసిన ద్రోహాన్ని పగగా మార్చుకున్నాను. నన్ను పెళ్ళాడేవారు లేక, జీవించడానికి ఆధారం లేక ఒళ్ళు అమ్ముకుని బ్రతికే హీనస్థితికి దిగజారిపోయాను. నా జీవితాన్ని యింత పతనావస్థకు దిగజార్చిన నిన్ను కనికరించాలా?....నీ దృష్టిలో ఆడదంటే ఒక ఆట వస్తువు! ...చివరకు కట్టుకున్న పెళ్లాన్ని డబ్బుకోసం వేధించి, ఆమె డబ్బు తేలేని స్థితిలో ఉండగా ఆమె ఒంటిపై కిరసనాయిల్ పోసి కాల్చి చంపుతావా మిస్టర్.... మహేశ్వర్?"

"నేను చంపలేదు. అదే కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంది."

మరో చేతిమీద పడింది కత్తిప్రేటు.

"వద్దు....వద్దు. నిజం చెబుతాను" అని బాధగా అరిచాడు ఉమామహేశ్వర్.

ఉమామహేశ్వర్ సమీపానికి వచ్చి టేప్‌రికార్డరు ఆన్ చేసింది రాణి.

"చెప్పు!....నీ మొదటి భార్య వసుంధర తల్లిదండ్రులు

నీకు ఎంత కట్నం యిచ్చారు?"

"యాభై వేలు....కొంత బంగారు."

"పెళ్ళయిన ఆరుమాసాల తరువాత మళ్లీ ఆమెను పుట్టింటికి వెళ్ళి డబ్బు తెమ్మని వేధించారా, లేదా?"

"వేధించాము."

"ఎవరెవరు ఆమెను వేధించారు?"

"నేను - అమ్మ - నాన్న!"

"ఆమెకై ఆమె ఆత్మహత్య చేసుకోలేదు కదూ?"

"లేదు."

"ఆమెను మీరు యెలా చంపారో చెప్పాలి...."

అతను పలుకలేదు.

బూటుకాలుతో అతని కాళ్ళ వ్రేళ్ళపై బలంగా తన్నింది.

"ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక డబ్బు తెమ్మని, లేకుంటే పుట్టింటికి వెళ్ళి తిరిగి కాపురానికి రావద్దని చెప్పాం. 'మీరు అడిగినప్పుడంతా డబ్బు యిస్తానని మా నాన్న పెళ్ళిలో మాట యివ్వలేదు. మీకు యివ్వవలసిన డబ్బు యిచ్చేశారు. ఏదో అవసరముందంటే ఒకసారి వెళ్ళి పాతిక వేలు తెచ్చియిచ్చాను. మళ్ళా డబ్బుకోసం ఏ ముఖం పెట్టుకొని వెళ్ళేది? అడగడానికి మీకు సిగ్గు లేదేమోగాని....నాకు సిగ్గుగా ఉంది. నా మొగుడికి పెళ్లాం - అత్తామామలైన మీకు కోడలు అక్కరలేదు. మీ కూతుళ్ళకి మీరు ఎంతమాత్రమిచ్చారు?....మీకూతు రొక్క రెండు వందలు అడిగితే మీరేమన్నారు? మీలాంటి సంసారాలే అందరివీను' అని వసుంధర కన్నీటితో ప్రాధేయపూర్వకంగా చెప్పింది.

ఆమె పోతే నాన్న మళ్ళీ మంచి సంబంధం తెచ్చి చేస్తానన్నాడు. నా భార్య మాటల్లో నిజంవున్నా వారు ఎంతో అవమానం చేసిందని బాధపడ్డారు. ఆ రాత్రి 12 గంటలు దాటిం తరువాత లావేటరికి వెళ్ళి వస్తున్న వసుంధరను....నాన్న ఒడిసిపట్టుకున్నాడు. అమ్మ కిరసనాయిల్ తలపై పోసింది. నేను అగ్గిపుల్ల పెట్టాను....వసుంధర చావుకి మేము ముగ్గురం కారకులం.

వసుంధరకు భర్తనైయుండీ నన్ను ఎంతగానో ఆరాధించే నా భార్యను-డబ్బు కోసం తల్లిదండ్రుల మాటకు కట్టుబడి చాలా దుర్మార్గంగా పశువు కంటే హీనంగా ప్రవర్తించాను .... అందుకే భగవంతుడు ఈ నరకాన్ని సృష్టించాడు" బాధగా అన్నాడతడు.

"కట్నం డబ్బుతో లక్షలు సంపాదించాలనుకున్న మీరు నా జీవితాన్ని....వసుంధర జీవితాన్ని నాశనం చేశారు. ఇప్పుడు ఊర్మిళ జీవితం ఏం చేయబోతున్నారు?"

"కొన్నాళ్ళు పోతే ఊర్మిళకు కూడా అదే గతి పట్టవచ్చు!"

"ఆడదంటే గౌరవంలేక, భార్య అంటే జాలిలేక ఆడవాళ్ళ జీవితాలతో చెలగాటమాడే నీలాంటి క్రూరాత్ములకు ఎలాంటి శిక్ష విధిస్తే ఆడవాళ్ళ మనసులు శాంతిస్తాయి?"

"...................."

"మళ్ళా చప్పట్లుకొట్టింది. ఒకతను లోపలికివచ్చాడు.

"ఏం కావాలి మేడమ్?"

"కారం."

అతను వెంటనే కారం పొట్లం తెచ్చియిచ్చాడు.

"నా హృదయంలో....నాలాంటి స్త్రీ అయిన నీ భార్య

వసుంధర హృదయంలో నువ్వు రేపిన మంట ఎలాంటిదో తెలుసుకోరా!" అంటూ కారం తీసుకుని గాయాలపై చల్లింది నిర్దాక్షిణ్యంగా.

"అ....బ్బా?....మం... ట!?...." తల స్తంభానికేసి బాదుకున్నాడు. "నన్ను....యిలా....చిత్రవధ చెయ్యకు. ఒక్కసారే చంపి నీ కసి తీర్చుకో రాణీ,"

"నీలాంటివాడి ప్రాణాలు అంత సులభంగా పోకూడదు మిస్టర్!....నువ్వు యింకా అనుభవించాలి....నీ బాధ చూసి నేను ఆనందించాలి. నేను అన్నిటికి తెగించే ఈ సాహసానికి పూనుకున్నాను. పోలీసులు పట్టుకుంటారనిగాని, నిన్ను చంపిన హత్యా నేరానికి ఉరిశిక్ష పడుతుందనిగాని నాకు భయం లేదు. నీ ప్రాణాలు పోయిం తరువాత నేనే నా నేరాన్ని అంగీకరించి పోలీసులకు లొంగిపోతాను. ఈ కాసెట్ పోలీసులకు అప్పగించి నీ తండ్రికి—తల్లికి కఠినశిక్ష పడేలా చేస్తాను.

"మిస్టర్!....ఈరోజు రెస్టు తీసుకో?....రేపు మళ్ళీ యిదే స్థానంలో నిలబడి యింతకంటే ఘోరాతి ఘోరంగా శిక్షింపబడాలంటే నీకు కొంత శక్తి కావాలి....అందుకోసం ఈ పూట నీకు భోజనం పెట్టిస్తాను" అని "మిస్టర్స్!....యిటు రండి!" అని పిలిచింది.

బయటనున్న నలుగురు లోపలికి వచ్చారు.

"ఎస్ మాడమ్!...." అన్నారు.

"వీడి కట్లు విప్పి భోజనం తెచ్చిపెట్టండి. అంటే క్లాస్ భోజనం కాదు. అన్నం—గొడ్డుకారం...."

అని రాణి మరొక్కసారి ఉమామహేశ్వర్ కేసి చూసి అక్కడ్నించి వెళ్ళిపోయింది.

5

"శోభనాద్రిగారూ!....మీ మొదటి వియ్యంకుడు వీర భద్రరావ్ తన కూతురు వసుంధరను మీరు చంపారని మీపై పగబట్టి ఉమామహేశ్వర్‌ను మాయం చేశాడని మీ అనుమానమంతా అతనిపై ఉందన్నారు. కాని మీ ఊహ అనుమానం సరియైనదికాదని తెలిసింది" అన్నాడు ఇన్ స్పెక్టర్ మనోహర్,

"అలా అని మీరు యెలా చెప్పగలుగుతున్నారు?" అడిగాడు శోభనాద్రి.

"ఈ కేసు గురించి వివరిస్తూ కర్నూలు పోలీస్‌స్టేషన్‌కు వైర్‌లెస్ మెసేజ్‌ద్వారా తెలియపరిచాను. ఎల్. ఐ. సి. ఏజెంట్ వీరభద్రరావు గురించి వివరాలు తెలియజేయమని కోరాను. నిన్న సాయింత్రం వైర్‌లెస్ మెసేజ్ ద్వారా వారు తెలియజేసింది ఏమంటే...—వీరభద్రరావు రెండు మాసాలుగా పెరాలసిస్ వచ్చి బెడ్‌మీద పడివున్నాడు. అతని కుడికాలు చెయ్యి పడిపోయింది. మనుషులతో సరిగా మాట్లాడే స్థితిని కోల్పోయాడు—"

"ఆయన చేసివుండకపోవచ్చు. ఈ కాలంలో డబ్బు ఖర్చుపెడితే జరుగని పనులంటూ ఏవీ వుండవు. డబ్బు ఖర్చుపెట్టి ఏ రౌడీ గాంగ్‌తోనైనా చేయించి ఉండొచ్చుగా" అన్నాడు శోభనాద్రి.

"ఆయన కర్నూలులో వున్నాడు. మీరు మద్రాసులో వుంటున్నారు. అంతదూరం నుండి రౌడీగాంగ్ వచ్చి మీ కుమారుని ముఖమైనా చూడనివాళ్ళు అతన్నెలా కిడ్నాప్ చేసి వుంటారంటారు?"

"అడ్రెస్ తెలిస్తే దేశాలకు వెళ్ళి కూడా మనకు పరిచయం లేని మనిషిని తెల్సుకోవడం కష్టం కాదను

కుంటాను."

"ఎటుతిరిగి ఈ పని వీరభద్రరావు చేయించి వుంటా డంటారు."

"అవును."

"ఆల్ రైట్! అలాగే అనుకుందాం....రాణి అనే అమ్మాయి మీకు తెలుసా?"

"రాణి యెవరు?" వులిక్కిపడ్డాడు శోభనాద్రి.

"తెలియనట్లు నటించకుండా రాణి యెవరో చెప్పండి!"

"తెలియదు."

"రాణి ఎవరో మీరు చెబితే, మీ అబ్బాయి ఏమయ్యాడో నేను చెబుతాను."

"మా అబ్బాయి ఆచూకీ తెలిసి—తెలియనట్లు ఎందుకు నటిస్తున్నారు?....మీకేదైనా డబ్బాశ వుంటే నిర్మొహ మాటంగా అడగండి....! అయిదు వేలా?.... పది వేలా??—"

"షటాప్!—" ఉద్రేకంగా అరిచాడు మనోహర్. "ఆ డబ్బుమీద వ్యామోహంవల్లనే యాభై వేలు కట్నం తీసుకొని కూడా ప్రేమాభిమానాలు లేని కిరాతకుల్లా. ఇంకా డబ్బు తేలేదని వేటకుక్కలుగా మారి ఆ అమాయకురాలి ప్రాణాలు తీశారు. లంచం యివ్వ చూపినందుకు చట్టరీత్యా మీపై కఠినచర్య తీసుకోవలసి వుంటుంది. చెప్పండి?.... రాణి మీకు తెలుసా?"

"సారీ!....తెలుసు." అన్నాడు శోభనాద్రి తల దించు కుంటూ.

"ఎవరా రాణి?"

"ఒకప్పటి ఉమామహేశ్వర్ ప్రియురాలు!"

"రాణి ఉమామహేశ్వర్ ప్రేమించుకున్నారు. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. యాభై వేలు కట్నం యిచ్చే శక్తి రాణి తల్లి—దండ్రులకు లేదని తెలిసి రాణిని మీ కోడలుగా చేసుకొనడానికి నిరాకరించారు. అవునా?"

"అవును."

"మీ కొడుకువల్ల రాణి గర్భం ధరించింది. అది మీ కొడుకు చేసిన తప్పు!—ఆ తప్పును అతను సరిదిద్దుకోవాలంటే ఉమామహేశ్వర్ రాణిని పెళ్ళి చేసుకోవాలి. అది తెలిసికూడా డబ్బుమీద వ్యామోహంతో వసుంధరతో పెళ్ళి చేశారు. వివాహపూర్వం గర్భం ధరించిన ఒక కన్నెపిల్ల జీవితం ఏమౌతుందనుకున్నారు?"

"అబ్బాయి నాతో రహస్యం చెప్పలేదు."

"మొగాడివల్ల దగాపడ్డ ఏ స్త్రీ కూడా తన్ను ప్రేమించిన ప్రియుడు మోసంచేసి మరో స్త్రీని వివాహమాడుతున్నాడని తెలిసి తన దురదృష్టంగా భావించి చూస్తూ ఊరుకోదు శోభనాద్రీ!....రాణి నీ దగ్గరికి వచ్చింది. జరిగిన విషయం చెప్పింది. తన్ను అన్యాయం చేయవద్దని కన్నీటితో మీ కాళ్ళమీద పడి హృదయవిదారకంగా విలపించింది. మీ హృదయం కరుగలేదు. ఆమె కన్నీరు మీలో జాలి కలిగించలేదు. ఆమెను బయటికి గెంటించారు.

"మిమ్మల్నెదిరించి ఆమెను చేసుకునే ధైర్యం లేక ఉమామహేశ్వర్ మీ చేతిలో కీలుబొమ్మ అయ్యాడు. ఆమె జీవితపతనానికి కారకుడయ్యాడు. అందుకు ఫలితం: ఉమామహేశ్వర్ రాణి చేతిలో బందీ అయ్యాడు....నరక యాతన అనుభవిస్తున్నాడు. చూడండి" అని మనోహర్ రెండు ఫోటోలు జేబు నుండి తీసియిచ్చాడు.

ఆ ఫోటోల్లో—శరీరమంతా గాయాలతో రక్తసిక్త మైన ఉమామహేశ్వర్ స్థంబానికి తాళ్ళతోకట్టబడి దీనంగా తల వంచుకుని నిలబడి వున్నాడు....మరో ఫోటోలో— యెవరో కత్తిని గుండెలపై ఆనించి గీస్తుంటే రక్తం కారుతుండగా పళ్ళ బిగువున ఆ బాధ అనుభవిస్తూ కన్నీరు పెడుతున్నాడు. కత్తి పట్టిన చెయ్యి మాత్రమే వుంది. మనిషి కనిపించటంలేదు.

ఆ రెండు ఫోటోలు చూసిన ఊర్మిళ దిగ్భ్రాంతి చెందింది. "మామయ్యా!—" అని భోరున ఏడ్చి స్పృహతప్పి సోఫాలో పడిపోయింది.

"ఉమామహేశ్వర్ వల్ల మోసపోయిన రాణి — మీ అబ్బాయిమీద ఈ విధంగా పగ సాధిస్తోంది. మీరు చేసిన తప్పుకు మీ అబ్బాయి యెంత దారుణంగా నరకయాతన అనుభవిస్తున్నాడో చూశారా?....మీ అబ్బాయి మీకు దక్కుతాడనే ఆశ పెట్టుకోకండి. రాణి అతన్ని చంపే స్తుంది. మీ అదృష్టం బాగుంటే అతని శవమైనా ఎక్కడో చోట దొరుకుంది."

"వాడి శవం అప్పగించమని కాదు మీకు వాడిగురించి రిపోర్టు యిచ్చింది....వాడ్ని సజీవంగా అప్పగించడం మీ కర్తవ్యం."

"అసలు రాణి అతన్ని యెక్కడ బంధించిందో తెలి యడంలేదు. ఆచూకీ తెలిస్తే అతన్ని తప్పకుండా రక్షించ గలను."

"వాడి ఆచూకీ తెలియకుంటే మీకీ ఫోటోలు యెలా వచ్చాయి? రాణి వివరాలు మీకెలా తెలిశాయి?"

"టేప్‌రికార్డర్ వుందా?"

"ఉంది."

"యిలా తెండి!"

టేప్‌రికార్డర్ తెచ్చియిచ్చాడు వెంకటేష్.

ఇన్‌స్పెక్టర్ మనోహర్ తన ప్యాంట్ జేబులో వుంచు కొచ్చిన టేప్ తీసి టేప్‌రికార్డర్‌లో ఇన్‌సర్ట్ చేశాడు. దాన్ని ఆన్‌చేశాడు. కాసెట్‌లోంచి—రాణి అడిగిన ప్రశ్నలు—ఉమామహేశ్వర్ చెప్పిన సమాధానాలు.... వసుంధరను ఉమామహేశ్వర్—శోభనాద్రి అతని భార్య కలిసి చంపినట్లు తెలుపుతున్నాయి.

అత్త ముఖంపై నీళ్ళుచల్లగా కాసెట్ ఆన్‌చేసినప్పుడు స్పృహలోకి వచ్చిన ఊర్మిళ—అంతా వింది.

వసుంధర చావుకు కారణం తెలుసుకొని నిశ్చేష్టురా లైంది ఊర్మిళ.

రేపు, అడిగిన డబ్బు తేకుంటే తననుకూడా అలాగే చంపేస్తాడన్న ఊహరాగానే ఆమె గుండె భయాందోళన లతో వేగంగా కొట్టుకోసాగింది.

"శోభనాద్రిగారూ! .... మీ కోడల్ని కాల్చి చంపింది మీరు కాదా?"

శోభనాద్రి భయపడలేదు. పిచ్చిపట్టినవాడిలా వికటంగా నవ్వాడు.

"స్టాపిట్!"....అరిచాడు మనోహర్. "ఈ కాసెట్ - ఫోటోలు రాణి పోస్ట్‌లో పంపింది. ఈ ఉత్తరం రాణి రాసింది. చదవండి."

మనోహర్ యిచ్చిన ఉత్తరం శోభనాద్రి యిలా చదు వాడు.

"ఇన్‌స్పెక్టర్!—ఉమామహేశ్వర్ యెలా మాయ మయ్యాడో అని ఆలోచించి మీ బుర్ర బద్దలు కొట్టుకో కండి. ఉమామహేశ్వర్ చరిత్ర తెలియాలనే ముందుగా

మీకు కాసెట్—ఫొటోలు పంపించాను. కేసట్‌లోని విషయం మీకు బోధపడే ఉంటుంది.

"ఉమామహేశ్వర్‌ను ఎక్కడ బంధించానో మీకు తెలియనివ్వను. నన్ను మీరు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోలేరు. నా కసి తీర్చుకొని ఉమామహేశ్వర్‌ను అంతంచేసిన తరువాత నాకై నేనే మీకు సరండర్ అవుతాను.

కోడళ్ళను వేపుకు తిని వారి జీవితాలు అధోగతిపాలు చేసిన శోభనాద్రి....అతని భార్య యశోదమ్మ వీరి చావు ముహూర్తాలు త్వరలో పెట్టి హృదయం లేని పశువుల కంటె హీనంగా ప్రవర్తించే అత్తమామలకు కనువిప్పు కలిగేట్లు గుణపాఠం నేర్పుతాను.

వారిగురించి అనవసరంగా మీరు శ్రమ తీసుకోకండి - సెలవ్.

ఇట్లు—రాణి"

శోభనాద్రి ఏమీ చెప్పలేదు.

రాణి ఉత్తరంలోని విశేషాలు విన్న యశోదమ్మ హడలిపోయింది. "ఇన్‌స్పెక్టర్‌గారూ! .... ఆ రాణి మమ్మల్ని చంపేస్తుందేమో? మీరే రక్షించాలి" అని కళ్ళనీళ్ళు ఒత్తుకోసాగింది.

"నేను అందుకోసమే వచ్చాను. మీకు జైలుకంటె క్షేమమైన చోటు మరెక్కడా దొరకదు. వసుంధరను కాల్చి చంపినందుకు మీ ఇద్దరినీ అరెస్టు చేస్తున్నాను" అంటూ ఇన్‌స్పెక్టర్ మనోహర్ అరెస్ట్ వారెంట్ తీసి శోభనాద్రికి చూపాడు.

అరెస్టు మాట వినగానే యశోదమ్మ స్పృహ తప్పి పడిపోయింది.

6

టెలిఫోన్ మ్రోగింది.

మనోహర్ రిసీవర్ అందుకొని "ఎస్....ఇన్‌స్పెక్టర్ మనోహర్ హియర్...." అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్! .... రాయపేట హాస్పిటల్....వార్డ్ నెంబర్, 4—బెడ్‌నెంబర్ 12...."

"ఎవరు నువ్వు?....ఎవరిగురించి చెబుతున్నావ్?" అని అడిగాడు అవతలి వ్యక్తిని మనోహర్.

"నేనెవరైంది చెబుతాను....ముందు మీరక్కడికి....కి ...." అతని మాట కట్ అయింది.

"హలో....హల్లో!!...." ఆత్రుతగా అడిగాడు.

అతని మాటలు వినిపించలేదు. కాని, "రా....ణీ!?... నువ్వా?" అనడం వినిపించింది.

అంటే అతను రాణీ అనుచరుడై ఉంటాడని అర్థం చేసుకోడానికి ఎంతోసేపు పట్టలేదు మనోహర్‌కు. అతను యెవరి గురించో రాణీకి తెలియకుండా తనకు ఫోన్‌చేస్తుండగా అకస్మాత్తుగా రాణీ అతనిముందు ప్రత్యక్షమైయుంటుంది. తను రహస్యంగా ఫోన్‌చేయడం రాణీ చూసింది కనుక, ఆమెను చూసి ఆశ్చర్యపడి వుంటాడు. అవతలి వ్యక్తి ఫోన్ క్రెడిల్ చెయ్యలేదు. కనుక చెవులు రిక్కించి వారి సంభాషణ ఆసక్తిగా వినసాగాడు.

"ఎవరికి ఫోన్ చేస్తున్నావ్?" రాణీ కోపంగా అతన్ని అడుగుతోంది.

"నేను ఓ ఫ్రెండ్‌కి ఫోన్ చేస్తున్నాను."

"ఎవరా ఫ్రెండ్? ఇన్‌స్పెక్టర్ నీ ఫ్రెండా?"

"ఇ....న్....స్పెక్ట....రా!?—"

"షటాప్!—ఈ రాణీని మోసం చేస్తే ఏం చేస్తుందో

నీకు తెలుసా?"

"ప్రాణాలు తీస్తుంది."

"ఇన్‌స్పెక్టర్‌తో... బెడ్ నెంబర్ ట్వెల్వ్ అంటున్నావు ఏమిటి?"

"హాస్పిటల్లో....బెడ్ నెంబర్ ట్వెల్వ్‌మీద నా భార్య కారు ఆక్సిడెంట్‌కు గురియై...."

"యూ స్కౌండ్రల్: షటాప్!!—హాస్పిటల్ పేరు చెప్పు!"

"........"

"ఇక్కడి విషయాలు ఇన్‌స్పెక్టర్ మనోహర్‌కు చెప్పావుకదూ?....ఇన్‌స్పెక్టర్ యిక్కడికి వచ్చేసరికి నీ శవం అతనికి స్వాగతం చెబుతుంది. ప్లీజ్....డై!...."

రివాల్వర్ పేలిన చప్పుడుతోబాటు 'అబ్బా!'—అన్న గావుకేక విన్పించింది. రిసీవర్ క్రిందికి జారిన శబ్దం....

ఇంకా రెండుమూడు నిమిషాలు రాణి ఆ గదిలోకి రాకుండా వుంటే—రాణి రహస్యమంతా చెప్పేసేవాడేమో ఆ వ్యక్తి. ఆ అవకాశం దొరికినట్టే దొరికి జారిపోయింది. రాణి అతన్ని చంపేసింది.

ఆ టెలిఫోన్ కాల్ ఎక్కడ్నించి వచ్చిందో తెలుసుకోగోరి, వెంటనే టెలిఫోన్ ఎక్స్‌ఛేంజికి రింగ్‌చేసి, ఆపరేటర్‌ని అడిగాడు.

"ఆపరేటర్!—యిప్పుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కాల్ ఎక్కడించి?"

"మౌంట్‌రోడ్—ఫోన్ నెంబర్ 21173...."

"నాకు పూర్తి అడ్రసు కావాలి."

"మణిమాధవన్, మౌంట్‌రోడ్, థర్డ్‌క్రాస్ స్ట్రీట్, హౌస్ నెంబర్—23."

మనోహర్ మోటార్ బైక్ మీద పదిహేను నిమిషాల్లో ఆ యింటిముందు ఆగారు. ఆ ఇంటికి పెద్ద తాళంకప్ప వ్రేలాడుతుంది. మనోహర్ ఆశ్చర్యచకితుడయ్యాడు. అక్కడ యెవ్వరు లేరు. పదిహేను నిమిషాల్లోనే రాణి తప్పించుకు వెళ్ళిపోయింది. మరి, తనకు ఫోన్ చేసిన వ్యక్తి శవం ఆ యింట్లోనే వుందా?....ఆ వ్యక్తి ఫోన్ చేశాడని తెలిసి, తనకోసం పోలీసులు వస్తారని, శవాన్ని తీసుకొని యెలా వెళ్ళి వుంటుంది?....

పోలీసులు వచ్చారని ప్రక్కిళ్ళలో ఉన్నవారు బయటకి వచ్చి చూడసాగారు. ఆ యింటికి యెదురుగా చెట్టుక్రింద బీడీ బంకు వుంది. ఆ బంకులో ఒక ముసలాయన కూర్చుని వార్తాపత్రిక తిరగేస్తున్నాడు.

"ఏమయ్యా!—ఆ ఇంటికి బీగం వేసివుంది. ఆ ఇంటి వాళ్ళు ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు ముసలతనిని.

"ఆ ఇంటివాళ్ళు తీర్థయాత్రలకి వెళ్ళారు బాబూ!...."

ఆశ్చర్యపడ్డాడు మనోహర్.

"ఎప్పుడు వెళ్ళారు?"

"వారం రోజులైంది."

"ఆ యింట్లో ఎవరుంటున్నారు?"

"మణిమాధవన్....కమీషన్ వ్యాపారం."

"ఈ ఇంటి ఫోన్ నెంబర్ నీకు తెలుసా?"

"ఎందుకు తెలియదు సార్?....21173."

"ఆ ఇంటికి అటు-యిటు వున్నవాళ్ళను అడిగి రా రాజూ!" అని హెడ్ కానిస్టేబుల్ రాజును పంపించి, సిగరెట్ వెలిగించుకొని ఆలోచించసాగాడు బంక్ యెదురుగా నున్న స్టూలుమీద కూర్చొని మనోహర్.

అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు రాజు.

"ఈ బంకాయన చెబుతున్నది నిజమేసార్....వాళ్ళు కూడా అలాగే చెబుతున్నారు."

అది రాంగ్‌కాల్ అనుకోడానికి వీలులేదు. అడ్రస్, ఫోన్ నెంబర్ కరెక్టుగా వుంది. వారం రోజులనుండి తాళం వేసియున్న ఈ యింట్లోంచి తనకు ఫోన్ యెలా వచ్చింది?....అంతా కన్‌ఫ్యూజింగ్‌గా వుంది.

"ఏమయ్యా! ఈ 23 నెంబర్ యింట్లో మణిమాధవన్ కాపురముంటున్నాడా?"

"అవును సార్."

"పై మేడగది అతనే వుపయోగించుకొంటున్నాడా? ఎవరికయినా అద్దెకిచ్చాడా?"

"ఇంట్లోవాళ్ళే వుపయోగించుకొంటున్నారు. వెనుక భాగం అద్దెకిచ్చారట."

"ఇది టూ ఫేస్ హౌసా?"

"అవును సార్."

"ఆ యింటి నెంబరు కూడా 23...."

"అవును."

"రెండు యిళ్ళకు ఒకే నెంబరు యెలా వుంటుంది?"

"అది సపరేట్ పోర్షన్ అని తెలిస్తే-యిల్లు అద్దెకిచ్చినందుకు కార్పొరేషన్‌వాళ్ళు హౌస్‌టాక్స్ ఎక్కువ వేస్తారని-అంతా ఒకే యిల్లుగా నెంబర్ వేయించి ఉంటాడు సార్."

"ఐ సీ-అవతలి యింటికి దారి యెటు?"

"అవతలి వీధిలోకి వెళ్లాలి."

మనోహర్, రాజు ఆ వీధి దాటి అవతలి వీధిలోంచి ఆ యింటి దగ్గరకు వచ్చారు. ఆ యింటికి నెంబరు లేదు. అంటే ఆ ముసలాడు చెప్పినట్లు ఈ యిల్లు అవతలి వీధి

లోకి లెక్క. అందుకే నెంబర్ వేసి వుండదు.

మనోహర్, రాజు ఆ యింటి ముందు నిలుచోగానే, అప్పుడే సైకిల్ మీద వచ్చిన ఓ వ్యక్తి వీళ్ళను చూసి ప్రక్క యింట్లోకి వెళుతున్నవాడల్లా ఆగాడు. "ఎవరి కోసం వచ్చారు సార్?" అని అడిగాడు.

"ఈ యిల్లు యెవరిది?"

"మణిమాధవన్‌ది....ఈ పోర్షన్ అద్దెకిచ్చాడు."

"ప్రస్తుతం ఈ యింట్లో యెవరుంటున్నారు?"

"చెప్పుకుంటే సిగ్గుచేటు సార్....సంసారాలు చేసే యిళ్ళ మధ్య ఓ సాని యింట్లో వుంటోంది. అద్దెకు ఆశ పడి మణిమాధవన్ ఎవరికీ నచ్చని పని చేశాడు. ఎప్పుడూ ఓ రౌడీగాంగ్‌తో ఆ పిల్ల!....ఛీ....ఛీ!....దయచేసి ఆ ముండని ఈ వీధిలో లేకుండా చెయ్యండి సార్....ఈ ఏరియా ఎస్. ఐ....ఎన్నిసార్లు రిపోర్ట్సు యిచ్చినా వీరి గురించి పట్టించుకోవటం లేదు. ఆ రౌడీగాంగ్....ఎస్.ఐకి మామూళ్ళు యిస్తుందట!"

"అతని గురించి నేను ఏక్షన్ తీసుకుంటాను. ఈసాని రౌడీగాంగ్‌ను అరెస్ట్ చేస్తాను. ఆ అమ్మాయి పేరేమిటి?"

"వెరీ నైస్ నేమ్....రోజారాణి!...."

"తలుపులు దగ్గరగా వేసి వున్నాయి....రాణి లోపల వుండొచ్చు సార్" అన్నాడు రాజు.

మనోహర్ అటు చూశాడు. తలుపుకు తాళం లేదు. దగ్గరగా వేసి వుంది.

"ఈ ఇంటికి మరో ద్వారం వుందా?" సైకిల్ పట్టుకుని నిల్చున్న మనిషిని అడిగాడు మనోహర్.

"ఇటు ప్రక్క మరో వాకిలి వుంది సార్" చూపించాడా వ్యక్తి.

"రాజూ! నువ్వటు వెళ్ళి వాకిలి దగ్గిర నిలుచో!.... నేను లోపలికి వెళతాను. ఆ వాకిట్లోంచి వాళ్ళెవరు రాకుండా బయటినుండి గొళ్ళెం పెట్టి నువ్వూ లోపలికి రా! క్విక్ వెళ్ళు!" అని మనోహర్ రెండంగల్లో మెయిన్ తలుపు దగ్గిరికి వెళ్ళి రివాల్వర్ చేతబట్టి తలుపుల్ని కాలితో తన్నాడు. రెండు రెక్కలు విడిపోయి ఫట్ - ఫట్ మని శబ్దం చేశాయి.

"జాగ్రత్త! లోపల యెవరున్నారో వెంటనే వచ్చి లొంగిపోండి! ఎదిరించడానికి సాహసించారా?....కాల్చేస్తాను....నేను ఒన్-టూ-త్రీ—చెప్పేలోగా మీరు నా ఎదురుగా రావాలి....ఎస్....వన్!...టూ!!....త్రీ!!!..." అని రివాల్వర్ సూటిగా పెట్టి పొజిషన్‌లో నిలబడ్డాడు మనోహర్.

ఆదేశించినట్లు యెవ్వరూ రాలేదు. అంటే? - లోపల యెవ్వరూ లేరా?....రోజారాణి కూడా లేదా?.... లేకుంటే ఎదురుగా రాకుండా యెక్కడయినా నక్కి. తనను మోసం చేసి పారిపోవాలని చూస్తున్నారా?.... అసలు మనుష ఉన్న శబ్దమే లేదు. ఏమయ్యారు?

మనోహర్ ధైర్యంచేసి లోపలికి వెళ్ళాడు. మొదటి గదిలో యెవ్వరూ లేరు. రెండో గదిలో అడుగు పెట్టాడు. కిటికీలు లేని ఆ గది చీకటిగా వుంది.

గోడకున్న స్విచ్ నొక్కబోయాడు. చీకటిలోంచి ఓ కర్ర దూసుకు వచ్చి రివాల్వర్ పట్టుకున్న మనోహర్ చేతిమీద పడింది. రివాల్వర్ జారిపోగా గిరుక్కున ముందుకు తిరిగాడు.

మరుక్షణంలో మనోహర్ ముఖంపై పిడిగుద్దు పడింది. మనోహర్ వెనక్కి పడబోతూ ఒక కాలుమీద

గిర్రున తిరిగి, ముందుకు తూలి గబుక్కున స్విచ్ నొక్కాడు. ఆ గదిలో లయిటు వెలిగింది.

చెంపమీద నల్లని గాటు వున్న వ్యక్తి క్రూరంగా చూస్తూ గంభీరంగా నిలుచున్నాడు. అతని చేతిలో రివాల్వర్ మిల మిల మెరుస్తోంది. మరుక్షణంలో యిద్దరు వ్యక్తులు వచ్చి నిల్చున్నారు.

"ఇన్‌స్పెక్టర్! నువ్వింత త్వరగా వస్తావని మే మనుకోలేదు. మాతో చెలగాటమాడితే రాముడికి పట్టిన గతే నీకు పడుతుంది."

"రాము డెవరు?"

"రాణిని మోసంచేసి నీకు ఫోన్ చేసినవాడు....మర్యాదగా తప్పుకో! మేము వెళ్ళిపోతాం."

"నా రివాల్వర్ నువ్వు స్వాధీనం చేసుకున్నావు. అందులో గుళ్ళున్నాయని ధైర్యంగా నన్ను యెదిరించి పారిపోవాలని ప్రయత్నం చేస్తున్నావు. అందులో గుళ్ళు లేవు. కాల్చి చూడు!....నేను చస్తే అందులో గుళ్ళు వున్నట్లే."

అతను అనుమానంగా రివాల్వర్‌కేసి చూశాడు తల వంచి. చాలు. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తూన్న మనోహర్ ఎగిరి బూటు కాలుతో తన్నాడు. మనోహర్ బూటుకాలు అతని గుండెలపై బడింది. అతను తలెత్తి చూసేలోగా - ఎగిరి రెండు కాళ్ళతో తన్నాడు. ముగ్గురు వెల్లకిలా బడ్డారు.

పయిన అటకమీద కూర్చున్న వ్యక్తి కర్రతో బలంగా మనోహర్ తల మీద కొట్టాడు. మనోహర్ కళ్ళు పచ్చబడ్డాయి. అలాగే నేలకొరిగిపోయాడు. ముగ్గురూ బయటికి గెంతి పలాయనం చిత్తగించారు.

అటకమీద కూర్చున్న వ్యక్తి క్రిందికి దిగి పరిగెత్తా లనుకునేసరికి కాస్త ఆలస్యమైంది. ప్రక్క వాకిలిగుండా యెవరూ బయటికి రాకపోయేసరికి తలుపుకు గొళ్ళెం పెట్టి యిటు వచ్చిన రాజుకు ఆ వ్యక్తి లోపలి నుండి పరుగెత్తుకు రావడం కనిపించేసరికి రాజు అతని కాళ్ళకు చేతి కర్ర అడ్డం వుంచాడు. ఆ వ్యక్తి క్రింద పడ్డాడు నరికిన వృక్షంలా. వెంటనే రాజు అతని వీపుమీద కూర్చొని మెడ నరాలమీద కొట్టాడు. ఆ వ్యక్తి మళ్ళా కదలకుండా స్పృహ తప్పాడు.

అక్కడ జరుగుతున్న వింతకు వీధిలోని వాళ్లు యింటి ముందు ప్రోగయ్యారు.

"యెవరయినా ఓ తాడు తెచ్చి యివ్వండి. ఈ రౌడీ రాస్కెల్‌ను కట్టిపడేస్తాను" అని జనాన్ని చూసి అడిగాడు రాజు.

ప్రక్కయింటి వ్యక్తి పరుగున యింట్లోకి వెళ్ళి తాడు తెచ్చి యిచ్చాడు రాజుకు. రాజు వెంటనే అతని కాళ్లు చేతులు కట్టి పడేసి యింట్లోకి వెళ్లాడు.

మనోహర్‌కు అప్పుడే స్పృహ వస్తోంది. రాజు ఆశ్చరంగా "సార్!....సార్!!" అంటూ దగ్గరికి వెళ్ళి పిలిచాడు. "ముగ్గురు పారిపోయారు సార్!.... ఒక్కడ్ని స్పృహ తప్పించి కట్టి పడేశాను" అన్నాడు.

"గుడ్. మంచి పని చేశావు. రోజారాణి మనం వచ్చేసరికి వెళ్ళిపోయింది. కాస్త ఆలస్యం చేసివుంటే వీళ్ళు కూడా వెళ్ళిపోయి వుండేవారు. ముగ్గురు తప్పించుకున్నా ఒక్కడయినా దొరికాడు. వాళ్ళ అంతు చూస్తాను" అని మనోహర్ లేచి అవతలి గదిలోకి వెళ్ళాడు.

రెండు పోర్షన్స్‌కు మధ్య నున్న గది అది. దాని ప్రక్కన కిటికీ ఊచలు వంచబడి వున్నాయి. అంటే మణిమాధవన్ ఊరికి వెళ్లాక కిటికీ కడ్డీలు వంచి అవతలి యింట్లోకి వెళ్ళి, అవతల వేసివున్న తాళం బద్దలు కొట్టి మధ్య తలుపు తెరిచి వుంటారు. తలుపులు త్రోశాడు. అవి తెరుచుకున్నాయి.

డ్రాయింగ్‌రూమ్‌లో టెలిఫోన్ వుంది. దగ్గరికి వెళ్ళాడు. రాణి రివాల్వర్‌తో ప్రేల్చి చంపిన వ్యక్తి శవం వెల్లకిలా పడివుంది. ఆ టెలిఫోన్ మీద 21173 నెంబరు కనిపించింది.

మనోహర్‌కి అంతా అర్థమైపోయింది.

మనోహర్ అక్కడ్నించి రోజారాణి వుంటున్న మూడు గదుల్లో ఆమెకు సంబంధించిన ఆనూకీ దొరుకు తుందేమోనని చూశాడు. ఆ గదిలో గూటిలో కొన్ని పుస్తకాలు....నీళ్ళకూజా-గ్లాసు...కాఫీ ఫ్లాస్కు వున్నాయి. గది నిండా సిగరెట్ పీకలు....గీసిన అగ్గిపుల్లలు.... కుప్పలు కుప్పలుగా వున్నాయి.

అంటే-తన కార్యక్రమం అయిపోయేవరకు తాత్కాలి కంగా ఆ యిల్లు అద్దెకు తీసుకున్నట్లు అర్థమవుతుంది.... రెండో గది మాత్రం రాణి పడకగదిలా వుంది. ఓ నవారు మంచం-పరుపు- తలగళ్ళు-దుప్పటి మంచంమీద పరచి వుంది. మంచం ప్రక్క అలమైరాలో స్నో, సెంట్, పౌడర్, ఖరీదైన సబ్బులు, అద్దం వున్నాయి.

పుస్తకాలు వున్న అల్‌మైరా దగ్గిరికి వచ్చి, కొన్ని పుస్తకాలు గబగబా తిరగవేశాడు. రెండు మూడు పుస్త కాలు చేతికి తీసుకున్నాడు....ఎందుకో అతని ముఖంమీద చిరునవ్వు వెలిసింది.

"రాజా! - ప్రక్కింటిలో ఫోన్ వున్నట్లుంది. వెళ్ళి స్టేషన్‌కు ఫోన్ చెయ్యి. కానిస్టేబుల్స్‌ని తీసుకొచ్చి లోప లున్న శవాన్ని మార్చురీకి పంపమను....ఈ రౌడీవెధవను లాకప్‌లో వుంచమను....తర్వాత ఇంటికి సీలు వేయించి యిక్కడ నలుగుర్ని కాపలా వుంచమని చెప్పు! నేను అర్జంటుగా రాయపేట హాస్పిటల్‌కు వెళ్ళిరావాలి. అంత వరకు నువ్వు యిక్కడే వుండు" అని మనోహర్ రాయ పేట హాస్పిటల్‌కు బయలుదేరాడు.

పది నిమిషాల్లో రాయపేట హాస్పిటల్ చేరుకున్నాడు మనోహర్.

వార్డ్ నెంబర్. 4, బెడ్ నెం. 12 దగ్గిర ఆగాడు. బెడ్ మీద యెవరు లేరు. అది ఖాళీగా ఉంది. అప్పుడే ఒక స్టాఫ్ నర్స్ అటు వెళుతూ మనోహర్‌ను చూసి ఆగింది· "నర్స్:—ఈ బెడ్ ఎప్పటి నుండి ఖాళీగా వుంది?" అని అడిగాడు మనోహర్.

"గంట నుండి."

"అంతక్రితం ఈ బెడ్ మీద యెవరున్నారు?"

"ఉమామహేశ్వర్...."

అతను నర్సుకేసి ఆశ్చర్యంగా, ఆతృతగా చూశాడు, "అతడు ఏమయ్యాడు నర్స్?"

"పాపం!....అతను చనిపోయాడు."

"చనిపోయాడా?....అతనికేమైంది?"

"శరీరమంతా చిత్రవధ చెయ్యబడింది. యెవరో దుర్మార్గులు అతన్ని చాలా ఘోరంగా గాయపరిచారు. అతని రక్తమంతా పోయింది .... అక్కడికీ రక్తం ఎక్కించాం. బాడ్‌లక్. అతను పోయాడు సార్!"

"అతన్ని యిక్కడికి యెవరు తెచ్చి అడ్మిట్

చేశారు!"

"ఎవరో రాముడనే వ్యక్తి నిన్న రాత్రి 12 గంటలకు టాక్సీలో తెచ్చి అడ్మిట్ చేశాడు. అతని ప్రాణాలు రక్షించమని ప్రాధేయపడ్డాడు. బ్లడ్ బాంక్‌లో అతని గ్రూప్ బ్లడ్ స్టాకు లేకుంటే యెక్కడ్నుంచో రక్తం సీసాలు తెచ్చాడు."

"నర్స్!—ఉమామహేశ్వర్‌ను అలా చిత్రవధ చేసిం దెవరో చెప్పాడా?"

"చెప్పాడు. యెవరో రోజారాణి అట....మౌంట్ రోడ్‌లో ఉందట!...."

"ఆమె అతన్ని అలా చేయడానికి కారణం చెప్పాడా?...."

"ఏదో ప్రేమ వ్యవహారం అన్నాడు....రాముడు మళ్ళీ రాలేదు. మీకు అతను తెలుసా సార్."

"అతన్నికూడా చంపేసింది రోజారాణి."

"ఓ మైగాడ్!....ఎంత కిరాతకురాలు ఆ రోజారాణి!"

"నర్స్!....అతని డెడ్‌బాడీ ఎక్కడుంది?"

"మార్చురీలో ఉంచాము. రండి సార్. చూపిస్తాను."

మనోహర్ నర్స్‌వెంట నడిచాడు.

7

"సిద్ధేశ్వరరావు ఉన్నారా?" సులోచనని అడిగాడు మనోహర్.

"లేరు."

"ఎక్కడికి వెళ్ళారు?"

"ఆఫీసుకు వెళ్ళారు."

"నువ్వు యిప్పుడిప్పుడే బయటికివెళ్ళి వచ్చినట్లున్నావు.

ఎక్కడ్నించి వస్తున్నావో తెలుసుకోవచ్చా?"

"అవసరమైన పనిమీద సిటీకి వెళ్ళి వస్తున్నాను."

"నువ్వే పనిమీద వెళ్ళివచ్చావు?"

సులోచన కోపంగా చూసింది.

"ఇన్‌స్పెక్టర్!?—మా యింటికి వచ్చి వెళ్ళిన ఉమా మహేశ్వర్ కనిపించలేదని మీరు నన్నూ, మావారిని నేరస్థులుగా చెయ్యాలని ప్రయత్నం చేస్తున్నట్లున్నారు. అతను ఏమయ్యాడో తెలుసుకోవడం మీ విధి."

"తెలుసుకున్నాను .... ఉమామహేశ్వర్ ఘోరంగా హత్యకాబడ్డాడు. అతను రాయపేట హాస్పిటల్లో చని పోయాడు. ఉమామహేశ్వర్ యిక్కడికి వచ్చిన రాత్రి 'మెర్లిన్ మన్రో'—యింగ్లీషు నవల యిక్కడే వదిలి వెళ్ళినట్లు చూశాను. ఆ పుస్తకంతో అవసరముంది, యిస్తారా?"

"ఐయామ్ సారీ!....ప్రస్తుతం ఆ పుస్తకం నా దగ్గర లేదు. మా ఇంటికి వచ్చిన మా వారి ఫ్రెండ్స్ యెవరో పట్టుకెళ్ళినట్లున్నారు."

"ఎవరు తీసికెళ్ళారో చెబుతారా?"

"పుస్తకం కనిపించకుంటే యెవరో తీసుకెళ్ళినట్లు న్నారు అనుకుంటున్నాను. యెవరు పట్టుకెళ్ళారో నేను చూడలేదు."

"రోజారాణి యిక్కడికి వచ్చిందా?"

"రోజారాణి యెవరు?"

"ఉమామహేశ్వర్‌ను చిత్రవధ చేసి చంపిన హంతకి!"

"ఆమె యెవరో అతన్ని చంపితే—యిక్కడికెందు కొచ్చారు."

"ఈ పుస్తకం నీకు చూపిద్దామని" అని, మనోహర్

తనవద్ద నున్న పుస్తకం చూపించాడు.

సులోచన ఆశ్చర్యంగా చూసింది. అది మెర్లిన్ మన్రో పుస్తకం.

"ఆ పుస్తకం మీ కెక్కడ దొరికింది?"

"రోజారాణి యింట్లో!....దీన్నిబట్టి రోజారాణి నీ స్నేహితురాలు అయివుంటుందని-ఆమెగురించిన వివరాలు నువ్విప్పిస్తావని వచ్చాను. చెప్పు సులోచనా?....రోజా రాణి యెవరు? ఆమె ఎక్కడుంటుంది?"

"నిజంగా ఆమె యెవరో నాకు తెలియదు. ఇక్కడి పుస్తకం ఆమెకెలా చేరిందో అర్థం కావడంలేదు. ఇదంతా ఏదో మాయగారడిలా కనిపిస్తుంది నాకు."

"మాయగారడి చేస్తున్నదెవరో కాదు నువ్వే?"

"నే....నా?...."

"అవును సులోచనారాణీ:....ఉమామహేశ్వర్‌పై పగ బట్టి అతన్ని చిత్రవధ చేసి చంపిన రోజారాణివి నువ్వే"

సులోచన కంగారుపడింది.

"అబద్ధం!....నాపేరు సులోచన:"

జేబులోంచి ఓ ఫోటో తీసి, "ఈ ఫోటో ఎవరిది?" అని అడిగాడు.

"అది నా ఫోటో! కాదనను!!"

"రాణీ—నువ్వేనన్న విషయం యిక కాదనలేవు. ఈ ఫోటో రోజారాణి ఇంట్లో దొరికింది. ఉమామహేశ్వర్‌ను ప్రేమించి మోసపోయిన రాణిగా అతని ఫాదర్ ఈ ఫోటోను గుర్తించి—అతని కొడుకును మాయంచేసిన రాణి ఈమే అన్నాడు. నీ అసలుపేరు సులోచనారాణి. ఉమామహేశ్వర్ నిన్ను 'రాణీ!'—అని ముద్దుగా సంబో

ధించేవాడు. అందుకే రాణిగా నాకు ఉత్తరం వ్రాసి, ఫోటోలు, కాసెట్ పంపించావు.

"రోజూ అతన్ని చిత్రవధచేస్తూ అతన్ని నరకయాతన పెట్టేదానివి....నువ్వు పూర్తిగా అతని ప్రాణాలు తీయాలని సంకల్పించిన రోజు—నీ కా అవకాశం యివ్వకుండా రాముడు అనే నీ అనుచరుడు, మానవత్వం వున్న మనిషిగా అతనిమీద జాలిపడి నీకు తెలియకుండా, చిత్రవధ కాబడి ప్రాణాపాయ స్థితిలోవున్న ఉమామహేశ్వర్ ను తీసుకువెళ్ళి రాయపేట హాస్పిటల్లో జాయిన్ చేశాడు. అతన్ని రక్షించాలని ఎంతో శ్రమపడ్డాడు....ఆ విషయం నాకు ఫోన్ చేస్తుండగా, మండిపడి అతన్ని షూట్ చేసి చంపావు.

ఇంతవరకు పోలీసులు నిన్ను అనుమానించలేదని అనుకున్నావు గనుక—ధైర్యంగా వుంటున్నావ్. సులోచనా రాణీ!—తప్పించుకోడానికి ప్రయత్నంచేసి లాభంలేదు. నేరాన్ని అంగీకరించి పోలీసులకు లొంగిపో!"—అన్నాడు గంభీరంగా.

మనోహర్ మాటలు విని సులోచనారాణి ఆశ్చర్యపడినా భయాందోళనలతో కొయ్యబారిపోలేదు. రహస్యం బట్టబయలయ్యాక అజ్ఞాతంగా ఉండడానికి ప్రయత్నం చేసినా ప్రయోజనం లేదనుకుంది. ఉమామహేశ్వర్ ప్రాణాలు తీయాకపోయినా, చిత్రహింసలకు తట్టుకోలేక రక్తమంతా కోల్పోయి ప్రాణాలు వదిలాడు. అతడు చచ్చాడు. తన వల్లనే అతని ప్రాణాలు పోయాయి. అతనిపై పగ సాధించింది. ఆమె మనసులోని ప్రతిజ్ఞ నెరవేరింది. ఆమె కోరుకున్నది—తన్ను మోసంచేసిన వాడి ప్రాణాలు తీయడం.

"ఇన్స్పెక్టర్‌గారూ!—నా జీవితం అధోగతిపాలు కావ

డానికి కారణం ఉమామహేశ్వర్. నన్ను ప్రేమించి నా యౌవనంతో ఆడుకొని, నన్ను ఆటవస్తువుగా భావించాడు. తల్లిదండ్రులు నా దిగులుతోనే పోయారు. ప్రపంచంలో ఏకాకినై పోయాను. జీవించే మార్గంలేక వ్యభిచారిణి అయ్యాను.

కాని, ఇన్‌స్పెక్టర్!—నా జీవితంతోబాటు వసుంధర జీవితం కూడా నాశనం చేయడంతో నాలో పగ మరింత విజృంభించింది. కఠిన శిలనై పోయాను. కట్నాలకోసం భార్య, కోడళ్ళని—రాచిరంపాన పెట్టి పైశాచికంగా ప్రవర్తించే భర్తలకు—అత్తామామలకు కనువిప్పు కలగాలంటే—ఉమామహేశ్వర్, అతని తల్లిదండ్రులు బ్రతకకూడదు.

ముందు ఉమామహేశ్వర్‌ను, తర్వాత శోభనాద్రి—యశోదమ్మలను చిత్రవధ చేసి చంపాలనుకున్నాను. వారి చావు ముహూర్తాలు నిర్ణయించాను. కాని, యింత తొందర్లో మీరు నన్ను పట్టుకుంటారని అనుకోలేదు. నేను నేరస్థురాలిని!....నేను చేసిన నేరాలను హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను....కాని, ఒక్కమాట!—"

"ఏమిటి?"

"సిద్ధేశ్వరరావు నా భర్తకాదు. విటుడు....ఈ కేసుకు అతనికేమీ సంబంధంలేదు. ఆరోజు ఉమామహేశ్వర్‌ను యింటికి తెచ్చాడు. నన్ను చూసిన ఉమామహేశ్వర్ నిర్ఘాంతపోయాడు. వెంటనే వెనక్కితిరిగి వెళ్ళబోయాడు. సిద్ధేశ్వరరావు ఆశ్చర్యపోయాడు. మాకు పూర్వ పరిచయం ఉందని తెలియని సిద్ధేశ్వరరావు అతన్ని ఆపడానికి ప్రయత్నం చేశాడు. అతను మనసు బాగాలేదు ఉండలే

నని వెళ్ళబోయాడు. సిద్ధేశ్వరరావు సెంటర్‌కు వెళ్ళి టాక్సీ ఎక్కించి వచ్చిన మాట నిజం. అతనికేమీ తెలియదు. ఉమామహేశ్వర్‌ను సాయంత్రానికి తీసుకువస్తానని సిద్ధేశ్వరరావు ముందే చెప్పి వుండటంవల్ల—రాత్రికి అతన్ని బంధించడానికి నలుగురు రౌడీలను నియమించాను. అంబత్తూరు దాటిన తరువాత టాక్సీ ఆపి ఆ రౌడీలు అతన్ని బంధించారు.''

''నన్ను గాయపర్చాలని చూసిన ఆ రౌడీ వెధవలు ఎక్కడున్నారు?''

''రాత్రి 10 గంటలకు మౌంట్ రోడ్‌లో వున్న 'రైజింగ్‌స్టార్స్'—క్లబ్బులో వుంటారు.''

''పదండి!!—'' అని ముందుకు నడిచింది సులోచనా రాణి!....రోజారాణి!!!....రాణి!!!....

మనోహర్ తృప్తిగా నవ్వుతూ జీప్ స్టార్ట్‌చేశాడు. □

ధర్మం!



నిధి నీకోసం

ఎమ్. రాధిక

పేపరు చదువుతున్న ఆ వ్యక్తి దృష్టి హఠాత్తుగా ఒక ప్రకటన మీద పడి ఆగిపోయింది.

“మీరు తీరని సమస్యలతో బాధపడుతున్నారా? విచారంతో క్రుంగిపోతున్నారా? మీ జీవితం సంతోషం, ఉల్లాసం లేకుండా నిస్సారంగా వుందా? అయితే వెంటనే

వినాయకరావును సంప్రదించండి."

ఆ ప్రకటన క్రిందే వినాయకరావు అడ్రస్ కూడా వుంది.

ఆ ప్రకటన చదవగానే ఆ వ్యక్తి కళ్ళు విచిత్రంగా మెరిశాయి. అనుమానం తీర్చుకోవడానికి మళ్ళీ ఒకసారి చదివాడు.

ఈసారి అతని పెదవులమీద చిరునవ్వు వెలిసింది.

తాగుతున్న సిగరెట్‌ను అవతల పారేసి, కుర్చీలోంచి లేచాడు.

పేపర్లో అడ్రస్‌ను మరోసారి మనసులోనే మననం చేసుకుని ఎక్కడికో బయలుదేరాడు ఆ వ్యక్తి.

2

పంజాగుట్టనుంచీ బ్లూమూన్ హోటల్‌కు వెళ్ళే దారిలో ఉంది వినాయకరావు ఇల్లు.

కర్నల్‌రాజారావు ఆ యింటిముందు స్కూటర్ ఆపి లోపలికి నడిచాడు.

హాలులో వున్న కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్న ఒక వ్యక్తి కనిపించాడతనికి.

"హలో గుడ్‌మార్నింగ్. నా పేరు రాజారావు. కర్నల్ రాజారావు" అంటూ తనని తను పరిచయం చేసుకున్నాడు రాజారావు.

"మార్నింగ్. రండి. నా పేరు వినాయకరావు" పేపరు మడిచేసి ఆహ్వానించాడు ఆ వ్యక్తి.

రాజారావు కుర్చీలో కూర్చున్నాక బోయ్‌ని కాఫీ తెమ్మని చెప్పి "ఆ. ఇప్పుడు చెప్పండి. మీకున్న సమస్య ఏమిటో?" కుర్చీలోంచి ముందుకు వంగి అడిగాడు వినాయకరావు.

కర్నల్ రాజారావు పొడి దగ్గు దగ్గి "మిస్టర్ వినాయక రావ్ నాకు ప్రత్యేకంగా సమస్య అంటూ ఏమీ లేదు. రెండేళ్ళ క్రితం వరకు నేను మిలటరీలో పని చేశాను. రిటైరయ్యిన దగ్గిర్నుంచీ ఇక్కడే వుంటున్నాను. నాకు వెనుకా ముందూ ఎవ్వరూ లేరు. ఆస్తిపాస్తులు బాగానే వున్నాయి. వూరికే తిని కూర్చోవటంవల్ల నాకేం తోచటం లేదు. జీవితం మెకానికల్‌గా, నీరసంగా అనిపిస్తోంది" అన్నాడు.

వినాయకరావు అతని వంక సాలోచనగా చూసి "అంటే సంతోషం, ఉద్రేకం, ఎదుగూ బొదుగూ లేకుండా జీవితం చప్పగా ఉందంటారు. అంతేనా?" అన్నాడు.

"అంతేననుకుంటాను."

"మిలటరిలో వున్నప్పుడు మీకు అడుగడుగునా ఏదో సాహసకార్యమో ప్రమాదమో ఎదురౌతూండేది. వాటిని ఎదుర్కోవడంలో మీ కొక ఉత్తేజం, ఉల్లాసం కలుగుతుండేవి. ఇప్పుడలాంటివేమీ లేకపోయేసరికి మీకు డల్‌గా అనిపిస్తోంది. అంతే తేడా. అన్నట్టు మీ వయస్సెంత?"

"నలభై."

"అంత వయసున్నట్లు కనిపించరు. ముప్పయి ఏళ్ళంటే ఎవరయినా సులభంగా నమ్మేస్తారు."

"థాంక్స్" రాజారావు పొంగిపోతూ చెప్పాడు.

"అయితే, మీరు మళ్ళా జీవితంలో సాహసవంతమైన సంఘటనలు ఎదుర్కొనడానికి ఇష్టపడుతున్నారా?"

"అలాంటివంటే నాకెంతో యిష్టం. కానీ ఈ హైదరాబాద్‌లో అడ్వంచర్ ఏముంటుందా అని ఆలోచిస్తున్నాను"

"అలా అనకండి. అడ్వంచర్ అనేది మనం క్రియేట్

చేసుకోవడంలో ఉంటుంది. అయితే ఒక విషయం. ఇలాంటి సంఘటనల్లో ప్రమాదం పొంచి వుంటుంది" అన్నాడు వినాయకరావు హెచ్చరిస్తున్నట్లుగా.

"ఏం ఫరవాలేదు. యుద్ధరంగంలో అలాంటి ప్రమాదాలు ఎన్నో ఎదుర్కొన్నాను. అన్నట్లు మీ ఫీజు?"

"మీ సమస్యని పరిష్కరించడానికి నేను వెయ్యిరూపాయలు తీసుకుంటాను. ఒక నెల రోజులు పోయినతర్వాత కూడా మీకింకా జీవితం ఇప్పటిలాగానే డల్‌గా అనిపిస్తే మీ డబ్బు వాపసు చేస్తాను. సరేనా?"

"ఎక్సెలెంట్" అని పర్సులోంచి డబ్బు తీసి ఫీజు చెల్లించి, చిరునామా యిచ్చి వెళ్ళిపోయాడు కర్నల్ రాజారావు.

వినాయకరావు ఆలోచనల్లో మునిగి పోయి అలానే కూర్చుండిపోయాడు. హఠాత్తుగా ఏదో తట్టినట్టయి ఫోన్ రిసీవరెత్తి ఎవరితోనో మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

ఇప్పుడతని ముఖంలో చెప్పలేనంత రిలీఫ్ కనిపించింది.

మర్నాడు ఉదయం కర్నల్ రాజారావుకు వినాయకరావు దగ్గిర్నుంచి ఫోన్ వచ్చింది.

"ఎల్లుండిఉదయం 11 గంటలకు కూకట్‌పల్లి వెళ్ళండి. హైవేకి ఎడమ వైపున ఒక చిన్న రోడ్డుంది. ఆ రోడ్డు లోపలికి వెళితే ఫర్లాంగు దూరంలో ఎర్రటి కాంపౌండు చుట్టూ చెట్లు గుబురుగా పెరిగిన ఇల్లొకటి కనిపిస్తుంది. ఆ ఇంట్లోకి వెళ్ళి రాజశేఖర్ అనే ఆయన్ని కలుసుకోండి. మీ పని సానుకూలపడుతుంది. గుడ్‌లక్" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు వినాయకరావు.

ఆ వివరాలన్నీ రెండు మూడుసార్లు మననం చేసుకున్నాడు కర్నల్ రాజారావు.

3

అనుకున్న ప్రకారం కూకట్‌పల్లి చేరుకున్నాడు కర్నల్ రాజారావు.

వినాయకరావు చెప్పిన ఇల్లు సులభంగానే గుర్తుపట్టగలిగాడు. కానీ ఆ చుట్టు ప్రక్కలంతా నిర్మానుష్యంగా వుంది. దగ్గరలో మరో యిల్లన్నది లేదు. చెట్లు బాగా ఒత్తుగా పెరిగి వున్నాయి.

రాజారావు అటూ ఇటూ చూసుకుంటూ ఇంటి గేటు దాకా వెళ్ళాడు. ఎవరయినా కనిపిస్తారేమోనని ఒక్క క్షణం ఆగాడు.

ఇంతలో—

ఎక్కడ్నుంచో 'కెవ్వు' మని కేక వినిపించింది.

ఆడ గొంతు అది.

క్షణకాలంపాటు రాజారావు స్తంభించిపోయాడు. వెంటనే తెప్పరిల్లి ఒక్క ఉదుటున గేటు తోసుకుని లోపలకు ఉరికాడు.

దూరంగా ఒక చెట్టుక్రింద నల్లగా, బలిష్టంగా ఉన్న యిద్దరు మగవాళ్ళు, నేలమీద పొర్లుతూ పెనుగులాడుతున్న ఒక ఆడమనిషి అతనికి కనిపించారు. ఆ మగవాళ్ళిద్దరూ చింపిరి జుట్టుతో నూనె కారుతున్న మొహాలతో గళ్ళ లుంగీలు కట్టుకుని భయంకరమైన రౌడీలులాగా వున్నారు. వాళ్ళిద్దరి బారినుంచీ తప్పించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ, కేకలు పెడుతోందామె.

ఆ దృశ్యాన్ని చూడగానే రాజారావు శరీరంలో రక్తం ఒక్కసారిగా పొంగింది.

రయ్‌మని వెళ్ళి ఆ రౌడీలలో ఒకడ్ని పయికి లేవనెత్తి లాగి గూబమీద ఒక్కటిచ్చాడు. ఆ దెబ్బకు వాడి కళ్ళు తిరిగి ఉన్నచోటనే నేల కూలాడు.

ఈలోగా రెండోవాడు ఆ అమ్మాయిని వదిలి రాజారావుతో కలియబడ్డాడు. రాజారావు వాడి జుట్టు పట్టుకుని వంగదీసి కడుపులో బలంగా తన్నాడు. వాడా బాధ భరించలేక నేల కరుచుకుపోయాడు.

ఇంతలో మొదటి రౌడీ తేరుకుని రాజారావు మీదకి దూకాడు. అది గ్రహించి అతను పక్కకి తప్పుకోవడంతో వాడు విసురుగా వెళ్ళి కిందపడ్డాడు. వెంటనే రాజారావు ఒక కాలితో వాడి కాలు అదిమిపెట్టి రెండో కాలుని రెండు చేతుల్తోనూ గట్టిగా మెలితిప్పాడు.

వాడా బాధకు తట్టుకోలేక అరవటం మొదలుపెట్టాడు. అది చూసి రెండో రౌడి కాలికి బుద్ధిచెప్పాదు. వెంటనే మొదటివాడు కూడా రాజారావు పట్టునుంచి ఎలాగో తప్పించుకుని వెనక్కి తిరగకుండా పలాయనం చిత్తగించాడు.

అంతవరకూ వణికిపోతూ దూరంగా నిల్చున్న ఆ అమ్మాయి ఒకసారి గుండెలమీద చేతులు వేసుకుని "హమ్మయ్య. సమయానికి దేవుడిలా వచ్చి రక్షించారు. చాలా థాంక్సండీ" అంది.

ఆమెవంక ఒకసారి నిశితంగా చూశాడు కర్నల్ రాజారావు.

అరవిరిసిన మొగ్గలా, ఇప్పుడిప్పుడే యవ్వనాన్ని సంతరించుకుంటున్న కన్నె జలతారులా ఉన్న ఆమె అందం అతడ్ని మైమరపించేసింది. ముఖంలో కనిపించే అమాయకత్వం ఆమె అందాన్ని రెట్టింపు చేస్తోంది.

అలా రెప్ప వాల్చకుండా ఆమెవంకే చూస్తున్న రాజారావ్ చప్పున తేరుకుని "ఇంకా మనం ఇక్కడే ఉంటే మరేదన్నా ప్రమాదం రావచ్చు. వెంటనే మనం బయలుదేరాలి" అన్నాడు.

ఆమె నిస్సంకోచంగా అతనివెంట చకచక అడుగు లేయ సాగింది. ఇద్దరూ కలిసి మెయిన్‌రోడ్ వేపు అడుగులు వేస్తున్నారు. అక్కడకు వెడితే ఏదోక బస్సు ఎక్కవచ్చు.

"నా పేరు రాజారావు....కర్నల్ రాజారావు. మరి మీ పేరు...."

"నా పేరు లత" తన పేరు చెబుతున్నపుడు ఎందుకో ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబారింది.

దూరాన ఎక్కడో బస్సు హారన్ మోగింది.

4

ఒక మూలగా వున్న టేబుల్ దగ్గర రాజారావు, లత ఎదురెదురుగా కూర్చుని కాఫీ తాగుతున్నారు.

ఎయిర్‌కండీషన్డు గాలి వాళ్ళ శరీరాల్ని చల్లగా తాకుతూ గిలిగింతలు పెడుతోంది. ఆ హోటల్ హాలులో జనం పల్చగా ఉన్నారు—ఆ సమయంలో.

"అసలు మీరా ఇంటికి ఎందుకు వెళ్ళారు?" ఆమె ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు రాజారావు.

"ఆ సంగతి చెప్పాలంటే ముందు నా కథంతా మీకు చెప్పాలి" అంది లత చిరునవ్వుతో.

"మీ కభ్యంతరం లేకపోతే చెప్పండి."

"నాకు చిన్నప్పుడే అమ్మా నాన్నా పోయారు. వేరే దిక్కు ఏమీ లేకపోవటంతో అనాధ శరణాలయంలో చేరి, అక్కడే పెరిగాను. ప్రస్తుతం నేను ఒక ప్రైవేట్

కంపెనీలో పనిచేస్తున్నాను.

"మొన్న సాయంకాలం నేను ఆఫీసు నుండి ఇంటికి వెళ్లేసరికి ఒకాయన నా కోసం కూర్చుని ఉన్నాడు. తనొక లాయర్ననీ, పేరు శేఖర్ అనీ చెప్పాడు.

"మా నాన్నగారితో ఇది వరకు పరిచయం ఉండేదనీ ఆయన బతికున్న రోజుల్లో ఎప్పుడూ ఏదో ఒక నిధికి సంబంధించిన కాగితంకోసం కలవరించేవాడనీ, అయితే ఆయన అవసాన దశలో ఆ కాగితం దొరికిందనీ ఆ పరిస్థితుల్లో నిధికోసం గాలించే ఓపిక ఆయనకు లేక పోయిందని చెప్పాడు. అయినా మా నాన్నగారు ఆ కాగితాన్ని ఎక్కడో దాచిపెట్టి ఉంచారనీ, అది కనుక దొరికితే నేనొక లక్షాధికారిణి అవుతాననీ ఆయన వివరించాడు. అంతా చెప్పి 'మీ నాన్నగారి తాలుకు కాగితాలు నీ దగ్గరున్నాయా?' అని అడిగాడు.

"ఏమో నాకేం తెలియదండీ. నాకు ఊహ తెల్సిన రోజుల్లో మా అమ్మ ఒకరోజు ఏవో పాత కాగితాలన్నీ ఒక పెట్టెలో సర్ది తాళంవేసింది. కావలిస్తే ఆ పెట్టె నా దగ్గరే ఉంది. చూడండి'' అన్నాను.

"ఆయన ఆ పెట్టెలో ఉన్న కాగితాలన్నీ గాలించాడు. కానీ, ఆయన చెప్పిన కాగితం కనిపించలేదు. 'ఇవన్నీ ఇలా చూస్తే తెలీదమ్మా. నేను వీటిని తీరిగ్గా చూస్తాను. తర్వాత నీకు కబురు చేస్తాను' అంటూ ఆ కాగితాల్ని తనతో తీసుకు వెళ్ళిపోయాడు.

"మొన్న నాకు ఆయన దగ్గర్నుంచీ ఫోన్ వచ్చింది - రేపు పదిన్నరకు కూకట్‌పల్లిలోని ఆ ఇంటిలో కలుసుకోవలసిందని. నేను వెళ్లేసరికి కొంచెం లేట్ అయింది.

గేటుదాటి లోపలికి పదడుగులు వేశానో లేదో ఆ రౌడీలు నా మీదకు దూకారు. మీరే గనుక సమయానికి రాకపోతే ఏమయ్యేదానో్న ....'' లత కళ్ళు భయంతో విశాల మయ్యాయి.

రాజారావు సిగరెట్ వెలిగించాడు.

''దీన్నిబట్టి చూస్తుంటే ఆ శేఖర్ అన్న అతను నిజంగా లాయర్ కాదనీ, మోసగాడనీ తెలుస్తోంది. వాళ్ళెవరోగానీ ఆ నిధికోసమే ఈ ప్లాన్ వేసినట్టున్నారు'' అన్నాడు.

''నిజమే .... అయితే మన మిప్పుడేం చెయ్యాలి? పోలీస్ రిపోర్ట్ ఇస్తే....? వాళ్ళదాకా ఈ విషయం వెడితే పెద్ద గొడవ అవుతుందేమో....ఏమో ఏం చెయ్యడానికీ నాకేం తోచడంలేదు.'' అంది లత ఓక్కమొహం పెట్టి.

''ఫరవాలేదు. మీరేం వర్రీ కాకండి. ఒకసారి మీ రూమ్‌కి వెళ్ళి వెతుకుదాం. ఏమన్నా దొరికితే మీరు అదృష్టవంతులే'' అన్నాడు రాజారావు.

లత అతని కళ్ళలోకి చూస్తూ ''నన్ను 'మీరు' అనకండి. నాకేమిటో సిగ్గుగా ఉంది'' అంది.

రాజారావ్ మొహం వికసించింది. హుషారుగా నవ్వి ''సరే లతా పదా'' అన్నాడు.

5

గదిలో మూలగా ఉన్న ఒక పాత పెట్టెను చూపించింది లత.

''అదుగో అందులోవున్న కాగితాలన్నీ అతనే పట్టుకెళ్ళాడు'' అంది.

రాజారావు ఆ పెట్టెదగ్గరికి నడిచాడు. చాలా పురాతనమైన పెట్టెలావుందది. అంతా తుప్పుపట్టిపోయి జీర్ణా

వస్థలో ఉంది.

"శేఖర్ తీసుకుపోగా ఇంకా నాలుగైదు పనికిరాని కాగితాలు ఉన్నాయందులో. వాటిని చేతిలోకి తీసుకుని పరిశీలించడం మొదలుపెట్టాడు రాజారావు.

వాటిలో ఉపయోగపడే సమాచారం ఏదీ లభ్యంకాలేదు. వాటిని తిరిగి పెట్టెలో పెట్టెయ్యబోతుంటే, అప్రయత్నంగా అతని దృష్టి పెట్టె అడుగున ఒక వైపున రేకు ఎత్తుగావున్న చోట పడింది. లతను పిలిచి అది చూపించాడు.

ఇద్దరూ కలిసి చాకుతో మెల్లగా ఆ రేకును కత్తిరించారు.

ఆశ్చర్యం!!

దాని లోపల ఒక పాత కాగితం మడతలు పెట్టి దాచబడి ఉంది.

రాజారావు జాగ్రత్తగా ఆ కాగితం మడతలు విప్పి చూశాడు. లోపల ఏవేవో అక్షరాలు గజిబిజిగా రాసివున్నాయి.

లతకు ఆ భాష ఏమిటో అర్థంకాలేదు.

"ఇదేమిటి? ఇదేం భాష! అంతా అయోమయంగా ఉందే" అంది.

ఆమె మాటలు ఏమీ వినిపించుకోకుండా తదేకంగా ఆ కాగితాన్ని పరీక్షిస్తూ, ఆ అక్షరాలను చదవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఉన్నట్టుండి అతని ముఖం వికసించింది.

"గుడ్‌గాడ్. లతా. దొరికింది. నిధిని కనుక్కునే ఆధారం దొరికింది. ఇదే మనకు కావలసిన కాగితం. మీ నాన్నగారు దేనికోసమైతే జీవితాంతం తపించి కలవరించి

సంపాదించారో ఆ కాగితం ఇదే. నర్సాపూర్ అడవులలో నిక్షిప్తమైన అమూల్య ధనరాశులకు ఇక నువ్వే ఏకైక వారసురాలివి'' ఆనందం పట్టలేక అరుస్తున్నాడు రాజారావు.

లత ఆశ్చర్యపోతూ అతనివంక చూసింది.

''అవును లతా! ఆ నిధిని కనుక్కునే మార్గం ఈ కాగితంలో వివరంగా రాయబడి వుంది. ఇది సంస్కృత భాష. నేనెప్పుడో ఆ భాషని నేర్చుకున్నాను. ఈ మధ్య కాలంలో అలవాటు తప్పినందువల్ల చదవడానికి కొంచెం టైంపట్టింది. అంతే.''

''నిజంగానే....అంతడబ్బు....ఆ నిధి నిజంగానే....'' ఆనందంతో లత గొంతు పెగలడంలేదు.

''అవును లతా! అయితే ఈ రహస్యం మనిద్దరిమధ్యే వుండాలి. ఎవరికన్నా తెలిస్తే ప్రమాదం. ఈ కాగితం ఇక్కడ దాచి వుంచడం కూడా శ్రేయస్కరం కాదు. ఏం చేద్దాం!.........నా దగ్గర దాచిపెడితే నీకేమైనా అభ్యంతరమా?''

''ఛ....ఛ! అలాంటి మాటలనకండి. మీ దగ్గిరుంటే నా దగ్గిరున్నట్టు కాదూ. కానీ జాగ్రత్త! దానివల్ల మీకేమీ ప్రమాదం రాకుండా చూసుకోండి.''

''నాకేం ఫరవాలేదు. సరే, రేపు సాయంత్రం సరిగ్గా ఆరున్నరకి ఇక్కడికొస్తాను. తర్వాత ఏం చెయ్యాల్సిందీ ఇద్దరం కలిసి ఆలోచిద్దాం.''

''సరే'' అంది లత.

ఆ కాగితాన్ని జేబులో దాచుకుంటూ బయటికి నడిచాడు రాజారావు.

6

మర్నాడు సాయంకాలం సరిగ్గా ఆరున్నరకు రాజా రావు లత ఇంటికి వెళ్లాడు.

కానీ లత ఇంట్లో లేదు. ఇంటికి తాళం వేసుంది. ఏమీ పాలుపోక అటూ ఇటూ తచ్చాడుతున్న అతనికి పక్కింటామె కనిపించింది.

"లత ఎక్కడకు వెళ్ళిందో తెలుసునా మీకు?" అని ఆమెని అడిగాడు.

అతని ప్రశ్న వినిపించుకోకుండా "మీ పేరు?" అని ఎదురు ప్రశ్నించిందామె.

"రాజారావు....కర్నల్ రాజారావు."

"అయితే మీ కీ కవరు ఇమ్మంది" అని ఒక కవరును అతనికి అందించింది.

ఆత్రంగా ఆ కవరు విప్పి చదివాడు రాజారావు.

"ప్రియమైన రాజారావ్ గారికి,

అనుకోని పరిణామాలు ఏర్పడ్డాయి. ఆ వివరాలన్నీ ఈ ఉత్తరంలో రాసే అవకాశం లేదు. మీరు వెంటనే బయలుదేరి కూకట్‌పల్లిలోని ఆ ఇంటికి రండి. అక్కడ అన్ని విషయాలు బోధపడతాయి."

మీ

లత."

ఆ ఉత్తరం చదివిన రాజారావుకేమీ అర్థం కాలేదు. రెండు నిముషాలపాటు ఆలోచించి, జేబులోంచి ఒక ఉత్తరం తీసి దాని మీద ఏదో అడ్రస్ రాసి దగ్గరలో వున్న పోస్టుబాక్స్‌లో వేసి కూకట్‌పల్లి బయలుదేరాడు.

సాయంకాలం సమయం కావటంతో రోడ్లన్నీ రద్దీగా ఉన్నాయి. అయినా స్కూటర్‌ని వేగంగానే పోనిస్తున్నాడు

రాజారావు.

అతని మనసు మనసులో లేదు. అక్కడ లత ఏం ప్రమాదంలో చిక్కుకుందోనన్న ఆందోళన అతన్ని స్థిమితంగా ఉండనీయడం లేదు.

వాచీ వంక చూశాడు.

ఏడున్నర కావస్తోంది. మనసులో ఆందోళన అధికమైంది.

కూకట్‌పల్లిలోని ఆ ఇంటికి చేరేసరికి పావు తక్కువ ఎనిమిదయింది. అప్పటికే చీకట్లు బాగా ముసురుకున్నాయి. నర సంచారం లేని ఆ ప్రాంతమంతా చీకటి గుయ్యారంలా ఉంది.

ఇల్లు చేరుకున్న తర్వాత ఒక క్షణం ఆగి చుట్టుపక్కల ఆ చీకటిలోకి పరికించి చూశాడు.

ఎక్కడా మనిషి అలికిడి లేదు.

దూరంగా కీచురాళ్ళ రొద.

శబ్దం కాకుండా గేటు తెరిచి మెల్లగా లోపలకు ప్రవేశించాడు రాజారావు.

లోపల కూడా ఎవరూ వున్నట్టులేదు. లోపల కూడా చీకటిగా ఉంది.

అతనిలో ఆదుర్దా ఎక్కువయింది.

జేబులోంచి పెన్‌టార్చ్ తీసి వెలిగించి, అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటి పోర్టికో వద్ద చేరుకున్నాడు. గోడ పక్కగా ఒంగి ముందుకు నడిచాడు. వెనుకవైపు కిటికీ సందునుండా లైటు వెలుతురు మసగ్గా కనిపించింది.

ఉలిక్కిపడి ఒక్కసారిగా ఆగిపోయాడు రాజారావు. ఆ గదిలో ఎవరో మసలుతున్న సవ్వడి.

అలాగే ఒంగి చప్పుడు కాకుండా పెరటివేపుకి నడిచాడు

రాజారావు.

లోపలికి వెళ్ళడానికి దారి ఏదైనా వుందేమోనని వెతి కాడు. అదృష్టవశాత్తు ఒక కిటికీ తలుపు దగ్గరగా మూసి వుంది. లోపల గడియలేదు.

ఒక్క నిముషంపాటు అలాగే నిలబడి, తర్వాత మెల్లగా కిటికీలోంచి దూకి లోపలికి ప్రవేశించాడు రాజా రావు.

ఆ గదంతా చీకటిమయం.

టార్చి వెలిగిస్తే తనజాడ ఎవరన్నా పసిగట్టే ప్రమాదం వుందని వెలిగించలేదు. చీకటిలో అలా తడుముకుంటూనే అడుగులు వేస్తున్నాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి మసక వెలుతురు కనిపించింది. దూరంగావున్న హాలులోంచి ఆ వెలుతురు వస్తోందని గ్రహించాడు. ఆ హాలుకు ఎడంవేపున ఒక గది, కుడివేపున ఒక గది కనిపించా యతనికి. ఒక క్షణంపాటు ఆలోచించి మెల్లగా కుడివేపు గదిని సమీపించి తలుపుతీసి లోపలకు అడుగుపెట్టాడు.

అంతే!!

వెనుకనుంచీ అతని తలమీద ఎవరో బలంగా మోదారు. ఆ దెబ్బకు రాజారావు కళ్ళు బైర్లుకమ్మాయి. స్పృహతప్పి నేలకి ఒరిగాడు.

స్పృహవచ్చి చూసేసరికి అతని కాళ్ళూ చేతులూ తాళ్ళతో గట్టిగా కట్టివేయబడి వున్నాయి.

అతని కళ్ళు చుట్టూ ఒకసారి చూశాయి.

అదొక చిన్న గది. ఎక్కడో లైటు మసగ్గా వెలుగు తోంది. అతనికి కొంచెం దూరంలో తనలాగానే ఎవరో బంధించబడి వున్నారు. మసక వెలుతురులో ఎవరన్నదీ తెలియడంలేదు.

రాజారావుకు ఎందుకో అనుమానం వేసి "లతా, లతా" అని మెల్లగా పిలిచాడు.

"ఎవరూ, రాజారావుగారా!" ఆమె గొంతులో ఆశ ధ్వనించింది.

"నేనే లతా! నీ ఉత్తరంచూసి బయలుదేరి వచ్చేశాను. కానీ ఏం లాభం? నిన్ను రక్షించుకోలేకపోయాను."

"నా ఉత్తరమా? అదేమిటి మీరేగా నన్నిక్కడికి రమ్మని రాశారు?"

రాజారావు స్థాణువయ్యాడు.

"అయితే ఇదంతా వాళ్ళ పన్నాగమన్నమాట. మనిద్దరినీ మోసంతో ఇక్కడికి రప్పించి బంధించారు."

"ఇంతకీ ఆ కాగితం జాగ్రత్తగా వుందా?" ఆదుర్దాగా అడిగింది లత.

"ఏమో .... ఇక్కడికి వచ్చేటప్పుడు నా జేబులోనే వుందది."

ఇంకా రాజారావు మాట పూర్తికాకుండానే ఎక్కడ్నించో భయంకరమైన నవ్వు వినిపించింది.

"ఆ కాగితం గురించి మీరేం వర్రీకాకండి. అది నా చేతికి ఎప్పుడో చిక్కింది" అన్నమాటలు కూడా వినిపించాయి.

"అది శేఖర్ గొంతులా వుంది" అంది లత భయంతో.

మళ్ళీ నవ్వు వినిపించింది.

"పిచ్చిదానా, శేఖర్ అన్నది నా మారుపేరు. ఎప్పట్నుంచో వెదుకుతున్న నిధి ఆచూకీ ఇప్పటికి దొరికింది నాకు. అయితే మధ్యలో అడ్డులా తయారయ్యారు మీరిద్దరు. అందుకే మీ ఇద్దరినీ ఇక్కడకు రప్పించాను. ఆ

నిధి నా కొక్కడికే దక్కాలి. ఆ నిధి రహస్యం తెలుసుకున్న మీరు ప్రాణాలతో వుండకూడదు. మిమ్మల్ని కాల్చి చంపుతానని భయపడకండి. రక్తపాతం జరగకుండా పని పూర్తిచేసుకోవడం నా హాబి. ఇంక కొద్దిక్షణాల్లో మీకీ ప్రపంచంనుండి విముక్తి. హహ్హాహహ్హా హాహాహా....'' ఆ తర్వాత మాటలు వినిపించడం ఆగిపోయాయి.

రాజారావు, లత పాలిపోయిన మొహాలతో ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు.

7

అయిదు నిముషాలు మౌనంగానే గడిచిపోయాయి.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని ఎక్కడ్నుంచో 'గుడగుడ' మని శబ్దం వినిపించింది.

ఇద్దరూ అదిరిపడి పైకప్పువంక చూశారు. పైకప్పుకు కొంచెం క్రిందగా గోడలోంచి ఒక చిన్న గొట్టం అమర్చబడి వుంది. ఆ గొట్టం లోంచి నీళ్ళు ధారగా ప్రవహించడం మొదలుపెట్టాయి.

లత భయంతో ఒక కేకవేసింది.

"నీళ్ళు, నీళ్ళు. ఈ గదంతా నీళ్ళతో నింపి, మనని చంపేస్తారు'' అని అరిచింది.

రాజారావు ఆమెని ఓదారుస్తూ "చూడు లతా. ఈ నీళ్ళ ధారను బట్టి చూస్తే గది నిండటానికి ఇంకా గంటసేపయినా పట్టేట్టుంది. ఈలోగా మనం కట్లు తెంచుకుని బయటపడాలి'' అని చెప్పాడు.

అని ఆమె సమాధానంకోసం ఎదురుచూడకుండా కట్లు తెంచుకోవడానికి ప్రయత్నించసాగాడు. పావుగంట తంటాలుపడి ఒంటిమీదున్న కట్లు సడలించాడు. తర్వాత

ముడులన్నీ విప్పుకున్నాడు.

తర్వాత లత దగ్గరకు పరిగెత్తుకెళ్ళి ఆమె కట్లన్నీ చకచకా విప్పేశాడు. అప్పటికే నీళ్ళు మోకాళ్ళలోతుకు వచ్చేశాయి.

ఆలస్యం చేయకుండా తలుపు దగ్గరకు వెళ్ళారిద్దరు. గది తలుపు లాగి చూశాడు రాజారావు. బయట తాళం వేసి వుందేమో తలుపు రాలేదు. ఆ గదికి అదొక్కటే తలుపు.

సాలోచనగా తలుపువంక చూశాడు రాజారావు. చాలా పాతబడిపోయి వుందది. చెక్క కూడా పలుచగానే ఉన్నట్టు కనిపించింది. కాని యెక్కడా చిన్న సందుకూడా లేదు. ఎయిర్ కండిషన్డు గది తలుపులా వుందది. ఆలోచించ డానికి కూడా వ్యవధిలేదు. బలంగా తన భుజాలతో తలుపు పగలగొట్టడానికి ప్రయత్నించాడు రాజారావు.

నిముషాలు గడుస్తున్నాయి. అతని భుజాలు రెండు నొప్పి పుడుతున్నాయి. అయినా పళ్ళు బిగించి అలా కొడు తూనే వున్నాడు.

చివరకి 'ఫెళ్ళు' మనే శబ్దంతో తలుపు పగులు నిచ్చింది. కాస్త ఉత్సాహం తెచ్చుకుని. బలం కూడదీసుకుని మరింత బలంగా మోదాడు. దాంతో తలుపు కాస్త పెటపెట మని విరిగి క్రిందపడింది.

ఇద్దరూ కలిసి హాల్లోకి పరిగెత్తారు రాజారావు ఆయా సంతో తడబడుతున్నాడు. అయినా పరుగు ఆపలేదు. అదృష్టవశాత్తు హాలు తలుపు తీసే వుండటంతో యిద్దరూ బయటపడ్డారు. బయట కూడా యెక్కడా అలికిడిలేదు. రెండు నిముషాల్లో రోడ్డుమీదకు వచ్చారు. ఒక్కసారి

ఆగి, ఊపిరి పీల్చుకున్నారిద్దరు.

ఇంతలో దూరంగా ఏవో లైట్లు కనిపించాయి. 'అమ్మయ్య' అనుకుని దగ్గరకు వచ్చిన లారీని చేతులెత్తి ఆపాడు రాజారావు.

8

లత గదిలో లైటు వెలుగుతోంది.

వేడి వేడి కాఫీ తాగుతూ లత వేపు నవ్వుతూ చూశాడు రాజారావు.

"నావల్లనే కదా మీకిన్ని ఇబ్బందులు వచ్చాయి" అంది లత, అతనిపక్కన కూర్చుంటూ.

"చాల్లే ఊరుకో. ఇంకెప్పుడూ అలాంటి మాటలు మాట్లాడకు" అని ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకుంటూ "లతా! నిన్ను ఆ రోజు చూడగానే నా మనస్సు నీ స్వాధీనం అయిపోయింది. నీ కభ్యంతరం లేకపోతే నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అని ఆమె కళ్ళలోకి చూశాడు.

లత దానికి సమాధానంగా సిగుతో తల దించుకుంది. అది చూడగానే రాజారావు కళ్ళు మెరిశాయి.

"అన్నట్టు చెప్పడం మర్చాను లతా. నిధి కాగితం వాళ్ళ చేతుల్లో పడటం అబద్ధం. నేను నీ కోసం బయలుదేరి వచ్చేముందే ఎందుకయినా మంచిదని దాన్ని చిక్కడపల్లిలో వుంటున్న మా ఫ్రెండ్‌కు పోస్టుచేశాను. అలాంటి కాగితమే మరొకటి నా జేబులో పెట్టుకున్నాను. నే ననుకున్నటు అదే వాళ్ళకు చిక్కింది. నీ నిధి నీ కోసం నిక్షేపంగానే వుంది" అని చెప్పాడు రాజారావు.

అనురాగం తొణికిసలాడే కళ్ళతో అతనివంక చూసి, అతని గుండెల్లో తల దాచుకుంది లత.

9

వినాయకరావు తీరిగ్గా కుర్చీలో కూర్చుని ఏదో నవల చదువుకుంటున్నాడు.

ఇంతలో అతని సెక్రటరీ కమ్ శ్రీమతి స్వర్ణ హడావిడిగా వచ్చి "ఇవేమిటో బిల్స్ వచ్చాయండి. చాలా తమాషాగా వున్నాయి. కానీ నాకేం అర్థంకావడంలేదు" అంది అతని ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"ఏమిటవి?...." చదువుతూనే ప్రశ్నించాడు వినాయకరావు.

"నాటకాల్లో వేషాలు వేసే రామారావుకి, కృష్ణారావుకి చెరొక యాభై రూపాయలు....దెబ్బలు బలంగా తగిలినందుకు అదనంగా చెరొక పాతిక పాతిక, లాయర్ శేఖరానికి యాభై రూపాయలు, లౌడ్‌స్పీకర్ పగ్గై రాలకు పాతికరూపాయలు. పై నుంచి గదిలోకి నీళ్ళు పోసిన కుర్రాడికి ఇరవై రూపాయలు....ఎవరికీ చెప్పకుండా వుండేందుకు యినాంగా అయిదు రూపాయలు...." అంటూ లిస్టు చదివి "ఏమిటండి యిదంతా?...." అని ప్రశ్నించింది.

వినాయకరావు నవల అవతల పారేసి, శ్రీమతివంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఇందులో అర్థంకానిది యేముందోయ్. కర్నల్ రాజారావు దగ్గర మనం తీసుకున్న వెయ్యి రూపాయల్లోంచి ఖర్చు చేశాం. అదంతా వాళ్ళకోరకైన ఖర్చే" అన్నాడు.

స్వర్ణ ఒక్కసారి తెల్లబోయి "అయితే యిదంతా నాటకమేనా? నిజం కాదంటారా?"

"అవును. అలా ఆడించవలసి వచ్చింది" అంటూ సిగరెట్ వెలిగించి చెప్పడం మొదలుపెట్టాడు వినాయక రావు.

"రాజారావు నా దగ్గరకి వచ్చి, తన జీవితం నిస్సారంగా వుంటోందనీ, ఏదైనా ఎడ్వెంచర్ కావాలనీ కోరాడు. నలభైయేళ్ళు వచ్చేవరకు మిలటరీలో గడిపిన మనిషికి జీవితంలో రొమాన్స్ లేకపోవడమే ఒక పెద్ద లోపం. ఆ సంగతి అతన్ని చూడగానే గ్రహించాను. అయితే ఆ రొమాన్స్‌కి కాస్త ఎడ్వెంచర్ జోడిస్తే అతని మిలటరీ తత్వానికి సరిపోతుంది.

"ఇకపోతే మన క్లయింట్‌లలో 'స్త్రీ సదన్'లో లత అనే అమ్మాయి వుంది. చదువు, అందం, వుంది. పైగా మంచి అమ్మాయి. పెళ్ళి చేసుకొని, గృహిణిగా జీవించాలని ఆమె అభిలాష. సరే, వాళ్ళిద్దరికీ జోడు కలిపితే బాగుంటుందని ఆలోచించాను.

"ఒకరి సంగతి మరొకరికి చెప్పకుండా ఈ నాటకం ఆడాను. దానివల్ల వాళ్ళకదంతా నిజంగానే అనిపించింది. ఫలితంగా ఒకళ్ళమీద ఒకళ్ళకు అనురాగం ఏర్పడింది.

"లాయర్ శేఖరం అంటూ ఎవరూ లేరు. నాటకాల్లో వేషాలువేసే వెంకట్రావుని అలా నటించమన్నాను. ఇక ఆ రౌడీలిద్దరు కూడా డబ్బిస్తే అలా నటించినవాళ్ళే. ఆ రోజు రాత్రి కూకట్‌పల్లి ఇంటిపైన నీళ్ళ టాంకు పూర్తిగా నింపి, అక్కడినుంచి గొట్టంద్వారా గదిలోకి నీళ్ళు ధారగా పడేట్లు యేర్పాటు చేశాను. అవీ ఈ బిల్లులు. ఇప్పుడైనా

అర్థమయిందా?"

ఊపిరి ఒక్కసారి గట్టిగా పీల్చి "అబ్బ! ఏం ప్లాను వేశారండి. పాపం, వాళ్ళు ఇదే నిజమనుకుని ప్రేమలో పడి పెళ్ళి కూడా చేసేసుకున్నారు. అవునూ ఆ కాగితం మాటేమిటి? కొంపదీసి అదికూడా అబద్ధమేనా ఏమిటి?" అని అడిగింది స్వర్ణ.

"ఆ. నిధీలేదూ, నిక్షేపంలేదు. సంస్కృతం వచ్చిన వాడితో ఆ కాగితం రాయించి నేనే అక్కడ పెట్టాను. వాళ్ళకు జీవితమంతా తోడు నిలిచే నిధికి మించిన నిధి వేరే అక్కరలేదు. ఏది ఏమైనా కూకట్‌పల్లిలో మనం కొన్న యిల్లు యిందుకు బాగా పనికి వచ్చింది" అన్నాడు వినాయకరావు.

భర్త తెలివితేటలకు మురిసిపోతూ అమాంతం అతన్ని కౌగలించుకుంది స్వర్ణ. □

అసలైన రేఖలు?

ప్రతాప రవిశంకర్

మహాయాత్ర

సీరియల్

(గత సంచిక తరువాయి)

విక్రమ్—రాజు టాంగా నడిపే ముసలాడిని పక్కకు పిల్చి కత్తులతో భయపెట్టారు—వాళ్ళ ఆచూకీ ఎవరి కయినా చెబితే పొడిచి చంపుతామని చెప్పారు.

"నా మాట నమ్మండి. ఎవ్వరికీ చెప్పను. అసలు మీ గురించి నాకేమీ తెలీదు" అన్నాడు ముసలాడు తలమీద చేతులు పెట్టుకుని.

నీలూ నవ్వి "మా జాగ్రత్తలో మేం వున్నాం. నువ్వు కూడా నీ జాగ్రత్తలో నువ్వుంటే మంచిది" అన్నది అతడితో.

వాడు తల వూపాడు అర్థమైనట్టు.

"ఇక ఆలస్యం దేనికి? బయల్దేరుదాం" అన్నాడు రాజు.

ప్రయాణానికి అవసరమైన వస్తువుల నన్నింటినీ మూటలుగా కట్టి గుర్రాలమీద వేశారు. గుర్రాలు కూడా

బాగా బలిసి దృఢంగా వున్నాయి.

నరేంద్ర కొంత డబ్బుతీసి టాంగా ముసలాడి కిచ్చాడు. ఆ డబ్బు చూసి వాడు సంతోషపడి వంగి దణ్ణం పెట్టాడు అందరికీ. తర్వాత గబ గబా నడుచుకుంటూ చీకట్లో కలిసిపోయాడు.

"ఈ ముసలాడిని నమ్మవచ్చా?" విక్రమ్ అడిగాడు నరేంద్రను.

"వీడిమీద నమ్మకం వుంది. ఈ పరిస్థితుల్లో మనం ఎవరో ఒకర్ని నమ్మక తప్పదు. రాత్రికి రాత్రి మనకు నాలుగు గుర్రాలు ఏర్పాటు చేశాడు. వీడి సహాయం లేకుండా వున్నట్లయితే మనం గుర్రాల్లేకుండా బయల్దేరాల్సి వుండేది" అన్నాడు నరేంద్ర.

ఎక్కడో వూళ్ళో దూరంగా కుక్కలు మొరగటం మొదలుపెట్టాయి.

"గుర్రా లెక్కండి" అన్నాడు నరేంద్ర.

విక్రమ్—రాజు గుర్రాల మెడమీద నిమిరి ఎగిరి వాటి మీద ఎక్కి కూర్చున్నారు.

నీలూ గుర్రాన్ని ఎక్కటానికి కొంచెం యిబ్బంది పడింది. ఆమెకు సహాయపడ్డాడు అతను.

నరేంద్ర కూడా గుర్రాన్ని ఎక్కాడు.

"ఊరు పొలిమేరలు దాటేవరకు నెమ్మదిగా డెక్కల చప్పుడు రాకుండా పోనివ్వండి. వూళ్ళో పోలీసులు గస్తీ తిరుగుతున్నారేమో! కుక్కలు మొరుగుతున్నాయి" అన్నాడు నరేంద్ర గుర్రం కళ్ళెం లాగి వదులుతూ—

నాలుగు గుర్రాలూ ఒక్కసారి ముందుకు కదిలాయి. వేగంగా పరిగెత్తకుండా వుండటానికి కళ్ళాలను కొంచెం బిగించి పట్టుకున్నారు.

దట్టంగా పెరిగిన చెట్ల మధ్యనించి సన్నని దారివుంది. ఆ దార్లోనుండి ఒక దానివెంట ఒకటిగా గుర్రాలు చిన్నగా వెళుతున్నాయి.

పొలిమేరలు దాటిపోయేవరకూ ఎవ్వరూ మాట్లాడుకో లేదు.

"బాగా గుర్తుంచుకోండి. నీలికొండలను చేరటానికి మనదగ్గర దారిని సూచించే చిత్రపటం అంటూ ఏదీలేదు. తూర్పువైపుగా మనం మూడువందలమైళ్ళు ప్రయాణం చెయ్యాలి. అక్కడకు చేరుకున్న తర్వాత ఆ కొండల్లో నిధి ఎక్కడవుందో తెలియజేస్తూ దివాన్ స్పష్టంగా రాసి వుంచిన కాయితాన్ని సంపాదించాను. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం తూర్పు దిక్కును తప్పకూడదు. ఈ విషయంలో మనం జాగ్రత్తగా వుండాలి" ముగ్గురికీ చెప్పాడు నరేంద్ర.

"ఈ మూడు వందలమైళ్ళ దారి ఎట్లా వుంటుందో మనకు తెలీదుకదా!" అన్నాడు రాజు.

"అవును. తెలీదు, అడవులు వుండొచ్చు కొండలు, నదులు వుండొచ్చు. వాటన్నింటినీ దాటి మనం నీలి కొండలను చేరుకోవాలి. అప్పుడే కోట్ల రూపాయల విలువైన నిధిని మనం వశం చేసుకుంటాం."

"అదృష్టం అంటే మనదే అనుకోవాలి. అనుకోకుండా నిధి గురించిన రహస్యం తెలిసింది" అన్నాడు విక్రమ్.

"అవును. అదృష్టమే. కాని మనోహర్‌ని హత్య చెయ్యకుండా వుంటే బాగుండేదని ఇప్పుడు అనిపిస్తోంది. ఇప్పుడు చట్టం దృష్టిలో నేను హంతకుడిని, నేరస్థుడిని. ఆవేశంలో చంపాను."

"వాడు నీకు శత్రువు, అటువంటి శత్రువును తొందరగా చంపటమే మంచిది. ఆలస్యం చేస్తే మనం ప్రాణాలతో వుండలేము. నువ్వు ఆ విషయం గురించి మరిచిపో నరేంద్రా....ఇప్పుడు మన ధ్యేయం ఒక్కటే. కోట్ల విలువైన ఆ నిధిని సంపాదించాలి. అంతే" అన్నాడు రాజు.

"అవును. అదే మన ధ్యేయం" అన్నాడు నరేంద్ర.

నీలూ వాళ్ళ మాటలు వింటోన్నది.

పొలిమేరలు దాటిన వెంటనే గుర్రాలు బాగా వేగాన్నందుకున్నాయి. గుర్రాల డెక్కల చప్పుడు ఆ రాత్రి వేళ నిశ్శబ్దంలో ఎంతో దూరానికి వినపడుతోంది.

దూరంగా పొలాల్లో పంటలకు కాపలా పడుకున్న మనుషులు తలలు పైకెత్తి చీకట్లోకి చూస్తున్నారు.

ముందు నరేంద్ర వున్నాడు. అతడి వెనుక మిగిలిన వాళ్ళున్నారు.

నలుగురూ బాగా బిగుతుగావున్న ప్యాంట్లను వేసుకున్నారు. నీలూ కూడా మగాడిలాగనే వుంది. జుట్టును ముడివేసుకుంది. మొహాన బొట్టులేదు. చేతులకు గాజులు కూడా లేవు.

గుర్రాలు మిట్టపల్లాలోనించి వెళుతున్నప్పుడు వాళ్ళు ఎగిరెగిరి పడుతున్నారు.

మూడుగంటలసేపు గుర్రాలు ఆగకుండా పరుగులు దీశాయి. ఆ సమయంలో ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

అయిదుగంటలు దాటుతోంది సమయం.

అప్పటికే చీకటి కరిగిపోవటం మొదలు పెట్టింది. తూర్పుదిక్కున ఆకాశం తెల్లబడుతోంది.

7

చీకటి పడింది.

అప్పటికే గుర్రాలన్నీ బాగా అలసిపోయాయి. రాత్రి బయల్దేరిన దగ్గర్నించీ అవి ప్రయాణం చేస్తూనేవున్నాయి. మధ్యాహ్నం ఒకచోట ఆగారు. ఆహారం తీసుకుని తిరిగి ప్రయాణాన్ని కొనసాగించారు.

"ఇక్కడ ఆగిపోదాం" అన్నాడు నరేంద్ర.

"ఈ రాత్రి ఇక్కడే విశ్రాంతి తీసుకుందాం" అన్నాడు విక్రమ్ పరిసరాలను పరిశీలనగా చూస్తూ—

దగ్గర్లో చిన్న నీటి ప్రవాహం వుంది. కొండరాళ్ళ మధ్యనుండి ఏదో సెలయేరు ప్రవహిస్తున్నట్టుంది.

"అలసిపోయిన గుర్రాలతో ఈ చీకట్లో ప్రయాణం చెయ్యటం సాధ్యంకాదు" అన్నది నీలూ....

అంతా నిశ్శబ్దంగా వుంది. దగ్గర్లో రాళ్ళమీదనుండి నీళ్ళు పడుతున్న చప్పుడు మాత్రం వినపడుతోంది. అక్కడక్కడ చెట్లు కొంచెం ఎత్తుగా పెరిగి వున్నాయి.

రాళ్ళను పేర్చి ఎండుపుల్లలతో మంటచేశారు. ఎండు రొట్టెలను మళ్ళీ కాల్చింది నీలూ. వాటినే నలుగురూ తిని నీళ్ళు తాగారు.

గుర్రాలను అక్కడే వదిలారు.

అంతా కంబళ్ళు పరుచుకుని పడుకున్నారు.

గుర్రాలు కదులుతూ గడ్డిమేస్తున్నాయి.

ఆకాశంలో నక్షత్రాలు కాంతివంతంగా మెరుస్తున్నాయి.

"మనం ఎంత దూరం ప్రయాణం చేసి వుంటాం" అడిగింది నీలూ ఆకాశంలోకి చూస్తూ.

"ఎనభై మైళ్ళు వచ్చి వుంటాం. ఇప్పటివరకూ మనం ఎటువంటి ఇబ్బందినీ ఎదుర్కోలేదు. నీలికొండల దాకా

మన ప్రయాణం ఇట్లాగే సాగితే ఇంకో రెండురోజుల్లో ఆ కొండల్ని చేరుకుంటాం" నరేంద్ర చెప్పాడు.

"ముందు ముందు మన ప్రయాణం ఇంత సులభంగా వుంటుందని నేననుకోటంలేదు." అన్నాడు రాజు.

"ఎందుకు?" అడిగాడు విక్రం.

"ఇక్కడినుండి భూమిలో తేడా మొదలయ్యింది. కొండలు, సెలయేళ్ళు మొదలయినాయి. చెట్లలో కూడా మార్పు కనపడుతోంది. అంతేకాదు. గ్రామాలు, ఇళ్ళు కూడా ఎక్కడా కనపడటం లేదు. బహుశ ఇక్కడినించి ఇంకొంచెం ముందుకు వెళితే అడవి మొదలు కావచ్చు" అన్నాడతను.

"అడవి మొదలయ్యిందంటే మనం ప్రమాదాల్లో చిక్కుకున్నట్టే. ఎంతో జాగ్రత్తగా వుండాలి. జంతువుల వల్ల, మనుషులవల్ల మనకు ప్రమాదాలు ఎదురవుతాయి" అన్నాడు నరేంద్ర ఆలోచిస్తూ.

"అడవుల్లో వుండే మనుషులవల్ల మనకు ప్రమాదం ఏర్పడుతుందా?" అనడిగింది నీలూ.

"వాళ్ళు మామూలు మనుషులు కారు. ఆటవికులు. మనలాంటి మనుషులంతా వాళ్ళకు శత్రువులు. వాళ్ళ ఆచారాలు, సంప్రదాయాలు చిత్రంగా వుంటాయి. పూర్తిగా మూఢనమ్మకాలతోనే వాళ్ళు బతుకుతూ వుంటారు" అని చెప్పాడు నరేంద్ర.

"ఇప్పటికి నీ కోసం పోలీసులవేట మొదలయ్యి వుంటుంది ఖిలాస్‌పూర్‌లో" అన్నాడు విక్రమ్ వున్నట్టుండి.

ఆ మాట వినటంతోనే వులిక్కిపడ్డాడు నరేంద్ర. ఈ ప్రయాణంలో అతను ఆ రాత్రి జరిగిన సంఘటనను

పూర్తిగా మరచిపోయాడు. నిజమే. మనోహర్ అనుచరులు తనే అతడ్ని చంపినట్టు ఠాణాకు వెళ్ళి పోలీసులకు చెప్పి వుంటారు. దివాన్‌ని కూడా తానే చంపాడని అనుకుంటారేమో. ఎందుకో ఆ క్షణంలో భయం కలిగింది ఆ విషయం గురించి ఆలోచించటానికి.

"ఆలోచిస్తున్నావా?" అన్నది నీలూ అతను మాట్లాడక పోవటంతో.

"అవును నీలూ....తొందరపడ్డాను. నా కోసం పోలీసులు వెతుకుతూ వుంటారు. ఎప్పటికయినా వాళ్ళు నన్ను వదలరు. చేసిన నేరానికి ఎప్పటికయినా శిక్ష అనుభవించక తప్పదు" బాధపడుతున్నట్టుగా అన్నాడు.

"భయపడకు నరేంద్రా....నీలికొండలను చేరుకుని ఆ నిధిని మనం వశం చేసుకునేవరకూ ఆ విషయం గురించి మరచిపో ...ఏం చేయాలో ఆ తర్వాత ఆలోచిద్దాం" అన్నది నీలూ.

మిగిలిన ఇద్దరూ నీలూ ఆలోచనను బలపర్చారు.

"నిధి భద్రపరచిన ప్రదేశం గురించిన కాగితం జాగ్రత్తగా వుందా?" అడిగాడు రాజు.

"ఉంది" అన్నాడు నరేంద్ర పక్కకు తిరిగి పడుకుంటూ.

బాగా ప్రయాణం చేసి వుండటంతో చల్లటి గాలికి అందరికీ నిద్ర పట్టేసింది.

దూరంగా వున్నాయి గుర్రాలు.

చీకటి దట్టంగా వుంది.

అక్కడక్కడ చెట్లు గాలికి పిచ్చిపట్టినట్లు వూగుతున్నాయి.

కొంచెంసేపటికి చీకట్లో నక్కి దాక్కుంటూ ఒక

వ్యక్తి అక్కడకు వచ్చాడు. పడుకున్న వాళ్ళందరినీ చీకటిలోనే పరీక్షగా చూశాడు.

అంతా గాఢ నిద్రలో వున్నారు.

అందర్నీ దాటుకుంటూ నరేంద్ర దగ్గరకు వచ్చి ఆగిపోయాడు. కొంచెంసేపు అక్కడే నిలబడి అతడ్ని పరిశీలించి ముందుకు వంగాడు.

సరిగ్గా అప్పుడే ఒక గుర్రం పెద్దగా సకిలించింది.

ముందుకు వొంగిన మనిషి తుళ్ళిపడ్డాడు.

నరేంద్రకు చటుక్కున మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచాడు. ఎదురుగా నలబడ్డ మనిషి నక్షత్రాల వెలుగులో అస్పష్టంగా కనబడ్డాడు.

అంతే__

పారిపోవడానికి ప్రయత్నం చేస్తున్న ఆ మనిషి రెండు కాళ్ళమీద గట్టిగా తన్నాడు. బాధగా అరుస్తూ వెనక్కు విరుచుకు పడ్డాడు అతను.

ఆ అరుపుకు మిగిలినవాళ్ళు లేచారు.

కిందపడ్డ మనిషి మీదకు ఎగిరి దూకాడు నరేంద్ర. అతని గుండెల మీద కూర్చుని మొహం మీద గట్టిగా కొట్టాడు పిడికిలి బిగించి.

కెవ్వుమన్నా డతను.

"వద్దు. నన్ను చంపొద్దు" అరిచాడతను.

"ఎవరా మనిషి?" అంది నీలూ.

"ఎవరో తెలీదు. నా దగ్గిర నిలబడ్డాడు."

అతడ్ని లేవదీశారు.

నరేంద్ర తాళ్ళతో అతడి చేతులు, కాళ్ళు గట్టిగా బంధించాడు. అతను ఎవరయినా శత్రువు అనే విషయాన్ని అతను నిర్ణయించుకున్నాడు.



మా వద్ద సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య మరియు స్కూలు, కాలేజి విద్యార్థులకు అచ్చుపుస్తకములు, ఎక్సర్‌సైజు పుస్తకములు, స్టేషనరీ మొదలగునవి లభించును.

నేడే కేటలాగుకై వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ)

టౌన్‌హాల్ రోడ్డు—రాజమండ్రి - 1

"ఎవరు నువ్వు?" అడిగాడతడు.

చెప్పలేదు ఆ వ్యక్తి. భయంగా వాళ్ళను చూస్తూ కూర్చున్నాడు.

"చెప్పు.... లేకపోతే నిన్ను నరికి చంపుతాను" అంటూ కత్తిని బయటకు తీశాడు నరేంద్ర.

కత్తిని చూడగానే భయపడ్డా డతను.

"నన్ను చంపొద్దు.... చెబుతాను. భిలాస్‌పూర్‌లో మీరు బయలుదేరిన దగ్గిర్నుంచీ మిమ్మల్ని వెంటాడుతూ వస్తున్నాను. మీరు నలుగురూ ఏదో ముఖ్యమైన పని మీదనే వెళుతున్నట్టు అనుమానించాను. అందుకే మీ వెంట వచ్చాను. మీరు ఇక్కడ కోట్ల రూపాయల నిధి గురించీ, దానికి సంబంధించిన కాగితం గురించీ మాట్లాడుకోవటం విన్నాను. ఆ కాగితాన్ని కాజెయ్యటానికి ప్రయత్నించాను. పట్టుబడ్డాను" అన్నాడా వ్యక్తి.

"నువ్వొక్కడివేనా! నీ వెంట ఇంకెవరయినా వచ్చారా?" అన్నాడు రాజు.

"ఎవ్వరూ రాలేదు. నే నొక్కడినే వచ్చాను గుర్రం మీద."

"మేం భిలాస్‌పూర్‌లో టాంగా తోలే ముసలాడితో మాట్లాడటం విన్నావా?" నరేంద్ర అడిగాడు.

"విన్నాను. అయినా నాకేమీ అర్థం కాలేదు. అనుమానం వచ్చింది. అందుకే మీ వెంటపడి వచ్చాను."

"వీడినేం చేద్దాం?" అడిగాడు విక్రమ్.

"తెల్లారిన తర్వాత వీడి గురించి ఆలోచిద్దాం" అన్నాడు నరేంద్ర.

అతన్ని ఇంకో తాడుతో పెద్ద బండరాయికి కట్టేసి మళ్ళీ నలుగురూ పడుకున్నారు.

అపరాధ పరిశోధన పోటీ-220

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-11-'86 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జనవరి '86 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. 10 వ ఆసియా గేమ్స్‌లో ఎక్కువ బంగారు పతకాల పంట పండించుకున్న దేశం—? (చైనా, జపాన్.)
2. ఇది 'హోదా'కు చిహ్నంగా భావిస్తారు కొందరు—? (కారు, టెలిఫోన్.)
3. రాష్ట్రంలో వీటి పరిస్థితి అధ్వాన్నంగా వుంది—? (రోడ్లు, రిజర్వాయర్లు.)
4. కమీషన్ సిఫారసులను అమలు చేయవద్దని ఈ రాష్ట్రంలో బి.సి.లు ఆందోళన జరుపుతున్నారు—? (ఆంధ్రప్రదేశ్, కర్ణాటక.)
5. ఇది దేశంలో మొదలైన మరో ఉద్యమం—? (గూర్ఖాల్యాండ్, హిందీ వ్యతిరేకత.)

అంతా నిద్రపోయిన తర్వాత ఆ వ్యక్తి తాళ్ళు వూడ దీసుకునే ప్రయత్నం చేశాడు. కాని సాధ్యం కాలేదు. కొంచెంసేపటికి అతను కూడా కూర్చునే నిద్రపోయాడు.

తూర్పు దిక్కున ఆకాశం తెల్లబడుతున్నప్పుడు అతన్ని లేపారు వాళ్లు. కళ్లు తెరిచాడు. ఎదురుగా నరేంద్ర విక్రమ్-రాజు కనబడ్డారు.

నీలూ ఇంకా నిద్రలోనే వుంది.

సెలయేరు ప్రవహిస్తున్న చప్పుడు నిర్విరామంగా వినపడుతోంది.

కాళ్ళకు వున్న తాళ్ళు కత్తితో కోశారు.

అతన్ని లేపదీసి ముందుకు నడిపించారు.

"ఎక్కడికి తీసుకెళుతున్నారు? చంపుతారా?" అనడిగాడతను భయంగా.

"ష్....మాట్లాడకు" అన్నాడు నరేంద్ర.

అతన్ని సెలయేరు దగ్గిరకు తీసుకెళ్ళారు.

నీళ్ళు వేగంగా పరుగులు పెడుతున్నాయి.

అతన్ని నీళ్ళ మధ్యకు నడిపించారు.

"నన్నేం చెయ్యబోతున్నారు?" అడిగాడతను భయంగా మళ్ళీ.

"స్నానం చేయిస్తాం" అన్నాడు రాజు.

"నిజం చెప్పండి. దయచేసి నన్ను చంపొద్దు. వదిలి పెడితే వెనక్కు తిరిగిపోతాను" అన్నాడు.

నరేంద్ర మాట్లాడకుండా వెనుకనుండి ఆ వ్యక్తి కాళ్ళ మీద తన్నాడు. అంతే—ముందుకు నీళ్ళలో పడ్డాడు.

ఆ వ్యక్తి పైకి లేవకముందే ముగ్గురూ కాళ్ళతో అతని శరీరాన్ని నొక్కిపట్టారు. విక్రమ్ అతని తలమీద కాలు వుంచి గట్టిగా నొక్కాడు.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే-జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 84/-లు మాత్రమే.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. సైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

6. సభ్యులరు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 17-60లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

కొంచెంసేపటికి ఆ వ్యక్తిలో చలనం ఆగిపోయింది. కాళ్ళు తీసేశారు. ఆతని శవం సేలయేట్లో కొట్టుకుని వెళ్ళి పోయింది.

ముగ్గురూ నీళ్ళలోనించి బయటకు వచ్చారు.

అప్పుడే నీలూ నిద్రలేచింది.

"ఈ మనిషి ఏమైపోయాడు?" అడిగింది వాళ్ళను.

"పంపించేశాం" అన్నాడు నరేంద్ర.

కొంచెంసేపటికే తూర్పుదిక్కున వాళ్ళ ప్రయాణం మళ్ళీ మొదలయ్యింది నీలికొండలకేసి—

8

అప్పటికే అడవిలో చాలాదూరం వచ్చేశారు. ఆరోజు ఉదయం పదిగంటలకే అడవిలో ప్రవేశించారు వాళ్ళు. ఎన్నో మైళ్ళపొడవున దట్టంగా సాగివుంది అడవి.

బలంగా, ఎత్తుగా వున్న చెట్లతో వాటికి అల్లుకుపోయిన తీగెలతో నిండివుంది.

సూర్యుడి వెలుగు కొమ్మలమధ్య నుండి లోపలకు పడుతోంది.

సూర్యుడు పడమటిదిక్కుగా వాలిపోయాడు.

"ఈ రాత్రికి ఈ అడవిలోనే మనం బసచెయ్యక తప్పదు" అన్నాడు నరేంద్ర.

"ఈ అడవిలోనా?" అన్నది నీలూ భయంగా—

"తప్పదు. ఈ అడవిలోనే. ఇక్కడే మన ప్రాణాలకు ప్రమాదం ఏర్పడని ప్రదేశాన్ని మనం ఎంపిక చేసుకోవాలి."

"నాకు నిద్రపట్టదు" అన్నది నీలూ.

"నువ్వు వద్దన్నా నిద్ర ముంచుకు వస్తుంది. మనం బాగా అలసిపోయి వున్నాం. భయపడకు. నీ ప్రాణాలకు

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్ కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్ ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-11-'86 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జనవరి '87 నెల సంచికలో ప్రకటిస్తాము.

సెప్టెంబరు '86 పోటీ ఫలితాలు

(1) సెప్టెంబరు '86 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య.

కదిలావంటే కాల్చేస్తాడు!
ఆపావంటే దోచేస్తాడు!!

పంపినవారు: శ్రీమతి ఎమ్. జగదాంబ, క్వార్టరు నెం. II/35, బచేలి - 494 553. (మధ్యప్రదేశ్)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కాల్పుల హోరు!
కదలితే తీరు!!

పంపినవారు: శ్రీ ఇ. చక్రపాణి, ఇంటి నెం: 28-20-11, ఏ.టి. అగ్రహారం, గుంటూరు - 522 004.

ప్రమాదం రాకుండా మేం కాపల కాస్తూ కూర్చుంటాం" అన్నాడు నరేంద్ర.

అప్పటికే వెలుగు బాగా తగ్గిపోయింది.

అడవిలో చెట్లమధ్యగా సరయిన దారికూడా లేదు. దారికి అడ్డుగా పువ్వులతో నిండివున్న తీగెలు చెట్లమీద నుండి వేల్లాడుతున్నాయి.

"ఈ అడవిలో ఆటవిక జాతులవాళ్ళు కూడా ఎవరూ లేరేమో! ఇంతదూరం వచ్చినా ఒక్క మనిషి కూడా కనపడ లేదు." అన్నాడు విక్రమ్.

నరేంద్ర మాట్లాడలేదు.

"ఒక్క జంతువు కూడా కనపడలేదు" అన్నాడు రాజు."

"జంతువులు సంచారానికి బయల్దేరే సమయం ఇదే. అందుకే మనం జాగ్రత్తగా వుండాలి. ఈ అడవిలో అన్ని రకాల జంతువులూ వుండే వుంటాయి. ఏమరుపాటుగా వుండకండి" అని అందర్నీ హెచ్చరించాడు.

గుర్రాలు చిన్నగా పరుగుదీస్తున్నాయి.

ఉన్నట్టుండి వాళ్ళకు పసిపిల్లాడి ఏడుపు వినపడింది.

"ఆగండి" అన్నాడు నరేంద్ర వెంటనే గుర్రం కళ్ళెం గట్టిగా లాగి పట్టుకుంటూ.

"ఈ అడవిలో పసిపిల్లాడి యేడుపేమిటి? ఇక్కడ మనుషులున్నారేమో" అన్నది నీలూ....

"లేదు. మనం పసిపిల్లాడి యేడుపు వినలేదు. అది కొండచిలువలకు ఆహారం దొరికినప్పుడు అరుపు. ఇక్కడ దగ్గర్లోనే అది వుండాలి." అంటూ గుర్రంమీద నుండి కిందకు దూకాడు.

మిగిలిన వాళ్లు కూడా దిగారు.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

వెలువడినవి !

1. రాక్షస సంహారం	మల్లాది వెంకట కృష్ణమూర్తి	30.00
2. కాంతి కిరణాలు	'మీరా' లక్ష్మి	25.00
3. పుష్పరాగం	,, ,,	25.00
4. నరసింహావతారం (ఆపన సీరియల్)	వసుంధర	20.00
5. శివరామ్ నేరాలు (ఆపన సీరియల్)	V.S. రావ్	20.00
6. మైనా (సాహిత్య అకాడమి బహుమతి పొందినది)	శీలా వీర్రాజు	25.00
7. ఇంకా ఉంది చాలా దూరం	భట్టిప్రోలు కృష్ణమూర్తి	20.00
8. కొత్త సంగీత విద్యాదర్పణము	ఏటా సుబ్బారావు	60.00

నేడే అడ్వాన్సుతోపాటు మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520 002.

ఇంకోసారి ఆ అరుపు వినపడింది. ఆ వైపుగా చెట్ల లోకి వెళ్ళారు. మసక వెలుగులో ఒక చెట్టుకింద కనపడిన దృశ్యాన్ని చూసి వాళ్ళంతా బొమ్మల్లా నిలబడిపోయారు.

నీలూకి శరీరం గగుర్పొడిచింది దాన్ని చూడగానే.

లావుగా వున్న కొండచిలువ ఒక ఆటవికజాతి యువ కుడి శరీరాన్ని గట్టిగా చుట్టుకుపోయింది. అతడు కింద పడివున్నాడు. అతడి ముఖంలో చావు భయం స్పష్టంగా కనబడుతోంది. చేతులతో దాని పట్టునుండి విడిపించు కోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. కొంచెం దూరంలో అతడి బల్లెం పడివుంది.

కొండచిలువ అరుస్తూ అతన్ని చెట్టుదగ్గిరకు ఈడు స్తోంది చిన్నగా.

ముందుగా నరేంద్ర తేరుకుని రివ్వున ముందుకు పరి గెత్తాడు. కింద పడివున్న ఆటవికుడి బల్లేన్ని అందు కున్నాడు. అప్పుడు చూశాడు ఆటవిక యువకుడు నరేం ద్రను. అతడి కళ్ళు ఆశ్చర్యంతో నిండిపోయాయి.

బల్లేన్ని పైకెత్తి విసురుగా కొండచిలువ మెడమీద గుచ్చాడు.

బల్లేన్ని బయటకు లాగి ఇంకో రెండుసార్లు పొడి చాడు అక్కడే. ఆ తర్వాత దాని శరీరంమీద అక్క డక్కడ పొడిచాడు.

నెత్తురు బయటకు వచ్చింది. కొండచిలువ బాధతో తన్నుకుంటూ ఆటవికుడ్ని తన పట్టునుండి వదిలేసింది.

అతడ్ని లేవదీశాడు నరేంద్ర. (ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
ted at Kranti Press, Madras-600001.

Blank Page

అపరాధ పరిశోధన

రు.7 నవంబర్ '86